www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★

సంపుటి 08, సంచిక: 346 | సోమవారం | 17-11-2025 | ఖమ్మం    Published from: **Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar**    పేజీలు: 12+8 | వెల రూ. 5.00




ఫిలిప్పీన్స్‌లో 'అవినీతి వరద'

నేడు షేక్ హసీనా కేసు తీర్పు లైవ్ టెలికాస్ట్

నెలరోజుల్లో 282 సార్లు ఇజ్రాయెల్ కాల్పుల విరమణ ఉల్లంఘన

02



## సుక్మా జిల్లాలో ఎన్‌కౌంటర్

- సమష్టిగా రూ.15 లక్షల రివార్డు గల ముగ్గురు మావోయిస్టులు మృతి

**సుక్మా :** ఛత్తీస్‌గఢ్‌లో మరోసారి తుపాకుల శబ్దం వినిపించింది. సుక్మా జిల్లాలో ఆదివారం భద్రతా సిబ్బంది, మావోయిస్టులకు మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో రూ.15 లక్షల సమష్టి రివార్డు కలిగి ఉన్న ముగ్గురు నక్సలైట్లు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. భేజ్జీ, చింతగుఫా పోలీస్ స్టేషన్ ప్రాంతం సరిహద్దులోని తుమల్‌పాడ్ గ్రామ అటవీ కొండలలో ఉదయం జిల్లా రిజర్వ్ గార్డ్ (డిఆర్‌జి) బృందం నక్సలైట్ వ్యతిరేక ఆపరేషన్ నిర్వహిస్తుండగా కాల్పులు జరిగాయి. ఈ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నారన్న సమాచారం నిఘా వర్గాల నుంచి అందిందని సుక్మా పోలీస్ సూపరింటెండెంట్ కిరణ్ చవాన్ పిటిఐకి తెలిపారు. కొంత సమయం పాటు అడపాదడపా కాల్పులు జరిగాయన్నారు. ఆ తర్వాత ఇద్దరు మహిళలు సహా ముగ్గురు నక్సలైట్ల మృతదేహాలను ఘటనా స్థలం నుండి స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఎన్‌కౌంటర్ స్థలం నుండి .303 రైఫిల్, బారెల్ గ్రెనేడ్ లాంచర్లు తరువాయి 2లో

## తాళ్లతో బంధించి రూ.55 లక్షలతో పరార్

మాజీ మిలటరీ అధికారి ఇంట్లో నేపాల్ గ్యాంగ్ ఘాతుకం

ప్రజాపక్షం/హైదరాబాద్

ఇంట్లో ఒంటరిగా ఉన్న మాజీ మిలటరీ అధికారిని తాళ్లతో బంధించి రూ.55 లక్షల విలువైన 25 తులాల బంగారు నగలు, రూ.23 లక్షల నగదుతో ఉడాయించిన నేపాలి గ్యాంగ్ ఉదంతం హైదరాబాద్‌లో చోటుచేసుకుంది. ఇంట్లో పనిమనుషులుగా చేరిన దంపతులే తమ అనుచరులతో కలిసి ఈ ఘాతుకానికి ఒడిగట్టారని తేలింది. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. కార్ఖాన పోలీసు స్టేషన్ పరిధిలోని గన్‌రాక్ ఎన్‌క్లేవ్‌లో రిటైర్డ్ ఆర్మీ అధికారి కెప్టెన్ గిరి (75) కుటుంబం నివాసముంటుంది. గత నెల నేపాల్‌కు చెందిన దంపతులు కెప్టెన్ గిరి ఇంట్లో పనిపనుషులుగా చేరారు. ఇక్కడే వారితో పాటు నివాసముంటున్నారు. ఇదిలా ఉండగా శనివారం బంధువుల ఇంట్లో ఫంక్షన్ ఉండడంతో కెప్టెన్ గిరి భార్య, కూతురు ఊరికి వెళ్లారు. ఇంట్లో గిరి ఒక్కడే ఉన్న విషయం పసిగట్టిన నేపాలీ దంపతులు పథకం ప్రకారం మరో నలుగురిని ఆదివారం తెల్లవారు జామున 3 గంటలకు ఇంట్లోకి తీసుకువచ్చారు. అనంతరం ముఠా సభ్యులు గిరిపై కర్రలతో దాడి చేసి, ఆయనను తరువాయి 2లో




## ఐ బొమ్మ, బప్పం వెబ్‌సైట్స్ క్లోజ్

- నిర్వాహకుడు రవిపై ఏడు కేసులు
- వందలాది హార్డ్ డిస్క్‌లు స్వాధీనం

ప్రజాపక్షం /హైదరాబాద్

తనను పట్టుకోండని సవాల్ విసిరి చివరకు పోలీసులకు దొరికిన ఐ బొమ్మ వెబ్‌సైట్ నిర్వాహకుడు రవిపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు ఏడు కేసులు నేమోదు చేశారు. నాంపల్లి కోర్టు ఆదేశాల మేరకు రవిని చంచల్‌గూడ జైలుకు జ్యూడీషియల్ కస్టడీకి పోలీసులు తరలించిన విషయం తెలిసిందే. రవిని మరింత లోతుగా విచారించేందుకు పోలీసులు ఏడు రోజులు పోలీసు కస్టడీ కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై సోమవారం వాదోపవాదనలు జరుగనున్నాయి. ఇదిలావుండగా థియేటర్, ఒటిటిల్లో విడుదలైన సినిమాను విడుదలైనట్లుగా క్షణాల్లో ఆడియన్స్ కు అందుబాటులోకి తీసుకొచ్చాయి తరువాయి 2లో

## సమగ్ర ఎన్నికల సంస్కరణలు అవసరం

మీట్ ది ప్రెస్‌లో సిపిఐ ప్రధాన కార్యదర్శి డి. రాజా



**విజయవాడ :** రాజ్యాంగబద్ధ ఎన్నికల సంఘం పాత్ర ప్రశ్నార్థకమైన నేపథ్యంలో సమగ్ర ఎన్నికల సంస్కరణలు అవసరమని సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజా ఉద్ఘాటించారు. బిహార్ లో ఎన్నికల సంఘం ఎన్నో ఇబ్బందులను కల్పించిందన్నారు. తల్లిదండ్రుల పుట్టిన తేదీ సర్టిఫికెట్లను సమర్పించాలంటూ తీవ్రమైన ఆంక్షలు విధించిందని, తద్వారా అత్యధిక తరువాయి 12లో

# వామపక్షాల ఐక్యతతోనే మతోన్మాదులకు అడ్డుకట్ట

## సిపిఐ ప్రచార జాతాల్లో పలువురు నేతల ఉద్ఘాటన

పెద్దపల్లి, సంగారెడ్డి, మెదక్, నారాయణపేట, మహబూబ్‌నగర్ జిల్లాల్లో కొనసాగిన జాతాలు





ప్రజాపక్షం/పెద్దపల్లి/సంగారెడ్డి/మెదక్/నారాయణపేట/మహబూబ్‌నగర్

మతతత్వ, పెట్టుబడిదారీ బిజెపిని తరిమికొట్టేందుకు వామపక్షాలను బలోపేతం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి పిలుపునిచ్చారు. సిపిఐఐ శతాబ్ది ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని శనివారం జోడేఘాట్ నుండి ప్రారంభమైన బస్సు ప్రచార జాతా ఆదివారం గోదావరి ఖని,శ్రీరామ్‌పూర్, పెద్దపల్లి జిల్లాలోని పలు మండలాలలో కొనసాగింది. ఈ సందర్భంగా సిపిఐ పెద్దపెల్లి జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం అధ్యక్షతన జరిగిన సభలో చాడ వెంకటరెడ్డి ప్రసంగించారు. దేశంలో మతోన్మాద శక్తులను అడ్డుకునేందుకు ఎర్ర జెండా పార్టీలన్నీ ఒక తాటి పైకి రావాలన్నారు. మావోయిస్టులు సైతం కమ్యూనిస్టులతో కలిసి కావాలని, తద్వారా కేంద్రంలోని ప్రజా వ్యతిరేక బిజెపికి అడ్డుకట్టవేయవచ్చునని చెప్పారు. దేశంలో భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి వందేళ్లు పూర్తి కావస్తున్నదని, గడిచిన వందేళ్లలో



దేశంలో పేద ప్రజలు, కార్మికులు, రైతులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై నిరంతరం పోరాడిన ఘనత సిపిఐదేనని చెప్పారు. సిపిఐ వందేళ్ల ముగింపు ఉత్సవాలను డిసెంబర్ 26న ఉద్యమాల గుమ్మం ఖమ్మంలో భారీ ఎత్తున నిర్వహించేందుకు సిద్ధం అవుతున్నదన్నారు. ఈ క్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుండి బస్సు జాతాలను నిర్వహించడం జరుగుచున్నదని చెప్పారు. ఈ జాతా కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్, తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహ, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తరువాయి 12లో



బేగంపేట విమానాశ్రయంలో ఉపరాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్‌కు స్వాగతం పలుకుతున్న గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, సిఎం రేవంత్‌రెడ్డి


## ఉపరాష్ట్రపతికి గవర్నర్ తేనీటి విందు

ప్రజాపక్షం/హైదరాబాద్

ఉపరాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్ శనివారం హైదరాబాద్ చేరుకున్న సందర్భంగా రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ తేనీటి విందు ఇచ్చారు. ఈ విందులో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిలు పాల్గొన్నారు. అంతకుముందు సిపి రాధాకృష్ణన్ హైదరాబాద్ పర్యటన సందర్భంగా బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు గవర్నర్, సిఎం పుష్పగుచ్ఛాలు అందజేసి మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్, రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు,హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి, ప్రభుత్వ సలహాదారుడు వేం.నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, జిల్లా అదనపు కలెక్టర్ జి. ముకుంద రెడ్డి, నాయకులు పొంగులేటి సుధాకర్ రెడ్డి , పోలీసు ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఉపరాష్ట్రపతి పోలీస్‌లచే గౌరవ వందనం స్వీకరించారు.

## పెట్టుబడులకు హైదరాబాద్ అద్భుత నగరం

- డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క
- గ్లోబల్ సమ్మిట్ వేదిక కోసం భారత్ ఫ్యూచర్ సిటీ సందర్శన



ప్రజాపక్షం/హైదరాబాద్

పెట్టుబడులకు హైదరాబాద్ అత్యంత అనుకూల ప్రాంతమని, అద్భుతమైన వాతావరణంతో పాటు తక్కువ ధరలకే నైపుణ్యంతో కూడిన మానవ వనరులు అందుబాటులో ఉన్నాయని డిప్యూటి సిఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాద్ నగరం పెట్టుబడులకు స్వర్గధామంగా ఉంటుందన్నారు. ' గ్లోబల్ సమ్మిట్ వేదిక' పరిశీలనలో భాగంగా భారత్ ఫ్యూచర్ సిటీని భట్టి విక్రమార్క ఆదివారం సందర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ గ్లోబల్ సమ్మిట్‌కు తరువాయి 2లో

## తమ్ముడి ప్రేమ వివాహం అన్న కిడ్నాప్, హత్య



- రంగారెడ్డి జిల్లా ఫరూఖ్‌నగర్ మండలం ఎల్లంపల్లి గ్రామంలో ఘటన
- పరువు హత్యపై భగ్గుమన్న ప్రజాసంఘాలు
- నిందితులను బహిరంగంగా ఉరి తీయాలని డిమాండ్

ప్రజాపక్షం/షాద్‌నగర్

కులాంతర ప్రేమ వివాహం చేసుకున్నాడన్న నెపంతో యువకుడి అన్నను కిడ్నాప్ చేసి అటవీ ప్రాంతంలోకి తీసుకువెళ్ళి హత్య చేసిన ఘటన రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ డివిజన్‌లోని ఫరూఖ్‌నగర్ మండలం ఎల్లంపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఎల్లంపల్లి గ్రామానికి చెందిన ఎర్ర చంద్రశేఖర్ అనే యువకుడు ఓ యువతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న యువతి తండ్రి కాగు వెంకటేశ్ ఈనెల 12వ తేదీ అర్ధరాత్రి చంద్రశేఖర్ అన్న రాజశేఖర్‌ను ఎల్లంపల్లి గ్రామ శివారుకు పిలిపించుకొని కిడ్నాప్ చేసి చిత్ర హింసలు పెట్టినట్లు వివరించారు. ఈ విషయం తెలియగానే కుటుంబ సభ్యులు 100కు ఫోన్ చేసి సమాచారం అందించినా ఫలితం లేకుండా పోయిందని తెలిపారు. దళిత కుటుంబానికి చెందిన ఎర్ర చంద్రశేఖర్ బిసి కులానికి చెందిన యువతిని కులాంతర వివాహం చేసుకున్నాడనే అక్కసుతోనే ఎర్ర రాజశేఖర్‌ను మహబూబ్ నగర్ జిల్లా నవాబ్‌పేట మండల శివారులోని ఆటవీ ప్రాంతంలోకి తీసుకువెళ్ళి తరువాయి 2లో

## లారీని ఢీకొన్న ఆర్‌టిసి బస్సు

- ఇద్దరు మృతి, ఆరుగురికి గాయాలు
- రఘునాథపల్లి మండలం హన్మకొండ – హైదరాబాద్ జాతీయ రహదారిపై ఘటన




ప్రజాపక్షం/రఘునాథపల్లి

తాండూరు, వికారాబాద్‌లో జరిగిన ఆర్టీసి బస్సు ప్రమాదాలను ప్రజలు మరువకముందే, హన్మకొండ–హైదరాబాద్ (163) జాతీయ రహదారిపై హైదరాబాద్ వెళ్తున్న రాజధాని ఎక్స్‌ప్రెస్ బస్సు ఆగి ఉన్న ఇసుక లారీని వేగంగా వెళ్లి ఢీకొట్టింది. ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న ఇద్దరు మృతి చెందగా, మరో ఆరుగురికి గాయాలైన సంఘటన శనివారం అర్ధరాత్రి ఒంటిగంటకు మండలంలోని నిడిగొండ గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. ఈ సంఘటనపై స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వరంగల్ డిపోకు చెందిన టిజి 03 జెడ్ 0046 నంబర్ గల ఆర్టీసి రాజధాని ఎక్స్‌ప్రెస్ హైదరాబాద్ వైపు వెళ్తున్న క్రమంలో నిడిగొండ బ్రిడ్జి దగ్గర జాతీయ రహదారి పక్కన ఆగి ఉన్న ఇసుక లారీని ఆర్టీసీ డ్రైవర్ నిర్లక్ష్యం, అప్రమత్తంగా లేకపోవడం వల్ల ఆగి ఉన్న తరువాయి 12లో

## మెక్సికో అధ్యక్ష భవనంపై జనరేషన్ జెడ్ దాడి

- 100 మంది పోలీసులకు గాయాలు
- 50 నగరాల్లో ప్రభుత్వ వ్యతిరేక ప్రదర్శనలు

**మెక్సికోసిటీ :** మెక్సికోలో అవినీతి–నేరాలను వ్యతిరేకిస్తూ శనివారం జనరేషన్–జెడ్ తరహా నిరసన ప్రదర్శనలు జరిగాయి. వేలాదిమంది ప్రదర్శకులు అధ్యక్ష భవనం 'నేషనల్ ప్యాలెస్'లోకి దూసుకువెళ్ళారు. దేశాధ్యక్షురాలు క్లాడియా షీన్‌బామ్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దీంతో ప్రదర్శకులు, పోలీసులు మధ్య పెద్ద ఎత్తున ఘర్షణ చెలరేగింది. ఈ ఘర్షణల్లో 100 మంది పోలీసులు గాయపడ్డారు. వీరిలో 40 మంది ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు.అనేకమందిని అరెస్టు చేసినట్లు మెక్సికో సిటీ పబ్లిక్ సేఫ్టీ సెక్రటరీ పాబ్లో వెజ్‌క్వెజ్ స్థానిక మీడియా మిలెనియోకు చెప్పారు. ఘర్షణల్లో మరో 20 మంది పౌరులు కూడా గాయపడ్డారు. 20 మందిని తరువాయి 12లో




## ప్రభుత్వ కొలువు... ప్రైవేట్ వ్యాపారం

- నిర్మల్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్ల బాగోతం!
- సమయానికి రాని వైద్యులు – అవస్థల్లో రోగులు

ప్రజాపక్షం/నిర్మల్

నిర్మల్ జిల్లాలో ప్రభుత్వ వైద్యుల సేవలు ప్రజలకు అందకపోవడం, అదే సమయంలో ప్రైవేట్ ఆసుపత్రులలో వ్యాపారం యథేచ్ఛగా కొనసాగడం ఒక పెద్ద సామాజిక ఆరోగ్య సమస్యగా మారింది. ప్రజా వైద్యసేవ అనే తమ ప్రాథమిక బాధ్యతను పూర్తిగా విస్మరించి, ప్రభుత్వ ఖజానా నుండి జీతాలు తీసుకుంటున్న వైద్యులు, తమ దృష్టిని పూర్తిగా సొంత ప్రైవేట్ ఆసుపత్రులు, క్లినిక్‌లపై కేంద్రీకరించడం కొత్త 'ట్రెండ్'గా మారింది. ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లినా,అక్కడి వైద్యులు అత్యంత చాకచక్యంగా తరువాయి 2లో



మీడియా స్వేచ్ఛ అదుపునకు.. స్వచ్ఛందంగా పనిచేసే ప్రెస్‌కౌన్సిల్ అవసరం

బిసిలను కాంగ్రెస్ ప్రభుత్వం.. నమ్మించి మోసం చేస్తే రాష్ట్రం అగ్నిగుండమే

విద్యార్థుల్లో క్రీడానైపుణ్యాలను వెలికితీయడానికి క్రీడా పాఠశాలలు

03



# ప్రపంచం
WORLD NEWS

## చిలీలో అధ్యక్ష పదవికి పోలింగ్



**శాంటియాగో :** చిలీలో దేశాధ్యక్ష పదవికి ఆదివారం ఎన్నికలు జరిగాయి. మొత్తం ఎనిమిది మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. దేశంలో నేరాల పెరుగుదల, వలసలు, భద్రత, వృద్ధి వంటి అనేక అంశాలను అభ్యర్థులు ఎన్నికల ప్రచారంలో ప్రధానాంశాలుగా ముందుకు తెచ్చారు. డిసెంబరు 14న రెండో విడత రన్నాఫ్ ఎన్నికలు జరగకుండా ఉండాలంటే, ఈ మొదటి విడత పోలింగ్‌లో ఏ అభ్యర్థి అయినా 50 శాతం ఓట్లు సంపాదించుకుంటే విజయం సాధించినట్లే. అధికార కమ్యూనిస్టు కూటమి తరపున జెన్నెట్ జారా (51) ప్రధానంగా పోటీలో ఉన్నారు. మితవాదుల తరపున జోస్ అంటోనియో కాస్ట్ (59) ఈసారి గట్టిపోటీ ఇస్తున్నారు. గడచిన జూన్ నెలలో జరిగిన ప్రాథమిక ఎన్నికల్లో జెన్నెట్ జారా 60 శాతం ఓట్లు సంపాదించి చాలా సులభంగా గెలిచి మితవాదులను ఓడించారు.

## నేడు షేక్ హసీనా కేసు తీర్పు లైవ్ టెలికాస్ట్

**ఢాకా :** పదవీచ్యుతురాలైన బంగ్లాదేశ్ ప్రధానమంత్రి షేక్ హసీనాపై బనాయించిన కేసులపై విచారణ జరిపిన ఐసిటి ప్రత్యేక కోర్టు సోమవారం తీర్పు ప్రకటిస్తుంది. దేశంలో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఈ తీర్పును ప్రకటించే ధర్మాసనం సమావేశ కార్యక్రమాన్ని బంగ్లాదేశ్ టెలివిజన్‌తోపాటు ప్రైవేటు టీవీ ఛానల్స్ కూడా లైవ్ టెలికాస్ట్ చేస్తాయని ప్రాసిక్యూటర్ గాజీ మోనవర్ హొస్సేన్ తనవర్ ఆదివారం ఢాకాలో పాత్రికేయులకు చెప్పారు. న్యాయమూర్తులు తీర్పు పాఠాన్ని చదివి వినిపించే భాగాన్ని మాత్రమే లైవ్ టెలికాస్ట్ చేస్తారని చెప్పారు. ఈనెల 17న తీర్పు ప్రకటిస్తామని ఐసిటి గడచిన గురువారం ప్రకటించింది. మానవత్వానికి వ్యతిరేకంగా నేరాలకు పాల్పడిన ఆమెకు ఉరిశిక్ష విధించాలని ప్రాసిక్యూషన్ న్యాయస్థానాన్ని డిమాండ్ చేసింది. ఈ కేసులో ఆమెతోపాటు నాటి హోంమంత్రి అసదుజ్జామన్ ఖాన్ కమల్, మాజీ పోలీస్ ఇన్‌స్పెక్టర్ జనరల్ చౌధురి అబ్దుల్లా మామన్‌లు కూడా సహ నిందితులుగా ఉన్నారు. ఈ ముగ్గురుపై ప్రధానంగా ఐదు ఆరోపణలపై కోర్టు విచారణ జరిపింది. హత్య, హత్యాయత్నాలు, చిత్రహింసలకు గురిచేయడం, ఇతర అమానవీయమైన చర్యల ఆరోపణలను కోర్టు విచారణ చేసింది. నిరాయుధులైన వేలాదిమంది విద్యార్థులపై హింసాత్మక దాడులు చేశారని, వారిని కాల్చి చంపమని హసీనా ఆదేశాలు జారీ చేశారన్నది ప్రధాన అభియోగం. మారణాయుధాలను, హెలికాప్టర్లను, డ్రోన్లను విద్యార్థుల ఉద్యమాన్ని అణచివేసేందుకు ఉపయోగించారన్నది మరో అభియోగం. ఉన్నతస్థాయి కమాండర్లు కుట్రలో భాగమై ఉద్దేశపూర్వకంగా అణచివేత నేరాలకు పాల్పడ్డారన్న అంశం విద్యార్థులను తీవ్ర భావోద్వేగాలకు గురిచేసింది. కుట్రకు పాల్పడి గత ఏడాది జులై 16న బేగం రొకయా విశ్వవిద్యాలయం విద్యార్థి అబూ సయ్యద్‌ను హత్యచేశారనీ, గత ఏడాది ఆగస్టు ఐదో తేదీన ఛంకార్‌పూర్ ప్రాంతంలో నిరాయుధులైన ఆరుగురు విద్యార్థి నాయకులను కాల్చి చంపేందుకు కుట్రపూరితంగా ఆదేశాలు జారీ అయ్యాయన్నది మరో అభియోగం. ఐదుగురు ప్రదర్శకులను కాల్చి చంపారని, ఈ ముగ్గురూ వారిని కాల్చిబూడిద చేయడంతో నేరానికి పాల్పడ్డారని, మరో ప్రదర్శకుణ్ణి సజీవదహనం చేశారన్నది మరో ఆరోపణ.

## సెంట్రల్ జావాలో 11 మంది మృతి

### మరో 17 మంది సజీవ సమాధి

**జకర్తా :** ఆగ్నేయ ఆసియా దేశం ఇండోనేసియాలో అతిపెద్ద దీవి సెంట్రల్ జావాలో భారీ వర్షాలతో కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో 11 మంది మరణించారు. మరో 12 మంది గల్లంతయ్యారు. వారికోసం ఆ ప్రాంతంలో తవ్వకాలు చేస్తూ కొండరాళ్ళను తొలగించి మృతదేహాల కోసం వెదకేందుకు ముమ్మరంగా సహాయ చర్యలు కొనసాగుతున్నాయి. సిలాకాప్ నగరంలో కొండచరియలు విరిగిపడ్డాయి. సిబ్యూనింగ్ గ్రామంలో డజను ఇళ్ళు నేలమట్టమయ్యాయి. దాదాపు మూడు నుండి ఎనిమిది మీటర్ల లోతులో అంటే దాదాపు 25 అడుగుల లోతున ప్రజలు కూరుకుపోయి సమాధికావడంతో సహాయ బృందాలకు వారిని వెలికితీయడం పెద్ద సవాలుగా మారింది. ఇండోనేసియాలో వర్షాకాలం సెప్టెంబరులో ప్రారంభమై ఏప్రిల్ నెల వరకూ కొనసాగుతుంది.

# ఫిలిప్పీన్స్‌లో 'అవినీతి వరద'

### వేలాదిమందితో నిరసన ప్రదర్శనలు ప్రారంభం



**మనీలా :** ఫిలిప్పీన్స్‌లో వరద బాధితుల సహాయం కోసం కేటాయించిన నిధులు దుర్వినియోగమై అవినీతి జరగడంతో దీనిని వ్యతిరేకిస్తూ రాజధాని మనీలాలో వేలాదిమంది ప్రజలు ఆగ్రహంతో వీధుల్లోకి వచ్చారు. మూడు రోజులపాటు ఈ నిరసన ప్రదర్శనలు జరుగుతాయి. దేశాధ్యక్షుడు ఫెర్నాండో మార్కోస్‌పై కూడా అవినీతి ఆరోపణలు ఉన్నాయి. 'అవినీతి నిర్మూలించండి' అంటూ ప్ల కార్డులు ప్రదర్శించారు. రిటైర్డ్ జనరల్స్ సహా అనేకమంది ప్రముఖులు పాల్గొన్నారు. ప్రతిఒక్కరూ తెల్లటి దుస్తులు ధరించి ప్లకార్డులు ప్రదర్శించారు. ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా ప్రతి సంవత్సరం 22 పైగా భారీ తుఫానులను చవిచూసే ఫిలిప్పీన్స్ దేశంలో పాలకులు అనేక వందల బిలియన్ సెసోస్‌ను వరద నియంత్రణ చర్యలకు ఖర్చుపెట్టినట్టు లెక్కల్లో చూపించారు. కానీ ఆచరణలో ఆ ప్రాజెక్టులు ఎక్కడా కనిపించడంలేదు. ఇటీవల వారం రోజుల వ్యవధిలో వచ్చిన టైఫూన్ కల్మెగీ, టైఫూన్ ఫాంగ్–వాంగ్ అనే రెండు భారీ తుఫానుల కారణంగా వందలమంది మరణించారు. లక్షలాదిమంది ప్రజలు నిరాశ్రయులయ్యారు. ఈ పరిస్థితుల్లో నిత్యం పేదరికంలో జీవిస్తున్న ప్రజల జీవితాలు తుఫానుల కారణంగా ఏ మాత్రం మెరుగుపడటంలేదు. ఈ బాధలు తట్టుకోలేక ప్రజల్లో తీవ్ర ఆగ్రహం పెల్లుబికింది. గడచిన ఆదివారం కూడా ఫిలిప్పీన్స్‌లోని క్వెజోన్ సిటీ శివారులో ఉన్న పీపుల్స్ పవర్ మాన్యుమెంట్ వద్ద రిటైర్డ్ జనరల్స్ ప్రత్యేకంగా నిరసన ప్రదర్శన నిర్వహించారు. చర్చ్ ఆఫ్ క్రైస్ట్ (ఇగ్లెసియాని క్రిస్టో) నాయకత్వాన మూడు రోజుల ర్యాలీ మనీలాలోని రిజల్ పార్కులో ప్రారంభమైంది. 3.20 లక్షల మంది ఈ చర్చ్ ఆఫ్ క్రైస్ట్‌లో సభ్యులుగా ఉన్నారు. వీరిలో వేలాదిమంది నిరసన ప్రదర్శనలో పాల్గొన్నారు. వరదలను నియంత్రించేందుకు ఫిలిప్పీన్స్‌లో వందల సంఖ్యలో నిర్మించిన అనేక ప్రాజెక్టులు ఎలాంటి నాణ్యతా ప్రమాణాలు లేకుండా నిర్మించారన్న విషయం ఇటీవలి కాలంలో తేలిపోయింది. అనేక నివేదికలు కూడా ఈ విషయం చెప్పాయి. దీంతో ప్రజా నిరసన ప్రదర్శనలు ఇటీవలి నెలల్లో జోరుగా జరుగుతున్నాయి. ప్రభుత్వ ఇంజనీర్లు, ప్రభుత్వ ప్రజా పనుల వ్యవస్థ అధికారులు, నిర్మాణ కంపెనీల కార్యనిర్వాహక అధికారులు నిజనిర్ధారణ కమిటీల ఎదుట సాక్ష్యం చెప్పారు. సెనేట్, కాంగ్రెస్‌కు చెందిన ప్రతినిధులు, అధికారులు నాణ్యతలేని ప్రాజెక్టులు నిర్మించారని, అవినీతికి పాల్పడ్డారని, ఈ అవినీతి వల్ల అనేక ప్రాజెక్టులు ఎప్పటికీ పూర్తికాకుండా మిగిలిపోయాయని తీవ్ర ఆరోపణలు వెలుగుచూశాయి. 86 నిర్మాణ కంపెనీల అధికారులపై క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. వారంతా దాదాపు 152 బిలియన్ ఆలర్లు పన్నులు ఎగవేసినట్లు ఆరోపణలు వచ్చాయి. దేశవ్యాప్తంగా అనేక సంఘాలు, సంస్థలు ప్రభుత్వం, అధికారుల అవినీతికి వ్యతిరేకంగా రాబోయే రెండు రోజుల్లో వరుసగా ఒకరితర్వాత మరొకరు నిరసన ప్రదర్శనలు నిర్వహించేందుకు ప్రణాళిక రచించారు. ఐతే సైన్యం ప్రభుత్వానికి అండగా నిలబడింది. ప్రదర్శనలను, ప్రదర్శకులను అదుపు చేయడానికి వేలాదిమంది భద్రతా సిబ్బందిని మొహరించారు. సెప్టెంబరు నెలలో కూడా అవినీతికి వ్యతిరేకంగా నిరసన ప్రదర్శన జరిగింది. వందలమంది నల్ల ముసుగులు ధరించిన నిరసన ప్రదర్శకులు మనీలాలోని అధ్యక్ష భవనం సమీపంలో ఉన్న పోలీసులపై రాళ్ళు విసిరారు. మండుతున్న ఫైర్ బాంబులను విసిరారు. ఈ ఘటనల్లో 100 మంది పోలీసులు గాయపడ్డారు. 97 మంది ప్రదర్శకులపై పోలీసులు కేసులు నమోదు చేశారు.

### నెలరోజుల్లో 282సార్లు

## ఇజ్రాయెల్ కాల్పుల విరమణ ఉల్లంఘన

**గాజా :** గాజాలో అక్టోబరు 10వ తేదీన ట్రంప్ చొరవతో కాల్పుల విరమణ ఒప్పందం అమలులోకి వచ్చిన తర్వాత 36 రోజుల్లో ఇజ్రాయెల్ 282 సార్లు కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిందని గాజా గవర్నమెంట్ మీడియా ప్రకటించింది. తాజాగా ఆదివారం మరో ముగ్గురు పాలస్తీనియన్లు ఇజ్రాయెల్ కాల్పుల్లో మరణించారు. 88సార్లు పాలస్తీనియన్లపై కాల్పులు జరిపారని, 124 సార్లు బాంబు దాడులు చేశారని, 12 సార్లు సైన్యం నిర్దేశిత ఎల్లో లైన్‌ను దాటి లోపలికి వచ్చి దాడులకు పాల్పడిందని తెలిపింది. ప్రజల ఇళ్ళను ధ్వంసం చేసిన ఘటనలు నెలరోజుల్లో 52 జరిగాయి. 23 మంది పాలస్తీనియన్లను నిర్బంధంలోకి తీసుకున్నారు. అదేవిధంగా కీలకమైన మానవతా సహాయాన్ని గాజాలోకి ప్రవేశించకుండా ఇప్పటికీ ఇంకా ఇజ్రాయెల్ సైనికులు అడ్డుకుంటున్నారు. దీనిపై ఐక్యరాజ్యసమితి మానవతా విభాగం అనేకసార్లు నిరసన వ్యక్తం చేసింది. ఐక్యరాజ్యసమితి నేరుగా హెచ్చరికలు జారీ చేసింది. గాజా–ఇజ్రాయెల్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందానికి వీలుగా డోనాల్డ్ ట్రంప్ 20 అంశాల శాంతి ఒప్పందాన్ని ప్రపంచం ముందుకు తెచ్చారు. గాజా ఉగ్రవాదం లేని స్వేచ్ఛా మండలంగా ఉంటుంది, సాధారణ జీవన కార్యకలాపాలకోసం గాజాను తిరిగి అభివృద్ధి చేస్తారు, ఇరు పక్షాలు అంగీకరించగానే యుద్ధం ముగుస్తుంది.

ఒప్పందం కుదిరిన 72 గంటల్లో ఇరుపక్షాలు సజీవ–నిర్జీవ బందీలను, ఖైదీలను పరస్పరం మార్పిడి చేసుకుంటారు, 250 మంది జీవిత ఖైదీలను, మరో 1700 మంది నిర్బంధంలో ఉన్న పాలస్తీనియన్లను ఇజ్రాయెల్ విడుదల చేస్తుంది, హమాస్ ఉగ్రవాదులు ఆయుధాలు వదిలిపెడతారు, వారు సురక్షితంగా గాజా వదిలివెళ్ళిపోయేందుకు అనుమతిస్తారు, గాజాను పునర్నిర్మించేందుకు తక్షణం పూర్తిస్థాయి మానవతా సహాయం గాజాలోకి ప్రవేశిస్తుంది, రఫా క్రాసింగ్ తెరుస్తారు, ఐక్యరాజ్యసమితి మానవతా సహాయం గాజాలోకి రావడం ప్రారంభిస్తుంది, బ్రిటన్ మాజీ ప్రధానమంత్రి టోనీ బ్లెయిర్, ట్రంప్ నాయకత్వాన గాజా పాలనకు తాత్కాలిక కమిటీ ఏర్పడుతుంది వంటి అనేక అంశాలతో ట్రంప్ రూపొందించిన శాంతి ఒప్పందాన్ని అరబ్ దేశాలు, ముస్లిం దేశాలు, హమాస్, ఇజ్రాయెల్ అంగీకరించడతో కాల్పుల విరమణ ఒప్పందం అమలులోకి వచ్చింది. కానీ 36 రోజులు గడచిన తర్వాత కూడా ఇజ్రాయెల్ దాష్టీకాలకు తెరపడలేదు.

**గాజాలో స్కూళ్ళ సందడి :** గాజాలో మళ్ళీ మెల్లిగా స్కూళ్ళు తెరచుకుంటున్నాయి. ఈ పగటిపూట మెల్లిగా పాఠశాలలు నడుస్తుండగా, రాత్రివేళ ఈ స్కూళ్ళే నిరాశ్రయులకు నిద్ర కేంద్రాలుగా మారుతున్నాయి. 2023 అక్టోబరు నుండి గాజాలో యుద్ధం ప్రారంభం కావడంతో స్కూళ్ళను నిరవధికంగా మూసివేశారు. నెలరోజుల క్రితం శాంతి ఒప్పందం కుదిరిన తర్వాత ఇప్పుడిప్పుడే మెల్లిగా స్కూళ్ళు తెరచుకుంటున్నాయి. గాజా యుద్ధంతో ప్రధానంగా పిల్లలు, మహిళలు వేలాది మంది మరణించారు. గాజాలో యుద్ధం వల్ల 64,000 మంది పిల్లలు హతులైనట్లు యూనిసెఫ్ అంచనావేసింది. అనేకమంది ఆకలి చావులకు గురయ్యారు.

పాలస్తీనా శరణార్థులకోసం ఐక్యరాజ్యసమితి సహాయ, పునరావాస కార్యక్రమాల ఏజన్సీ (యుఎన్‌ఆర్‌డబ్ల్యుఎ) ఈ స్కూళ్ళు తెరిచే కార్యక్రమం ప్రారంభించింది.

### వెబ్‌సైట్స్ క్లోజ్
(మొదటి పేజీ తరువాయి)

ఇతని ఐ బొమ్మ వెబ్ సైట్. వీటి నిర్వాహకుడైన ఇమ్మడి రవి.. ఫ్రాన్స్ నుంచి హైదరాబాద్ కు ఓ కేసు విషయమై వచ్చి.. పోలీసులకు అడ్డంగా దొరికిపోయాడు. అతడిని అరెస్ట్ చేసిన పోలీసులు.. వెబ్ లాగిన్స్, సర్వర్ల వివరాలతో రవితోనే వాటిని మూసివేయించారు. అలాగే రవి నుంచి స్వాధీనం చేసుకున్న వందలాది హార్డ్ డిస్క్ లను విశ్లేషించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. అతని బ్యాంక్ అకౌంట్ల లావాదేవీలను పరిశీలిస్తున్నారు. ఈ అకౌంట్‌లో ఉన్న రూ.3 కోట్లను పోలీసుల ఫ్రీజ్ చేశారు. ఈకేసులో అతని నుంచి మరిన్ని వివరాలను సేకరించేందుకు పోలీసులు విచారణ చేయనున్నారు. దమ్ముంటే పట్టుకోండి.. నా వెబ్ సైట్ జోలికి వస్తే.. నా వద్ద ఉన్న కోట్ల మంది డేటాను లీక్ చేస్తా. ఈ వెబ్ సైట్ పై ఫోకస్ చేయడం ఆపండి అంటూ.. గతంలో ఇమ్మడి రవి పోలీస్ శాఖను హెచ్చరిస్తూ ఒక లేఖను విడుదల చేశాడు. ఇది సోషల్ మీడియాలో వైరల్ అయింది. రవి హెచ్చరికను సవాల్ గా తీసుకున్న పోలీసులు అతడిని అరెస్ట్ చేయడమే కాక.. అతనితోనే వెబ్ సైట్ సర్వర్లను క్లోజ్ చేయించడం చర్చనీయాంశంగా మారింది. తెలంగాణ పోలీసులతో పెట్టుకుంటే ఇలాగే ఉంటుందని నెటిజన్లు పోస్టులు పెడుతున్నారు.

### రూ.55లక్షలతో పరార్
(మొదటి పేజీ తరువాయి)

కట్టేశారు. ఆ తర్వాత ఇంట్లోని బీరువాను పగులగొట్టి సుమారు రూ.55 లక్షల విలువైన సొత్తును దోచుకెళ్లారు. దాదాపు 25 తులాలకు పైగా బంగారం, రూ. 23 లక్షల నగదును దుండగులు అపహరించినట్లు బాధితుడి కుటుంబసభ్యులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. సమాచారం అందుకున్న కార్ఖానా పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఇంట్లో పనిచేసే వ్యక్తి వివరాల ఆధారంగా దర్యాప్తు ముమ్మరం చేశారు.

### సుక్మా జిల్లాలో ఎన్‌కౌంటర్
(మొదటి పేజీ తరువాయి)

(బిజిఎల్‌లు), ఇతర ఆయుధాలు, పేలుడు పదార్థాలను కూడా స్వాధీనం చేసుకున్నట్లు అధికారి తెలిపారు. మరణించిన ఉగ్రవాదులను ఏరియా కమిటీ సభ్యుడు మాద్వి దేవా, సిఎన్ఎం (చేత్నా నాట్య మండలి మావోయిస్టుల సాంస్కృతిక సంస్థ) కమాండర్ పోడియం గంగి, కిష్టారాం ఏరియా కమిటీ సభ్యురాలు సోధి గంగిగా గుర్తించారు. ఇద్దరూ మహిళలేనని చవాన్ తెలిపారు. వారందరికీ ఒక్కొక్కరికి రూ. 5 లక్షల రివార్డును ప్రకటించినట్లు తెలిపారు. స్నిపర్ స్పెషలిస్ట్, మావోయిస్టుల కొంటా ఏరియా కమిటీ సభ్యుడు దేవా అనేక మంది అమాయక పౌరుల హత్యలో పాల్గొన్నాడని అధికారి తెలిపారు. పరిసర ప్రాంతాల్లో ఇంకా సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోందన్నారు. బస్తర్ ప్రాంతంలో నక్సలిజం ఇప్పుడు చివరి దశలో ఉందని, మావోయిస్టు కార్యకర్తలు హింసను విడనాడి ప్రభుత్వ పునరావాస విధానాన్ని స్వీకరించడం తప్ప వేరే మార్గం లేదని బస్తర్ రేంజ్ ఐజి సుందర్‌రాజ్ పట్టిలింగం అన్నారు. ఈ సంవత్సరం ఇప్పటివరకు బస్తర్ పరిధిలో కేంద్ర కమిటీ సభ్యులు, దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యులు, పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (పిఎల్‌జిఎ) కేడర్లు సహా మొత్తం 233 మంది మావోయిస్టులు హతమయ్యారని, ఇందులో సుక్మాతో సహా ఏడు జిల్లాలు ఉన్నాయని ఆయన అన్నారు. తాజా ఎన్‌కౌంటర్‌తో ఈ సంవత్సరం ఇప్పటివరకు ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్లలో 262 మంది నక్సలైట్లు మరణించారు. వారిలో 233 మంది బస్తర్ డివిజన్‌లో హతమవగా, మరో 27 మంది రాయ్‌పూర్ డివిజన్‌లోని గరియాబంద్ జిల్లాలో కాల్పులు జరిపారు. దుర్గ్ డివిజన్‌లోని మోహ్లామన్‌పూర్–అంబాఘర్ చౌకి జిల్లాలో ఇద్దరు నక్సలైట్లు హతమయ్యారు. గత నెలలో ఛత్తీస్‌గఢ్‌లో దాదాపు 300 మంది నక్సలైట్లు లొంగిపోగా, సీనియర్ నక్సలైట్ మల్లోజుల వేణుగోపాల్ రావు అలియాస్ భూపతి మరియు 60 మంది ఇతర కేడర్లు మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో తమ ఆయుధాలను విడిచిపెట్టారు.

### అద్భుత నగరం
(మొదటి పేజీ తరువాయి)

ప్రపంచ వ్యాప్తంగా పారిశ్రామికవేత్తలను ఆహ్వానిస్తున్నామని, ఇందుకోసం భారత్ ఫ్యూచర్ సిటీ, హైటెక్స్, గచ్చిబౌలి, దుండిగల్ తదితర ప్రాంతాలను వేదికల కోసం పరిశీలిస్తున్నామని వివరించారు. గ్లోబల్ సమ్మిట్‌కు ప్రపంచ వ్యాప్తంగా తరలివస్తున్న పారిశ్రామికవేత్తలకు ప్రజా ప్రభుత్వ రెండేళ్ల పాలనలో సాధించిన విజయాలతో పాటు ' తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్2047' ను ప్రపంచానికి వివరించాలని సిఎం రేవంత్ రెడ్డితో పాటు యావత్ క్యాబినెట్ ప్రత్యేక నిర్ణయం తీసుకుందన్నారు. 2047 సంవత్సరం వరకు తెలంగాణ ఏ రకంగా ఉండబోతుంది, ఏ రకంగా ఉండాలి అనే విషయాలను ప్రజా ప్రభుత్వం వివరించదలుచుకున్నదని అన్నారు. రెండేళ్ల కాలంలో ప్రజా ప్రభుత్వం సాధించిన విజయాలను వివరిస్తూ భవిష్యత్తు ప్రణాళికను చాటి చెప్పేందుకు నగరానికి నలు దిక్కులా అవసరమైన వేదిక కోసం భారత్ ఫ్యూచర్ సిటీలో 100 ఎకరాల ఓపెన్ ల్యాండ్‌ను పరిశీలిస్తున్నామన్నారు. ఇటీవల దుబాయ్ ఫెస్టివల్ నిర్వాహనకు ఒక కొత్త నగరాన్ని దుబాయ్ బయట ప్రాంతంలో ఎంపిక చేసి నిర్వహించినట్లు డిప్యూటి సిఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఈ సమావేశంలో ఉన్నతాధికారులు సందీప్ కుమార్ సుల్తానియా, వికాస్ రాజ్, శశాంక, నర్సింహారెడ్డి, కృష్ణ భాస్కర్, ముషారఫ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగంలో కాలానుగుణ మార్పులు అవసరం

### ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలోనూ క్రీమీలేయర్ ఉండాలి
### సిజెఐ జస్టిస్ బీఆర్ గవాయ్
### చాయ్‌వాలా ప్రధాని అయ్యారంటే అది రాజ్యాంగం వల్లే : సిఎం చంద్రబాబు




**అమరావతి :** ప్రాథమిక హక్కులకు భంగం కలిగితే కోర్టులను ఆశ్రయించే హక్కు రాజ్యాంగం కల్పించిందని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ అన్నారు. భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మంగళగిరిలోని సీకే కన్వెన్షన్‌లో ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం ఏర్పాటు చేసిన సెమినార్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని 'ఇండియా అండ్ ది లివింగ్ ఇండియన్ కానిస్టిట్యూషన్ 75 ఇయర్స్' అనే అంశంపై కీలకోపన్యాసం చేశారు. సాంఘిక, ఆర్థిక, న్యాయ సాధన కోసం రాజ్యాంగంలో ఆదేశిక సూత్రాలను పొందుపరిచారని, రాజ్యాంగాన్ని రాజ్యాంగ సభకు అప్పగిస్తూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చేసిన ప్రసంగం... ప్రతి న్యాయవాదికి కంఠోపాఠం కావాలన్నారు. రాజ్యాంగాన్ని అంబేద్కర్ ఒక స్థిర పత్రంగా చూడలేదని, కాలానుగుణంగా మార్పులు అవసరమనే భావించారని తెలిపారు. అంశం ప్రాధాన్యతను అనుసరించి సవరణ విధానాలను పొందుపరిచారని అన్నారు. కొన్ని అంశాల్లో సవరణ సులభమని... కొన్ని అంశాల్లో చాలా కఠినమని సీజేఐ జస్టిస్ గవాయ్ తెలిపారు. రాజ్యాంగం అమలులోకి వచ్చిన మరుసటి ఏడాదే రిజర్వేషన్ల అంశంపై మొదటి సవరణ చేసుకున్నామని గుర్తు చేశారు. రాజ్యాంగ సవరణ అంశంపై కేంద్రానికి, సుప్రీం కోర్టుకు మొదట్లో కొంత ఘర్షణ వాతావరణం ఏర్పడిందన్నారు. కేశవానంద భారతి కేసులో రాజ్యాంగం మౌలిక స్వరూపాన్ని సవరించరాదని సుప్రీం కోర్టు చెప్పిందన్నారు. 1975 వరకు ఆదేశిక సూత్రాల కంటే ప్రాథమిక హక్కులకే ఎక్కువ ప్రాధాన్యత ఉండేదని, కేశవానంద భారతి కేసు తర్వాత ప్రాథమిక హక్కులతో పాటు ఆదేశిక సూత్రాలకూ సమ ప్రాధాన్యం దక్కిందన్నారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా గత ఏడాది ఏడుగురు జడ్జిల సుప్రీం కోర్టు ధర్మాసనం తీర్పు ఇచ్చిందని, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలోనూ క్రీమీలేయర్ విధానం ఉండాలన్నది తన అభిప్రాయంగా ఆయన తెలిపారు. పని ప్రదేశాల్లో మహిళలపై వివక్ష ఉండరాదని విశాఖ కేసు తీర్పులో సర్వోన్నత న్యాయస్థానం తీర్పు ఇచ్చిందని చెప్పారు. కొన్నేళ్లుగా మహిళలు న్యాయ విద్యలో బాగా రాణిస్తున్నారన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కుల పట్ల ప్రజలకు అవగాహన ఉండాలని సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ అన్నారు. సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ మహారాష్ట్రలోని అమరావతి నుంచి వచ్చిన జస్టిస్ గవాయ్ అత్యంత సరళమైన వ్యక్తిత్వం గల, సమానత్వ భావనకు ప్రాధాన్యం ఇచ్చే న్యాయవేత్త అని అన్నారు. సీజేఐగా గవాయ్, ఏపీ సీజేగా ధీరజ్ సింగ్ ఠాకూర్, తాను సీఎంగా అందరూ రాజ్యాంగబద్ధంగా విధులు నిర్వర్తిస్తున్నామని చెప్పారు. రాజ్యాంగం అందించిన సమాన హక్కులు, అవకాశాల వల్లనే ఒకప్పుడు 'చాయ్ వాలా' గా జీవితం ప్రారంభించిన నరేంద్ర మోదీ దేశ ప్రధానిగా ఎదిగారని అన్నారు. ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం 75 ఏళ్ల ప్రయాణంలో ఎన్నో చారిత్రక ఘట్టాలను అధిగమించిందని తెలిపారు. బ్రిటీషు పాలనలో భారతీయులకు జవాబుదారీతనం లేని పరిస్థితులు నెలకొన్నాయని, దేశ సంపద దోపిడీకి గురై అణచివేత పెరిగిన కష్టకాలంలోనే స్వేచ్ఛ కోసం, సొంత రాజ్యాంగం కోసం భారీ పోరాటం సాగిందని అన్నారు. భావోద్వేగ సందర్భంలో రూపుదిద్దుకున్న రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన అవకాశాలు, జవాబుదారీతనం కల్పించేలా రూపొందించబడిందని ఆయన తెలిపారు.

పేదలు, వెనుకబడిన వర్గాలు, మైనార్టీల రక్షణ కోసం ప్రత్యేక నిబంధనలు, ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు సమకూర్చిన విప్లవాత్మక పత్రంగా రాజ్యాంగం నిలిచిందని సూచించారు. శంకరీ సింగ్, సజ్జన్ సింగ్, గోలక్ నాథ్, ఎస్సార్ బొమ్మై, కేశవానంద భారతి వంటి కేసులు రాజ్యాంగ చరిత్రలో కీలక మలుపులుగా నిలిచాయని అన్నారు. మహిళా రిజర్వేషన్ల చట్టం, కార్యాలయాల్లో మహిళలపై వేధింపుల నిరోధక చట్టం, లోకాయుక్త చట్టం వంటి వాటి ద్వారా న్యాయ వ్యవస్థలో ముఖ్య మార్పులు చోటుచేసుకున్నాయని జస్టిస్ ఠాకూర్ పేర్కొన్నారు.

### ప్రైవేట్‌లో వ్యాపారం
(మొదటి పేజీ తరువాయి)

ఈ కేసు మా ప్రైవేట్ హాస్పిటల్‌లో చేయాలి, అక్కడే మంచి సదుపాయం ఉంటుంది, అంటూ రోగులను తమ సొంత వ్యాపార కేంద్రాలకు మళ్లిస్తున్నారు.ఈ వైఖరి నైతికతకు,ప్రభుత్వ ఉద్యోగ నియమాలకు,ప్రజా విశ్వాసానికి పూర్తిగా విరుద్ధంగా ఉంది.

**ఆసుపత్రులలో ఆలస్యం,అంతులేనిలోపాలు**

జిల్లాలో ఒక గవర్నమెంట్ ఏరియా హాస్పిటల్,రెండు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు,22 ప్రైమరీ హెల్త్ సెంటర్లు (పీహెచ్‌సీలు) ఉన్నప్పటికీ, వాటి పరిస్థితి అత్యంత ఆవేదన కలిగించేలా ఉంది.ఆసుపత్రుల భవనాలు ఉనికిలో ఉన్నా, వైద్యులు, అందుబాటులో ఉండడం లేదు. ఉదయం 9 గంటలకు ప్రారంభం కావాల్సిన ఓపీడీ సేవలు తరచుగా ఆలస్యంగా మొదలవుతున్నాయి. మధ్యాహ్నం అయ్యేసరికి వైద్యులు కనిపించకపోవడం సాధారణమైపోయింది. సాయంత్రం 4 గంటల వరకు కొనసాగాల్సిన విధులు, సగం దాకా పూర్తయ్యేలోపే “పేషెంట్ లేదు,”“మీటింగ్ ఉంది,” లేదా “ఫీల్డ్ డ్యూటీ ఉంది” అంటూ డాక్టర్లు హాస్పిటల్‌ను విడిచి వెళ్లిపోతున్నారు.దీని ఫలితంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పీహెచ్‌సీలు కేవలం భవనాలుగా మారి “వైద్యుడు సెలవు” అనే బోర్డు పెట్టి మూసేస్తున్నారు.

**ప్రైవేట్ ప్రాక్టీస్‌పై ఉక్కుపాదం ఏదీ..?**

తెలంగాణ మెడికల్ ఎడ్యుకేషన్ సర్వీస్ నియమాల ప్రకారం, ప్రభుత్వ వైద్యులు ప్రైవేట్ ప్రాక్టీస్ చేయరాదు.కానీ,ఈ ఆదేశాలు జిల్లాలో కాగితాలకే పరిమితమయ్యాయి.ప్రభుత్వం స్పష్టంగా నిషేధించినా,చాలా మంది వైద్యులు విధి సమయాల్లో ప్రభుత్వ ఆసుపత్రుల్లో లేకపోగా,రాత్రివేళలలో తమ ప్రైవేట్ క్లినికుల్లో వైద్యం చేస్తూ సొంత రోగులకు ఆకర్షిస్తున్నారు.జిల్లా ఆరోగ్యాధికారులు..స్థానిక పరిపాలన ఈ స్పష్టమైన ఆదేశాలను పట్టించుకోవడం లేదు. ఫలితంగా,ప్రభుత్వ జీతాలు,ప్రైవేట్ ఆదాయం అనే మూడు పువ్వులు ఆరు కాయలుగా ఈ దంగా నిర్భంధంగా కొనసాగుతోంది.

**రోగుల జేబుకు చిల్లు..దోపిడి యథేచ్ఛ..**

ప్రభుత్వ ఆసుపత్రులలో మౌలిక వసతులు లేకపోవడం రోగులకు మరో పెద్ద సమస్యగా మారింది. రోగులకు అవసరమైన మందులు లభించకపోవడం, చిన్న పరీక్షల కోసం కూడా బయటకు పంపడం,ప్రైవేట్ ల్యాబ్‌లకు సిఫారసు చేయడం ద్వారా పేద ప్రజల జేబు నుంచి డబ్బులు లాగించడం రోజువారీ ఘటనగా మారింది.ఈ పరిస్థితి కారణంగా ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రులపై విశ్వాసం కోల్పోతున్నారు.

**కళ్లు మూసుకున్న జిల్లా యంత్రాంగం...**

వైద్యులు హాజరు. విధి నిర్వహణ, సమయపాలనను పర్యవేక్షణ చేయాల్సిన జిల్లా అధికారులు సైతం ఈ వ్యవహారంపై కళ్లు మూసుకున్నారు.ఆరోగ్య విభాగం లోపలే ఈ అవకతవకలపై వస్తున్న ఫిర్యాదులు దాచిపెట్టబడుతున్నాయి. రోగుల బాధ,ప్రజల విన్నపాలు ఏ అధికారిని కూడా కదలించడం లేదు. ప్రస్తుతం పరిస్థితి భిన్నంగా ఉందివిధి సమయాల్లో ప్రభుత్వ ఆసుపత్రుల గదులు ఖాళీగా ఉంటే,అదే సమయంలో వైద్యుల సొంత ప్రైవేట్ ఆసుపత్రుల ఎదుట క్యూలు కనిసిస్తున్నాయి. ప్రజల డబ్బుతో జీతాలు తీసుకుంటూ, మళ్ళీ ప్రజలే డబ్బు చెల్లించి చికిత్స పొందే ఈ పరిస్థితి నిర్మల్ జిల్లాలోని చేదు వాస్తవంగా మారింది.

### అన్న కిడ్నాప్, హత్య
(మొదటి పేజీ తరువాయి)

పెట్రోల్ పోసి నిప్పంటించి హత్య చేశారని గ్రామస్తులు తెలిపారు. కులాంతర వివాహం చేసుకుంటే హత్యలు చేస్తారా అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. తమ్ముడు ప్రేమించి పెళ్ళి చేసుకుంటే అన్నను ఎందుకు హత్య చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఎర్ర రాజశేఖర్‌ను హత్య చేసిన కాగు వెంకటేష్‌తోపాటు అందుకు సహకరించిన వ్యక్తులను బహిరంగంగానే ఉరి తీయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేయనున్నట్లు హెచ్చరించారు.

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి

కులాంతర వివాహం చేసుకున్న తమ్ముడి అన్నను హత్యచేసిన అమ్మాయి తండ్రి కాగు వెంకటేష్‌తోపాటు మరికొందరి వ్యక్తులను బహిరంగానే ఉరి తీయాలని ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం ఫరూఖ్‌నగర్ మండలం ఎల్లంపల్లి గ్రామంలోని మృతుడు ఎర్ర రాజశేఖర్ కుటుంబ సభ్యులను ప్రజా సంఘాల నేతలు పరామర్శించారు. ఈ హత్యలో అమ్మాయి తండ్రి ఒక్కడే కాదని, అనేక మంది ఉన్నారని, వారందరిని బయటకు తీయాలని డిమాండ్ చేశారు. పోలీసులు తమ ప్రవర్తనను మార్చుకొని మేజర్లు అయిన యువతి, యువకులను రక్షణ కల్పించేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి పూర్తిగా న్యాయం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించడంతోపాటు ఫాస్ట్‌ట్రాక్ కోర్టును ఏర్పాటు చేసి విచారణ చేయాలని సూచించారు.

**శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు**

శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా అన్ని విధాల చర్యలు తీసుకుంటున్నామని షాద్‌నగర్ ఏసిపి లక్ష్మీ నారాయణ వివరించారు. ధర్నాలు, రాస్తారోకోలు చేస్తున్న ప్రజా సంఘాల నేతలను శాంతిప చేశామని, బాధిత కుంటుంబానికి న్యాయం చేయడంతోపాటు ఈ ఘటనకు పాల్పడిన నింధితులను కఠినంగా శిక్షలు పడే విధంగా చర్యలు తీసుకుంటున్నామని, ఇందుకు ప్రజలందరు సహకరించాలని కోరారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## లోక్ అదాలత్‌లో 74,782 కేసులు రాజీ

### సిఐడి అదనపు డిజి చారుసిన్హా

ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్ర హైకోర్టు, లీగల్ సర్వీసెస్ అథారిటీ శనివారం నిర్వహించిన ప్రత్యేక లోక్ అదాలత్‌ల ద్వారా 74,782 కేసులు రాజీ కుదుర్చుకోవడంతో పరిష్కారం అయ్యాయని సిఐడి అదనపు డిజి చారుసిన్హా ఒక ప్రకటనలో తెలిపారు. పెండింగ్ కేసుల పరిష్కారం కోసం ఇరుపార్టీల మధ్య కాంపౌండింగ్ ద్వారా సామరస్యంగా పరిష్కరించుకునేందుకు ఈ లోక్‌అదాలత్ ఉపయోగపడిందని చారుసిన్హా పేర్కొన్నారు. దీని కొనసాగింపుగా పోలీసు శాఖ పరిష్కారానికి అర్హత ఉన్న కేసులను గుర్తించి, ఇరు పక్షాలకు నోటీసులు జారీ చేసింది. పరిష్కార ప్రక్రియ గత నెల 27న మొదలై ఈ నెల 11న ముగిసింది. ఈ ప్రక్రియలో మొత్తం 74,782 కేసులు విజయవంతంగా పరిష్కారమయ్యాయి. ఇందులో 14,642 కాంపౌండ్ కేసులు కాగా 154 కేసులు విపత్తు నిర్వహణ కేసులు, 23,400 ఇపెట్టి కేసులు, 31,189 మోటారు వాహనాల చట్టం కేసులు, 5,397 సైబర్ క్రైమ్ కేసులు పరిష్కారం అయ్యాయని తెలిపారు.

## నిబంధనలతో జిన్నింగ్ మిల్లర్లు నష్టపోతున్నారు



### వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు

ప్రజాపక్షం/హైదరాబాద్ : కేంద్రంలోని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) నిబంధనలు తమకు నష్టాలు కలిగించే విధంగా ఉన్నాయని నిరసిస్తూ 'జిన్నింగ్ మిల్లుల ప్రతినిధులు' పత్తి కొనుగోళ్లను నిలిపివేస్తామని అల్టిమేటం జారీ చేసిన నేపథ్యంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు జోక్యం చేసుకున్నారు. జిన్నింగ్ మిల్లర్ల సమస్యల అంశాన్ని కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ కార్యాలయ అధికారులతో ఆయన మాట్లాడారు. కేంద్రం ప్రవేశపెట్టిన ఎల్1, ఎల్2 నిబంధనలతో జిన్నింగ్ మిల్లర్లు పడుతున్న ఇబ్బందులను ఆయన కేంద్ర ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మిల్లర్ల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని వ్యవసాయ శాఖ కార్యదర్శిని తుమ్మల కోరారు. ఎల్1, ఎల్2 నిబంధనలతో రాష్ట్రంలోని జిన్నింగ్ మిల్లర్లు నష్టపోతున్నారని, అన్ని జిన్నింగ్ మిల్లులను వెంటనే ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎకరానికి 7 క్వింటాళ్ల పరిమితిని కూడా వెంటనే ఎత్తివేసి, ఎకరానికి 12 క్వింటాళ్ల పరిమితితో కొనుగోళ్లు జరిపే విధంగా చొరవ తీసుకోవాలని, రాష్ట్ర రైతులు ఇప్పటికే అకాల వర్షాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తుమ్మల వివరించారు. తేమశాతం, ఎకరానికి 7 క్వింటాళ్ల పరిమితి అనే నిబంధనలతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. జిన్నింగ్ మిల్లుల ప్రతినిధులు సమస్యల అంశంపై తాను ఇది వరకే కేంద్రం జౌళిశాఖ మంత్రికి, సిసిఐ ఎండికి లేఖలు రాసిన విషయాన్ని మంత్రి తుమ్మల గుర్తు చేశారు.

**రైతుల వారీ గణంకాలు ఇస్తాం..**

కేంద్ర జౌళిశాఖ అధికారులు కోరినట్టుగా జిల్లాల వారి సరాసరి పత్తి దిగుబడి గణాంకాలను రూపొందించామని, అవసరమైతే రైతుల వారీ గణాంకాలను కూడా అందచేస్తామని మంత్రి తుమ్మల కేంద్ర అధికారులకు తెలియజేశారు. ఈ గణాంకాల ప్రకారం రాష్ట్ర సరాసరి దిగుబడి ఎకరాకు 11.74 క్వింటాళ్ల వరకు ఉందని, అందుకే కొనుగోలు పరిమితిని 7 క్వింటాళ్ల నుండి 12 క్వింటాళ్లకు పెంచే విధంగా ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్రమోహన్, కేంద్ర అధికారులతో సమన్వయం చేసుకుంటూ మిల్లర్లు సమ్మె విరమించేలా చూడాలని మంత్రి తుమ్మల కేంద్ర అధికారులకు సూచించారు. దీనిపైన కేంద్రం అధికారులు సానుకూలంగా స్పందించినట్టు మంత్రి తుమ్మల తెలిపారు. కేంద్రం విధించిన అనాలోచిత నిబంధనలతో ఇప్పటి వరకు కేవలం 67 వేల మంది రైతుల నుండి 1.18 లక్షల మెట్రిక్ టన్నుల పత్తిని మాత్రమే సేకరించారని, కొనుగోళ్లు ఊపందుకునే సమయంలో మిల్లర్లు ఇలా సమ్మెలు చేస్తామనడం, కొనుగోళ్లు నిలిపివేస్తామని ప్రకటించడం వల్ల రైతులకు ఇబ్బంది కలుగుతుందని తుమ్మల వివరించారు. రైతుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని సమ్మె ఆలోచనలు విరమించాలని ఆయన మిల్లర్లకు సూచించారు.

## కృషి, పట్టుదలే విజయానికి సోపానాలు

### ఈ జాబ్‌మేళా నిరుద్యోగుల పాలిట వరం

### ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : కృషి, పట్టుదల, సమయ పాలనను పాటించి చదువులు సాగిస్తే విజయాలు వాటంతటవే వరిస్తాయని, నేటి యువత పెద్ద ఎత్తున చదువులపై శ్రద్ధ పెట్టి భవిష్యత్‌ను బంగారుమయంగా తీర్చుదిద్దుకోవాలని, ఇలాంటి జాబ్‌మేళాలను సద్వినియోగం చేసుకొని ఉద్యోగాలు సాధించి ఆర్థిక స్థిరత్వాన్ని పెంపొందించుకోవాలని, ఈ జాబ్‌మేళా నిరుద్యోగుల పాలిట వరమని కొత్తగూడెం శాసనసభ్యులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. సింగరేణి సంస్థ సౌజన్యంతో ఆదివారం కొత్తగూడెం క్లబ్‌లో ఏర్పాటు చేసిన మెగాజాబ్ మేళాకు అపూర్వ స్పందన లభించింది. 71 కంపెనీలతో నిర్వహించిన ఈ జాబ్ మేళాకు సుమారు 8500 మంది నిరుద్యోగులు హాజరయ్యారు. పలు కంపెనీలు నిర్వహించిన ఇంటర్వ్యూల్లో ప్రతిభ కనబరిచిన వారికి అప్పటికప్పుడే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ నియామక పత్రాలు జారీ చేయడంతో పాటు వివిధ కంపెనీలు 3వేల మందికిపైగా ఉద్యోగ అవకాశాలు కల్పించాయి. దీంతో నిరుద్యోగుల కుటుంబాల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిసాయి. ముందుగా ఎంఎల్‌ఏ కూనంనేని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, సంగరేణి సంస్థ సి అండ్ ఎండి బలరామ్, సింగరేణి డైరెక్టర్ పా గౌతం పోట్రు, ఎస్‌పి రోహిత్ రాజ్‌తో కలిసి జ్యోతి ప్రజలన చేశారు. అనంతరం జరిగిన సభలో ఎంఎల్‌ఏ మాట్లాడుతూ ఉన్నత చదువులు చదువుకుని ఎందరో నిరుద్యోగులుగా ఉన్నారని, వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కొత్తగూడెం కేంద్రంగా జాబ్‌మేళా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. యువత అవకాశాలను అందిపుచ్చుకుని ముందుకు సాగాలని, తెలివితేటలు ఏ ఒక్కరి సొత్తుకాదని, పట్టుదలతో చదివి పైకి ఎదగాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా ప్రైవేటు రంగాల్లో ఉన్న అవకాశాలు చేజిక్కించుకుని ఆర్థికంగా స్థిరపడాలన్నారు. ఓటమి నుంచి నేర్చుకున్న పాఠలాను నెమరు వేసుకుంటూ ఒక్కొక్క మెట్టు పైకి ఎక్కుతూ ముందుకు సాగిన వారు జీవితంలో ఎలాంటి కష్టాలు వచ్చినప్పటికీ చలించరన్నారు. కొత్తగూడెం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి జరుగుతుందని, ఎన్నడూ జరగని అభివృద్ధి ఈ రెండేళ్లలో ఈ నియోజకవర్గంలో జరిగిందన్నారు. శిథిలావస్తకు చేరిన బస్టాండ్‌ను పూర్తిగా తొలగించి రూ.16 కోట్లతో నూతన భవనాలు నిర్మించనున్నట్లు తెలిపారు. కొత్తగూడెం రూపురేఖలు మార్చేందుకు మల్టిఫెక్సీతో పాటు షాపింగ్ కాంప్లెక్ నిర్మించనున్నామని, తద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలు వస్తాయని చెప్పారు. అదే విధంగా పోస్టాఫీస్ సెంటర్ నుండి డబుల్ రోడ్ నిర్మించేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. కొత్తగూడెం పట్టణంలో రద్దీని తగ్గించేందుకు రూ.400 కోట్లతో బైపాస్ రోడు నిర్మించనున్నామని తెలిపారు. ఇప్పటికే ఎర్త్ యూనివర్సిటీ ఏర్పాటు జరిగిందని, త్వరలో ఐటి హబ్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. పాల్వంచ కేటిపిఎస్‌లో 800 మెగావాట్ల సామర్థ్యం గల రెండు విద్యుత్ కేంద్రాలను త్వరలో నెలకొల్పేందుకు ప్రణాళికలు సిద్ధం



చేసి ప్రభుత్వానికి సమర్పించామని, ఇందుకోసం ఢిల్లీకి చెందిన ఓ సంస్థ ద్వారా సర్వే కూడా చేసినట్లు చెప్పారు. విమానాశ్రయం ఏర్పాటుకు తీవ్ర కృషి జరుగుతోందని, ఇందుకు కలెక్టర్ తోడ్పాటు మరువలేనిది అన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ పేదరికం గొప్ప వరమని, ఆ నేపథ్యం నుండి వచ్చి నేను కష్టపడి చదువుకుని జిల్లా కలెక్టర్ స్థాయికి ఎదిగినట్లు చెప్పారు. చదువొక్కటే మనిషి జీవితాన్ని అందంగా మారుస్తుందని, ఆ చదువుని నమ్ముకున్న వారు ఎవ్వరూ చెడిపోలేదన్నారు. ఎస్‌పి రోహిత్ రాజ్ మాట్లాడుతు యువత జీవితాలు వారి నడవడిక మీద ఆధారపడి ఉంటాయని, చదువుకునే రోజుల్లో చదువులపైనే శ్రద్ధ పెట్టాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. సిఎం అండ్ ఎండి బలరామ్ నాయక్ మాట్లాడుతూ తాము చదువుకునే రోజుల్ల ఇన్ని సౌకర్యాలు లేవని, పట్టుదలలే పెట్టుబడిగా కష్టపడి చదివామని, ఇళ్లకు దూరంగా ఉంటూ కాలే కడుపులతో పుస్తకాలతో కుస్తీపట్టామని అందుకే నేడు మీముందు సగర్వంగా నిలిచామని తెలిపారు. డైరెక్టర్ పా గౌతం పోట్రు మాట్లాడుతూ యువత ఉద్యోగాలు సాధించి ఉన్నతస్థానాల్లో నిలవాలని, సింగరేణి కార్మికులు సంస్థ అభివృద్ధికి పాటుపడాలని తెలిపారు. అనంతరం కారుణ్య నియామకాల్లో భాగంగా 374 మందికి ఉద్యోగ నియామక పత్రాలను అందజేసారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, సింగరేణి కొత్తగూడెం ఏరియా జిఎం షాలేమ్ రాజు, సింగరేణి కాలరీస్ వర్కర్స్ (ఏఐటియూసి) గుర్తింపు సంఘం అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, అడిషనల్ జనరల్ సెక్రెటరీ మిర్యాల రంగయ్య, సెంట్రల్ సెక్రెటరీ వంగా వెంకట్, కార్పొరేట్ సెక్రెటరీ రమణమూర్తి, ప్రాతినిధ్య సంఘం ఐఎన్‌టియూసి నాయకులు, ప్రెసిడెంట్ త్యాగరాజన్, వైస్ ప్రెసిడెంట్ రజాక్, పితాంబరం, ఏఐటియూసి నాయకులు వట్టికొండ మల్లిఖార్జున రావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళీ, సలిగంటి శ్రీనివాస్, ఉప్పుశెట్టి రాహుల్, ఫయూమ్, భూక్య ధస్రు, సింగరేణి అధికారులు, ఉద్యోగులు, వివిధ కంపెనీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు సిబిఐ విచారణకు మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు

### వామనరావు దంపతుల హత్య కేసులో..

ప్రజాపక్షం/హైదరాబాద్ : గత బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో సంచలనం రేపిన వామనరావు దంపతుల హత్య కేసులో సిబిఐ అధికారులు మాజీ ఎంఎల్‌ఏ పుట్టమధుకు నోటీసులు జారీ చేశారు. పుట్టమధును శనివారం సిబిఐ అధికారులు విచారించే అవకాశాలు ఉన్నాయి. రెండు నెలలుగా ఈ కేసులో విచారణ కొనసాగుతుండగా ఇప్పటికే పుట్ట మధు మేనల్లుడు బిట్టు శ్రీనుతో పాటు ప్రధా న నిందితులను సిబిఐ విచారించింది. హత్యలో పుట్ట మధు ప్రమేయం ఉందని వామనవారు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. చనిపోయే ముందు వామనరావు దంపతులు సైతం బిట్టు శ్రీను పేరు చెప్పారు. ఇదిలా ఉంటే 2021లో పెద్దపల్లి సమీపంలోని కల్వచర్ల వద్ద కారులో వెళుతున్న వామనరావు దంపతులను రోడ్డుపై అడ్డగించి దారుణంగా హత్య చేశారు. అనంతరం అక్కడి నుండి పారిపోగా పోలీసులు వెతికిపట్టుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసిన తరవాత మొదట కేసును స్థానిక పోలీసులు విచారించారు. కానీ వామనరావు కుటుంబ సభ్యులు సిబిఐ విచారణకు డిమాండ్ చేశారు. దీంతో కేసును ప్రస్తుతం సిబిఐ విచారిస్తోంది.

## మీడియా స్వేచ్ఛ అదుపునకు..

## స్వచ్ఛందంగా పనిచేసే ప్రెస్‌కౌన్సిల్ అవసరం

### సీనియర్ సంపాదకులు దేవులపల్లి అమర్

ప్రజాపక్షం/హైదరాబాద్ : మీడియా స్వేచ్ఛతో పాటు మీడియాను అదుపు చేయడానికి ప్రభుత్వ ఆజమాయిషీ లేని ప్రెస్ కౌన్సిల్ లాంటి వ్యవస్థలు అత్యంత ఆవశ్యకమని సీనియర్ సంపాదకులు దేవులపల్లి అమర్ అన్నారు. హైదరాబాద్ నాంపల్లిలోని తెలంగాణ మీడియా అకాడమీ ఆడిటోరియంలో సమాచార పౌర సంబంధాల శాఖ, తెలంగాణ మీడియా అకాడమి సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ పత్రికా దినోత్సవం (నేషనల్ ప్రెస్ డే) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం దేవులపల్లి అమర్ మాట్లాడుతూ సమాజంలో మీడియా పేరుతో జరుగుతున్న దుష్ప్రయోగాలను ఎండగట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్పష్టం చేశారు. వర్కింగ్ జర్నలిస్టులు, వార్తా పత్రికలు, చట్టాలు ఎలా రూపొందించాలో ఆనాటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ సూచనల మేరకు దేశంలో మొదటి ప్రెస్ కమిషన్‌తో పాటు ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాను 1966 నవంబర్ 16న ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఏర్పాటు చేసిన రోజునే జాతీయ పత్రికా దినోత్సవం (నేషనల్ ప్రెస్ డే) నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. కొన్ని పత్రికలు, ఛానెల్ యాజమాన్యాలు నైతిక నియమావళిని పాటించకపోవడం వల్ల మొత్తం మీడియా రంగమే విమర్శలు ఎదుర్కొంటోందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిని అరికట్టేందుకు మీడియా సంస్థలు, సంఘాలు ఒకే వేదిక పైకి వచ్చి సమన్వయంతో పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. సోషల్ మీడియా నియంత్రణకు తగిన చట్టపరమైన మార్గదర్శకాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందించాలని సూచించారు. భారత ప్రభు త్వం ప్రెస్ కౌన్సిల్‌ను విస్తరించి, 'మీడియా కౌన్సిల్ ఆఫ్ ఇండియా'గా మార్చే దిశగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. అందుకు అన్ని మీడియా సంస్థలు, జర్నలిస్టుల సంఘాలు, రాష్ట్ర ప్రభుత్వం, మీడియా అకాడమీ కృషి చేయాలన్నారు. గత రెండు సంవత్సరాలుగా ప్రెస్ కౌన్సిల్ పాలకవర్గం నియామకం జరగలేదని, కాబట్టి వెంటనే నియమించాలని కోరారు. దీని ద్వారా పత్రికా స్వేచ్ఛ, నైతికత, జవాబుదారితనం, బాధ్యతలు మొదలగునవి పర్యవేక్షిస్తూ, ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు తప్పు చేస్తే మీడియాపై చర్యలు తీసుకునే అధికారం ఇవ్వాల్సిన అవసరం ఉందని దేవులపల్లి అమర్ అభిప్రాయం వ్యక్తం చేశారు. సమావేశంలో ప్రెస్ కౌన్సిల్ సభ్యులు ఎం.ఎ. మాజీద్, జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు మారుతి సాగర్, బసవ పున్నయ్య, రమణారావు, రంగ సాయి, యూసుఫ్ బాబు, రమణకుమార్, సువర్ణ తదితరులు జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా జర్నలిస్టుల సంక్షేమంపై తమ సూచనలు చేశారు. ఈ కార్యక్రమానికి సమాచార పౌర సంబంధాల శాఖ అదనపు డైరెక్టర్ డి.ఎస్. జగన్ అధ్యక్షత వహించగా, జాయింట్ డైరెక్టర్ కె.వెంకటరమణ, మీడియా అకాడమీ కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వర రావు, అధికారులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.



## 22న గీత పని వారల సంఘం రాష్ట్ర సదస్సు



సదస్సు గోడ పత్రిక ఆవిష్కరణ

ప్రజాపక్షం/హైదరాబాద్: గీత వృత్తిదారులు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రమాదవశాత్తు చెట్టు మీద నుంచి పడిన, వికలాంగుల గీతకార్మికుల కుటుంబాలకు చెల్లించాల్సిన రూ. 13 కోట్ల బకాయిలను తక్షణమే చెల్లించాలని, వృత్తి పెన్షన్‌ను రూ.5వేలకు పెంచాలనే డిమాండ్‌తో ఈనెల 22న హైదరాబాద్, బషీర్‌బాగ్‌లోని ప్రెస్ క్లబ్‌లో రాష్ట్ర సదస్సును నిర్వహించనున్నట్టు తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్ తెలిపారు. 'గీత పనివారల సంఘం రాష్ట్ర సదస్సు'కు సంబంధించిన గోడ పత్రికను, కరపత్రాన్ని హైదరాబాద్, హిమాయత్‌నగర్‌లోని రాజ్ బహదూర్ గౌర్ హాల్‌లో ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బొమ్మగాని ప్రభాకర్ మాట్లాడుతూ 'గీత పని వారల సంఘం రాష్ట్ర సదస్సు'కు ముఖ్య అతిథిగా రవాణ, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, గౌరవ అతిథులుగా మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్, సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంఎల్‌ఏ పల్లా వెంకట్‌రెడ్డి, వక్తలుగా ఎస్‌టియు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు జి.సుధాకర్ గౌడ్, తెలంగాణ రాష్ట్ర గౌడ సంఘం అధ్యక్షుడు పల్లె లక్ష్మణ్ గౌడ్, తెలంగాణ రాష్ట్ర వృత్తి సంఘాల ప్రధాన కార్యదర్శి టి.వెంకట్రాములు, గౌడ ఐక్య సాధన కమిటీ అధ్యక్షుడు అంబాల నారాయణ గౌడ్ హాజరుకానున్నట్టు వివరించారు. రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఎంఎల్‌ఏ, ఎంపి బొమ్మగాని ధర్మ భిక్షం కాంస్య విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్ర గీత పారిశ్రామిక ఆర్థిక సహకార కార్పొరేషన్లకు నిధులు ఇవ్వాలని, ఎన్నికలను నిర్వహించాలని తెలిపారు. రాజ్యాంగ సవరణ ద్వారా బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించాలని బొమ్మగాని ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.జి. సాయిలు గౌడ్, రాష్ట్ర సమన్వయ కార్యదర్శి బి. నాగభూషణం, రాష్ట్ర కార్యదర్శి మారగోని ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బిసిలను కాంగ్రెస్ ప్రభుత్వం .. నమ్మించి మోసం చేస్తే రాష్ట్రం అగ్నిగుండమే

### 'రన్ ఫర్ సోషల్ జస్టిస్' ర్యాలీలో.. బిసి జెఎసి వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్



ప్రజాపక్షం/హైదరాబాద్ : బిసి రిజర్వేషన్‌ల పెంపు చేయకుండా తొందరపడి స్థానిక సంస్థల ఎన్నికలు జరుపితే బిసిల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని బిసి జెఎసి వర్కింగ్ ప్రెసిడెంట్ జాజుల శ్రీనివాస్ గౌడ్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బిసి రిజర్వేషన్‌ల పెంపు అంశం లో కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. బిసి జెఎసి పిలుపునిచ్చిన అష్టాంగ ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం బిసి జెఎసి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా 'రన్ ఫర్ సోషల్ జస్టిస్' పేరుతో 33 జిల్లాల్లో 119 నియోజకవర్గాల్లో మండల కేంద్రాల్లో బిసిలు పెద్ద ఎత్తున రన్ నిర్వహించారు. ఇందులో భాగంగానే హైదరాబాద్‌లో బషీర్‌బాగ్ చౌరస్తాలో ఉన్న బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం నుండి లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం వరకు రన్‌లో వందలాది మంది బిసి ఉద్యమకారులు పాల్గొన్నారు. ఈ రన్‌లో మాజీ ఎంపి, వి.హనుమంతరావు, మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్, బిసి జెఎసి వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్, మీడియా చీఫ్ కో ఆర్డినేటర్ గజ్జ కృష్ణ, కో ఆర్డినేటర్ కులకచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, బిసి కుల సంఘాల జెఎసి చైర్మన్ కుందారం గణేష్ చారి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

**కేంద్రంపై పోరాటానికి రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ**

ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ బిసి రిజర్వేషన్‌ల పెంపు కోసం గత రెండు సంవత్సరాలుగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేసిన మాట వాస్తవమేనని, కానీ బిసి రిజర్వేషన్‌లపై కేంద్ర ప్రభుత్వంపై ఒక రాజకీయ కార్యాచరణ నిర్ణయించుకుని, డిసెంబర్ ఒకటవ తేదీ నుండి జరిగే పార్లమెంట్ సమావేశాలు కేంద్రంగా చేసుకొని రాష్ట్ర ప్రభుత్వం పోరాడాలని కోరారు.

**బిసి రిజర్వేషన్‌లపై స్పష్టత రాకుండా స్థానికలు నిర్వహించొద్దు : వి.హనుంతరావు**

మాజీ పార్లమెంట్ సభ్యులు వి.హనుమంతరావు మాట్లాడుతూ బిసి రిజర్వేషన్‌లు ఇప్పుడు అమలు కాకుంటే భవిష్యత్తులో ఇంకెప్పుడు అమలు జరిగే పరిస్థితి లేదన్నారు. రిజర్వేషన్‌లపై స్పష్టత రాకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించవద్దని సిఎం రేవంత్ రెడ్డి, టిపిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌లకు ఆయన విజ్ఞప్తి చేశారు.

**స్థానిక సంస్థల్లో మోసం చేయాలని చూస్తే కాంగ్రెస్‌ను బిసిలు వదిలిపెట్టరు : మాజీమంత్రి వి.శ్రీనివాస్ గౌడ్**

మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ బిసి రిజర్వేషన్‌ల సాధన కోసం జెఎసి చేస్తున్న ఉద్యమంతో కలిపి నడుస్తామని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దిగి వచ్చే వరకు బిసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. ఈకార్యక్రమంలో సంచార జాతుల సంఘం అధ్యక్షులు వీరస్వామి, బిసి విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రమ్ గౌడ్, బిసి యువజన సంఘం జాతీయ అధ్యక్షులు కనకాల శ్యామ్ కుర్మ, సగర సంగం రాష్ట్ర అధ్యక్షులు ఉప్పరి శేఖర్ సగర, గంగపుత్ర సంఘం రాష్ట్ర అధ్యక్షులు దిటి మల్లయ్య, వడ్డెర సంఘం జాతీయ అధ్యక్షులు పిట్ల శ్రీధర్, బిసి సంఘాల నేతలు ఈడిగ శ్రీనివాస్ గౌడ్, వరికుప్పల మధు,ఇ. నిరంజన్, కవుల జగన్నాథం, పాలకూరి కిరణ్ గౌడ్, మాదేశి రాజేందర్, తారకేశ్వరి, సంధ్యారాణి, గౌతమి, స్వామి గౌడ్, ఇంద్రం, మహేశ్, భరత్ గౌడ్ పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలను వెలికితీయడానికి క్రీడా పాఠశాలలు

### యువజన శాఖ మంత్రి వాకిటి శ్రీహరి

### టోక్యోలో పారాలింపిక్స్ 2025లో గోల్డ్ మెడల్ సాధించిన ధనుష్ శ్రీకాంత్‌కు రూ.కోటి 40 లక్షల నజరానా ప్రకటన



ప్రజాపక్షం/హనుమకొండ : విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలను వెలికితీయడానికి క్రీడా పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్య,డెయిరీ అభివృద్ధి, క్రీడలు, యువజన, మత్స్యశాఖ మంత్రి వర్యులు వాకిటి శ్రీహరి తెలిపారు. ఆదివారం హనుమకొండలోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో తెలంగాణ క్రీడ ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తెలంగాణ క్రీడా పాఠశాలను ముఖ్య అతిథిగా హాజరై తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ ను వరంగల్ (పశ్చిమ)శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, మేయర్ గుండు సుధారాణి, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాగరాజు, సాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి, సాట్స్ ఎం.డి సోనీ బాలా దేవి, జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్, కార్పొరేషన్ చైర్మన్లు బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్, మెట్టు సాయి కుమార్ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడా పాఠశాలలో క్రీడ పరికరాలతో పాటు, అక్కడ కల్పించిన సదుపాయాలను మంత్రి, ఎమ్మెల్యేలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మూడు జిల్లాల్లో స్పోర్ట్స్ పాఠశాలలు ఉన్నాయని, ఇందులో హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్ తర్వాత నాలుగో క్రీడా పాఠశాలను హనుమకొండలో ఆదివారం ప్రారంభించినట్లు పేర్కొన్నారు. 132 కోట్ల రూపాయల వ్యయంతో త్వరలో శాశ్వతంగా క్రీడా పాఠశాలను ఏర్పాటు చేస్తామన్నారు. "గురు వందనం" కింద తెలంగాణ క్రీడా విభాగం కోచ్‌ల కోసం మొదటిసారిగా ప్రత్యేక సంక్షేమ పథకం ప్రారంభించిందని, ఈ పథకం ద్వారా కోచ్‌లకు రూ.15 లక్షల వరకు ప్రమాద బీమా వర్తిస్తుందని, ఇందులో ఆసుపత్రి చికిత్స, పరీక్షలు, మందులు, చికిత్స తర్వాత అవసరమైన సేవలు ఉంటాయని తెలియజేశారు. మంత్రి విద్యార్థిని విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్సులు, కిట్‌లను పంపిణీ చేశారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేల సమష్టి కృషితోనే హనుమకొండలో క్రీడా పాఠశాల ఏర్పాటు సాధ్యమైందన్నారు. ఈ సమావేశంలో స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లాకు క్రీడలలో ఘనమైన చరిత్ర ఉందని అన్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్ నాగరాజు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, సాట్స్ వైస్ చైర్మెన్, ఎం డి,జిల్లా కలెక్టర్ స్నేహ సబరీష్, జీడబ్ల్యూఎంసి కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, కార్పొరేటర్ మామిండ్ల రాజు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, డివైఎస్ ఓ అశోక్ కుమార్ క్రీడా సంఘాల ప్రతినిధులు అధికారులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



## అభ్యుదయ సాహిత్యంతో సమాజ మార్పు

### కవులు సామాజిక సమస్యలపై స్పందించాలి

### అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవిఎల్

ప్రజాపక్షం/ఖమ్మం : సమాజ మార్పుకు, చైతన్యానికి కవులు, కళాకారులు తోడ్పాడాలని అభ్యుదయ సాహిత్యంతో సమాజంలో మార్పు తథ్యమని అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవిఎల్ తెలిపారు. కవులు సామాజిక సమస్యలపై స్పందిస్తూ రచనలు చేయాలని, మారిన పరిస్థితుల్లో అభ్యుదయ సాహిత్య అవసరం పెరుగుతుందన్నారు. అభ్యుదయ రచయితల సమావేశం ఆదివారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో లెనిన్ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కెవిఎల్ మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలోనూ, సాయుధ తెలంగాణ పోరాట కాలంలోనూ వెలువడిన సాహిత్యం దేశ ప్రజలను జాగృతం చేసింది. ముఖ్యంగా ప్రజలను మేల్కొలిపే పాటలు, కథలు, కవితలు, విధి నాటకాలు మరింతగా వెలువడాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ సాయుధ పోరాట కాలంలో బండి యాదగిరి అలపించిన బండెనక బండి కట్టి పదహారు బండ్లు కట్టి ఏ బండ్లో వస్తావు కొడకో నైజాం సర్కారోడా అన్న పాట యావత్ తెలంగాణ ప్రజలను కార్యోన్ముఖులను చేసిందని కెవిఎల్ తెలిపారు. సిపిఐ శతాబ్ది ఉత్సవ ముగింపు సంబురాలు డిసెంబర్ 26న ఖమ్మంలో జరగనున్న సందర్భంగా అభ్యుదయ రచయితల సంఘం సామాజిక, రాజకీయ, ఆర్థిక అంశాలు నేటి పరిస్థితులపై అభ్యుదయ రచయితల నుండి రచనలను ఆహ్వానిస్తుందని ఆయన తెలిపారు. చైతన్యగుమ్మంగా వామపక్ష ఉద్యమ పురిటి గడ్డగా పేరొందిన ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కవులు, సాహిత్యవేత్తలు సమకాలీన పరిస్థితులపై స్పందించి రచనలు చేయాలని ఆ రచనలను పుస్తక రూపంలో తీసుకొస్తామన్నారు. అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో సెమినార్‌లు, సదస్సులు నిర్వహిస్తున్నట్లు కెవిఎల్ తెలిపారు. ఈ సమావేశంలో అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పల్లేర్ల వీరస్వామి, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, కవులు రౌతు రవి, కన్నెకంటి వెంకటయ్య, నిధి, కాంతేశ్వరరావు, గోపిశెట్టి వెంకటేశ్వరరావు, ఆంజనేయులు, భారతి, శైలజ తదితరులు పాల్గొనగా శింగు నర్సింహారావు ఆహుతులను వేదికపైకి ఆహ్వానించి లక్ష్యాన్ని వివరించారు.

## బిసి రిజర్వేషన్ తేల్చకుండా స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లొద్దు

**ప్రజాపక్షం/మిర్యాలగూడ:** ఇటీవల జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో గెలిచిన ఉత్సాహం వల్ల స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని కాంగ్రెస్ పార్టీ ఉబలాటపడుతోందని,కానీ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42రిజర్వేషన్ తేల్చకుండా ఎన్నికలకు వెళ్లే తగిన మూల్యం చెల్లించుకోవాలని వస్తుందని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూలిపాళ ధనుంజయ నాయుడు వ్యాఖ్యానించారు.ఆదివారం ఆయన నల్లగొండ జిల్లా మిర్యాలగూడలోని బీసీ భవన్‌లో సాధన సమితి నాయకులు బంటు వెంకటేశ్వర్లు,సామాజిక కార్యకర్త జాజి రాజు తో కలిసి పాత్రికేయులతో మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ల పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే అఖిలపక్షాలను తీసుకొని ప్రధాన మంత్రి వద్దకు వెళ్లాలని, కేంద్రం పై ఒత్తిడి తేవడంతో దేశవ్యాప్తంగా ఇండియా కూటమి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేయాలని స్వయంగా రాహుల్ గాంధీ రంగంలోకి దిగి బీసీ ఉద్యమాన్ని ముందుకు నడిపించాలని కేంద్ర ప్రభుత్వంపై తీవ్రమైన ఒత్తిడి తెస్తేనే బీసీలకు న్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

## '555' బస్సును చిట్యాల వరకు నడపాలి

సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు బొడిగె సైదులు

**ప్రజాపక్షం/చిట్యాల:** దిల్‌సుఖ్ నగర్ నుండి చౌటుప్పల్ వరకు నడుపుతున్న 555 నెంబర్ బస్సులను చిట్యాల వరకు పొడిగించి ఈ ప్రాంత ప్రయాణీకులకు ప్రయాణ సౌకర్యం కల్పించాలని సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు బొడిగె సైదులు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సరైన బస్సు సౌకర్యాలు లేక చౌటుప్పల్, చిట్యాల మధ్య గల గ్రామాల మధ్య గల ప్రజలు అనేక అవస్థలకు గురౌతున్నారన్నారు. చిట్యాలకు గాని, చౌటుప్పలకు గాని వెళ్ళాలనుకునే వారికి కావల్సిన మేరకు బస్సులు లేక ప్రైవేట్ వాహనాలపై ఆధారపడాల్సి వస్తుందన్నారు. ప్రైవేట్ వాహనాలు తరచుగా రోడ్డు ప్రమాదాలకు గురై ప్రయాణీకులు క్షతగాత్రులు కావడం, మరణించిన సంఘటనలు జరుగుతున్న విషయాన్ని ప్రభుత్వ అధికారులు గమనించాలన్నారు. పెద్దకాపర్తి, ఆరెగూడెం, చిన్నకాపర్తి, ముద్దుగూడెం, పిట్టంపల్లి, వెలిమినేడు, పేరేపల్లి, గుండ్రాంపల్లి, ఏపూర్, సైదాబాద్, రెడ్డి బావి, వంతంగా ఇలా అనేక గ్రామాల ప్రజలు ప్రయాణ ఇబ్బందులు తొలగించేందుకు 555 బస్సును చిట్యాల వరకు వెంటనే పొడిగించాలని సైదులు డిమాండ్ చేశారు.



## కోటయ్య గూడెం మాదన్న చెరువు నింపాలి

మాదన్న చెరువును పరిశీలించిన ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

**ప్రజాపక్షం/చండూరు :** కనగల్లు మండలం కురంపల్లి మీదుగా పానగల్లు ఉదయ సముద్రం వరకు సాగుతున్న ఎస్ఎల్‌బిసి ఎమ్మార్పీ కెనాల్ నీటితో ప్రక్కనే ఉన్న చండూరు మండలం కోటయ్యగూడెం మాధన్న చెరువులోకి నీటిని లిఫ్టు చేసినట్లయితే చుట్టు ప్రక్కల గ్రామాల రైతుల పంట పొలాలకు సంవృద్ధిగా నీరు పారుతుందని గతంలో రైతులు ఎంఎల్ఎ రాజగోపాల్‌రెడ్డికి విన్నవించారు. రైతుల అభిప్రాయం మేరకు ఆదివారం రైతులతో కలిసి ఎంఎల్ఎ రాజగోపాల్ రెడ్డి స్వయంగా క్షేత్రస్థాయిలోకి వెళ్లి మాధన్న చెరువును పరిశీలించారు. త్వరలో సంబంధిత అధికారులతో మాట్లాడి వీలైనంత త్వరగా మధన్న చెరువుపై దృష్టి సారిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొరిమి ఓంకారం , గంట సత్యం, బొమ్మరబోయిన సైదులు , బుషిపాక శంకర్ , రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పాలనలో నెరవేరిన పేదోడి సొంతింటి కల

ప్రజా పాలనలో ప్రతి పేదవాడిని ఆదుకోవడంతో పాటు ఆర్థికంగా బలోపేతం చేయడం కోసం కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని మునుగోడు ఎంఎల్ఏ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం మునుగోడు నియోజకవర్గం పరిధిలో మొట్టమొదటగా చండూరు మండలం తాస్కానిగూడెంలో నూతనంగా ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేసుకున్న షేక్ లతీఫ్ ఇంటికెళ్లి ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించారు.

## 6362 కేసులు పరిష్కారం

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** జాతీయ మెగా లోక్ అదాలత్ లో 6362 కేసులు పరిష్కారం అయ్యాయని జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ వెల్లడించారు. జాతీయ లోక్ అదాలత్‌లో వివిధ రాజీ పడదగిన కేసులలో తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాషెడ్యూల్ ప్రకారం,రాజీ మార్గాన కేసులను పరిష్కరించడానికి ఆదివారం నిర్వహించిన జాతీయ మెగాలోక్ అదాలత్‌లో జిల్లా పరిధిలో రాజీ మార్గమే రాజమార్గంగా కేసుల పరిష్కారానికి పోలీస్ అధికారులు,సిబ్బంది పకడ్బందీగా వ్యవహరించి నిందితులు,కక్షిదారులకు సమాచారం అందించి వారికి అవగాహనా కల్పించి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా లోక్ అదాలత్‌లో 6362 కేసులు పరిష్కరించడం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా ఎస్పి మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయి పోగొట్టుకున్న 45 కేసులలో 8,84,642 రూపాయలు బాధితులకు అందజేయడం జరిగిందని తెలిపారు. ఈ కేసులను పరిష్కరించడంలో చక్కగా వ్యవహరించిన పోలీస్ అధికారులను, సిబ్బందిని,కోర్టు కానిస్టేబుళ్లను ఎస్పి అభినందించారు.

## నేడు పట్టణంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

**ప్రజాపక్షం/మిర్యాలగూడ:** ఈనెల 17న రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి , రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తంకుమార్ రెడ్డితో కలిసి మిర్యాలగూడ పట్టణంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. సోమవారం ఉదయం మంత్రులు ఉదయం 9:50 నుండి మధ్యాహ్నం 12:15 వరకు ఈ కింది కార్యక్రమాలలో పాల్గొంటారని తెలిపారు.రూ.74 కోట్ల ఎండిఆర్ నిధులతో శెట్టిపాలెం నుండి అవంతిపురం వరకు చేపట్టిన రోడ్డును మంత్రులు ప్రారంభించనున్నారు.రూ.15 కోట్ల ల టిఏఫ్‌యూఐడిసి నిధులతో చేపట్టిన రోడ్డును ప్రారంభించనున్నారు.రూ.16 కోట్ల నిధులతో చేపట్టిన సిసి రోడ్డు ,మురికి కాలువలను ప్రారంభించనున్నారు.మిర్యాలగూడ మున్సిపాలిటీ పరిధిలో41 కోట్ల రూపాయల బీటీ, సీసీ రోడ్డు పనులు,15 కోట్ల రూపాయల వ్యయంతో మిర్యాలగూడ నుండి తడకమళ్ళ వరకు ఉన్న డబుల్ రోడ్డును 6 లైన్లుగా మార్చే పనులలో, మూడు కోట్ల రూపాయల వ్యయంతో ఫ్లైఓవర్ ఏరియా, మున్సిపాలిటీ ఏరియా, మున్సిపాలిటీ ఆఫీసు ఏరియా సుందరీకరణ పనులలో పాల్గొంటారు. అనంతరం నంది పాత్ర బైపాస్ వద్ద నిర్మాణంలో ఉన్న ఫ్లైఓవర్ పనులను తనిఖీ చేస్తారు. 5 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన కేఎన్ఎమ్ డిగ్రీ కళాశాల భవనాన్ని ప్రారంభిస్తారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాన్ని, మెయిన్ బజార్లో చావడి సి ల్వర్ ప్యాలెస్ షాప్ ను ప్రారంభించిన అనంతరం ,అయ్యప్ప దేవాలయం లో స్వామీజీలతో కలిసి అన్నదానం కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.

## పోలీస్ కుటుంబం మంచి సోదరుడిని కోల్పోయింది : ఎస్పి




**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** పోలీసు కుటుంబం మంచి సోదరున్ని కోల్పోయిందని సూర్యాపేట జిల్లా ఎస్పి కె నరసింహ అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో రోడ్డు ప్రమాదంలో మరణించిన కానిస్టేబుల్ శీలం కమలాకర్ మృతదేహానికి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నందు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి చెందడం చాలా బాధాకరమన్నారు. కమలాకర్ మంచి సర్వీస్ రికార్డు కలిగిన వ్యక్తి అని ఒక మంచి పోలీస్ కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. వారి కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామని తెలిపారు. విధుల నిర్వహణలో పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పి ప్రసన్నకుమార్, సిఐ నాగేశ్వరరావు, టౌన్ సిఐ వెంకటయ్య, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, పోలీస్ సంఘం అధ్యక్షులు రాంచందర్ ఉన్నారు.

### కుటుంబానికి సంతాపం తెలిపిన డిఎస్‌పి ఎం.శ్రీధర్‌రెడ్డి

**ప్రజాపక్షం/ కోదాడ :** సూర్యాపేట జిల్లా నాగారం పోలీసుస్టేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న కోదాడ మండల పరిధి గుడిబండ గ్రామానికి చెందిన పోలీసు శీలం కమలాకర్(39) ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందినాడు. దీంతో గుడిబండలో విషాదఛాయలు అమలుకున్నాయి. మృతునికి భార్య, కుమార్తె ఉన్నారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెదిన పోలీసు కుటుంబాన్ని డిఎస్‌పి శ్రీధర్‌రెడ్డి పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## బిఆర్ఎస్ ప్రజాతీర్పును గౌరవించడం నేర్చుకోవాలి

రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** బిఆర్ఎస్ నాయకులు ఇప్పటికైనా ప్రజాతీర్పును గౌరవించడం నేర్చుకోవాలని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పటేల్ రమేష్‌రెడ్డి నివాసంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం పదేండ్ల కాలంలో ఎనిమిది లక్షల కోట్ల అప్పు చేసిందన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడం తక్కువ కోట్లకు కోట్లు సంపాదించుకోవడం ఎక్కువ అనే విధంగా పాలన సాగించిందని విమర్శించారు. గతంలో ఏ ఎన్నికలు వచ్చిన అధికార దుర్వినియోగం చేసి గెలిచింది మీరు అని ఎద్దేవా చేశారు. సోషల్‌మీడియా వేదికగా జూబ్లీహిల్స్ అభ్యర్థి వల్లాల నవీన్ యాదవ్ మీద ఎన్నో అబండాలు వేసినా చివరికి ప్రజలు బిఆర్ఎస్‌కు తగిన బుద్ధి చెప్పారని అన్నారు. కాంగ్రెస్ రెండు సంవత్సరాల సంక్షేమ పాలనకు గెలుపు నిదర్శనమన్నారు. తొందరలోనే లోకల్‌బాడీ ఎన్నికలు పెట్టే అవకాశం ఉందన్నారు. ఉపఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను గెలిపించిన జూబ్లీహిల్స్ ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ గట్టు శీను, ఊర రాంమ్మూర్తి, మాజీ కౌన్సిలర్ వెంకన్న, నేరెళ్ల మధు, దేవేందర్, బైరబోయిన శ్రీను, శ్రీనివాస్, జ్యోతి కరుణాకర్, కుంచం అంజయ్య, యాట వెంకన్న, ఉపేందర్ పాల్గొన్నారు.

## అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలి

**ప్రజాపక్షం/అడ్డగూడూరు :** మండలకేంద్రంలో భూగర్భజలాలు పెరిగి భావులు అలుగుపోస్తున్నాయి. లెట్రిన్ ట్యాంకులు నిండి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజాప్రతినిధులు అధికారులు ప్రతిగ్రామంలో అండర్ గ్రౌండ్ మురుగు కాల్వలు నిర్మాణంకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. మూసీ, బిక్కేరువాగు, ఇప్పటి వరకు నీటిప్రవాహం కొనసాగుతుంది చెరువులు కుంటలు పూర్తిగా నిండాయి. గ్రామాల్లో భావులు అలుగుపోస్తున్నాయి. మరుగుదొడ్ల ట్యాంకులు నిండి గ్రామాల్లో దుర్వాసన వెదజల్లుతుంది. దోమలు విపరీతంగా పెరిగిపోయాయి. ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొందరు మరుగుదొడ్లవాటర్ మురుగు కాల్వలకు కలిపారు. మురుగు కాల్వలు దుర్వాసన సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, ఇట్టి సమస్యపై గ్రామగ్రామాన సర్వే నిర్వహించి అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ నిర్మాణం ఏర్పాటు చేయాలని అన్ని గ్రామాల ప్రజలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. మరుగుదొడ్లు నిండి నాలుగు వేలు ఖర్చుతో ఎత్తిచ్చిన మళ్ళీ యధావిధిగా నీళ్ళు ఊరుతున్నాయి. మలవిసర్జన గ్రామాల్లో నలువైపులా భహిరంగమలవిసర్జన చేయడంతో ప్రజలు అనారోగ్యం బారిన పడకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



## లక్కీడ్రాల పేరుతో ఆర్థికపరమైన మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు

సూర్యాపేట జిల్లా ఎస్‌పి కె నరసింహ



**ప్రజాపక్షం/సూర్యాపేట :** రూట్ మార్చిన రియాల్టర్లు... ప్లాట్లు అమ్ముడు పోక లక్కీ డ్రాకు తెర... ఆకర్షణీయమైన ఆఫర్లతో సామాన్యులకు ఎర... వీరు చేసే వ్యాపారమంతా చట్టానికి లోబడేనా? అంటూ ప్రజాపక్షం మెయిన్‌లో ఆదివారం ప్రచురితమైన వార్తా కథనానికి జిల్లా ఎస్‌పి కె నరసింహ స్పందించారు. లక్కీడ్రా(లాటరీ)ల పేరుతో ఆర్థికపరమైన మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో రియల్ ఎస్టేట్ వ్యాపారుల తోపాటు మరికొంత మంది వ్యవస్థీకృతంగా ఏర్పడి రూ.1000 కట్టు ప్లాట్ పట్టు అంటూ లక్కీ డ్రా పేరుతో రంగు రంగుల బ్రోచర్లను ముద్రించి సోషల్‌మీడియాలో పోస్టులు చేసి లబ్ధిపొందడం చట్టరిత్యా నేరమని అన్నారు. ఇది వ్యవస్థీకృతమైన ఆర్థిక మోసమని చెప్పారు. ఇలాంటి వ్యాపారాలపై తమ దృష్టికి రావడంతో అందుకు సంబంధించిన కొంతమందిని పోలీస్ స్టేషన్లకు పిలిచి హెచ్చరించినట్లు తెలిపారు. ఇలాంటి మోసాలకు పాల్పడితే ఎంతటి వారిపైనైనా చట్టపరంగా కేసులు నమో దు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. ఇలాంటి లక్కీ డ్రా లతో ప్లాట్ల ఆశ చూపుతున్న వారిపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మోసపోయి గోసపడొద్దని చెప్పారు.

ప్రజాపక్షం ఎఫెక్ట్


ప్రజాపక్షం

రూట్ మార్చిన రియల్టర్లు...!

## కుటుంబ విలువలే సమాజాన్ని నడిపిస్తాయి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** సమాజానికి మూలం కుటుంబమే అని, కుటుంబం నెలకొల్పిన విలువలే సమాజాన్ని నడిపిస్తాయని మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. ఆదివారం నల్లగొండలోని యూటీఎఫ్ భవన్‌లో జరిగిన చేతిలో చెయ్యేసి కథల సంకలనం ఆవిష్కరణ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని గ్రంథాన్ని ఆవిష్కరించారు. సృజన సాహితీ అధ్యక్షులు పెరుమాళ్ళ ఆనంద్ కుమారుడు నిఖిల్ వివాహం సందర్భంగా వెలువరించిన చేతిలో చెయ్యేసి కథల సంకలనం ఆవిష్కరణ సభకు డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అలుగుబెల్లి నర్సిరెడ్డి మాట్లాడుతూ పెరుమాళ్ళ ఆనంద్ ఒక సామాజిక బాధ్యత ఉన్న సాహిత్యకారుడు కనుక తన కుటుంబ ఉత్సవాలను సైతం సాహిత్య ఉత్సవాలుగా మార్చుతున్నారని అభినందించారు. ప్రముఖ కథా రచయిత మేరెడ్డి యాదగిరి రెడ్డి మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో నల్లగొండ కథకు పుట్టినిల్లుగా నిలిచిందని, ఇప్పుడు నల్లగొండ నుండి వినూత్నంగా పెళ్లి నేపథ్యంగా కథలు రావడం శుభ పరిణామమని అన్నారు. మునాసు వెంకట్ మాట్లాడుతూ నల్లగొండ కథా ప్రక్రియలో పునర్వైభవం సాధిస్తుంది అనడానికి చేతిలో చెయ్యేసి కథా సంకలనం ఒక నిదర్శనం అన్నారు. ఈ సంకలనాన్ని సృజన సాహితీ కార్యదర్శి సాగర్ల సత్తయ్య దంపతులకు అంకితం ఇచ్చారు. కోమలి కళా సమితి అధ్యక్షులు బక్క పిచ్చయ్య, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ళ వెంకటేశం, కవయిత్రి నాగిరెడ్డి అరుణ జ్యోతి,పుస్తక సమీక్షకులుగా ఎంజియా అధ్యాపకురాలు సి అనిత కుమారి,డాక్టర్ పొట్ట బత్తుల రామ కృష్ణ, బండారు శంకర్, పుస్తక సంపాదకులు శీలం భద్రయ్య శీలా అవిలేను, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.

## రిజర్వేషన్ సాధన కోసం కేంద్రంపై ఒత్తిడి

ఎమ్మెల్సీ శంకర్ నాయక్



**ప్రజాపక్షం/మిర్యాలగూడ:** వెనకబడిన తరగతులకు 42 రిజర్వేషన్ కల్పించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి వున్నదని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు గల్లీ నుండి ఢిల్లీ వరకు ఉద్యమాన్ని చేపట్టి ప్రజలను చైతన్యపరిచి రిజర్వేషన్ సాధించుకోవాల్సిన అవసరం బీసీ నాయకులపై ఉందని ఎంఎల్‌సి,డీసీసీ అధ్యక్షులు కేతావత్ శంకర్ నాయక్ కోరారు.రిజర్వేషన్ సాధన కోసం బీసీ జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు బీసీ నాయకులు తిరుమలగిరి అశోక్ ఆధ్వర్యంలో స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఎంఎల్‌సి శంకర్ నాయక్ మాట్లాడుతూ బీసీ లకు రిజర్వేషన్ పెంపు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం శాసనసభ, మండలిలో తీర్మానం చేసిందని కేంద్రప్రభుత్వానికి బిల్లు కాపీ పంపడం జరిగిందని చెప్పారు. బిల్లు అమలు పరచకుండా గవర్నర్ వద్ద బిల్లును పెండింగ్ లో పెట్టించింది కేంద్ర ప్రభుత్వమని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పగిడి రామలింగయ్య యాదవ్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వ రెండు నాలుకలా దొరణితో బీసీలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బంజారా ఉద్యోగుల సంఘం తెలంగాణా రాష్ట్ర కన్వీనర్ మాలోత్ దశరథ్ నాయక్ ,బీసీ సంఘం నాయకులు తమ్ముడబోయిన అర్జున్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## బుద్ధవనం బౌద్ధ భిక్షువులకు పవిత్రమైన ప్రదేశం

ఆర్‌పిఐ జాతీయ అధ్యక్షుడు భీమ్ రావ్ యశ్వంత్ అంబేద్కర్



**ప్రజాపక్షం/నందికొండ:** నాగార్జునసాగర్ లోని బుద్ధవనాన్ని ఆదివారం మురిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షులు,డాక్టర్ బాబాసాహెబ్ భీమ్ రావ్ అంబేద్కర్ మనుమడు భీమ్రావ్ యశ్వంత్ అంబేద్కర్ సందర్శించారు. ఆంధ్రప్రదేశ్,పల్నాడు జిల్లా లోని నాగార్జునసాగర్ విజయపురి సౌత్ లో మాలల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరైనారు.ఈ సందర్భంగా నాగార్జునసాగర్‌లోని తెలంగాణ టూరిజం గెస్ట్ హౌస్‌లో బస చేశారు. సాగర్ సందర్శనలో భాగంగా బుద్ధవనంలో బుద్ధ చరిత వనములోని బుద్ధుని పాదాల వద్ద పుష్పాంజలి వందనం ఘటించిన అనంతరం బుద్ధ వనములోని బుద్ధ చరితవనం,జాతకవనం,స్థూపవనం, ధ్యానవనం,మహాస్థూపాలను సందర్శించారు.బుద్ధ వనంలోని సమావేశ మందిరంలో బుద్ధ వనం విశేషాలను తెలిపే లఘు చిత్రాన్ని వీక్షించిన అనంతరం మహా స్తూపం అంతర్భాగంలోని ధ్యాన మందిరంలో బుద్ధ విగ్రహం వద్ద బుద్ధ జ్యోతిని వెలిగించారు.వీరికి బుద్ధ వనం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శాసన,ఎస్టేట్ మేనేజర్ రవిచంద్రలు బుద్ధ వనం కండువాలతో సన్మానం చేసి మెమెంటోలు, బ్రోచర్లను బహూకరించారు.బుద్ధవనం లోని శిల్పాల శైలిని, బుద్ధవనం విశేషాలను వారికి వివరించారు.ఈసందర్భంగా భీమ్ రావ్ యశ్వంత్ అంబేద్కర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం నాగార్జునసాగర్ లో బుద్ధవనాన్ని మహా అద్భుతంగా నిర్మించారని కొనియాడారు. బుద్ధవనం బౌద్ధ భిక్షువులకు, బౌద్ధ అభిమానులకు ఎంతో పవిత్రమైన ప్రదేశం అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బుద్ధ వనాన్ని పూర్తిస్థాయిలో మరింతగా వేగంగా అభివృద్ధి చేయాలని అన్నారు. వీరితోపాటు రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు దేవి ప్రసాద్,కెప్టెన్ ప్రవీణ్ నికాడే,మేజర్ చంద్ర కాంత్,లక్ష్మయ్య,సమతా ప్రసాద్ తదితరులు ఉన్నారు.

## నూతన డిజిటల్ లైబ్రరీ ప్రారంభోత్సవం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** నల్గొండ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా రాజా రామ్మోహన్ రాయ్ లైబ్రరీ ఫౌండేషన్ ఆర్థిక సహకారంతో ఏర్పాటుచేసిన నూతన డిజిటల్ లైబ్రరీ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా ఈ లైబ్రరీ తెలంగాణ ఫౌండర్. అసిస్టెంట్ ప్రొఫసర్ డాక్టర్ ఆనందం దుర్గాప్రసాద్ హాజరై మాట్లాడుతూ పాఠకులకు ఇంటర్నెట్ యొక్క వినియోగం ,సమాచారం వనరులు వెతకడం వినియోగించుకోవడం,ఇన్ఫర్మేషన్ ఫార్మేట్స్, ఎలక్ట్రానిక్ ఇన్ఫర్మేషన్ రిసోర్సెస్ ఈబుక్స్ ఈజర్నల్స్, ఈమేగజైన్స్ ఈడేటాబేసేస్ ఎలక్ట్రానిక్ న్యూస్ పేపర్స్ ఎలక్ట్రానిక్ పేటెంట్స్ ఇంటర్నెట్ ద్వారా పోటీ పరీక్షలకు,ఉన్నత విద్య, పరిశోధనలకే ప్రత్యేక సమాచారం, నేషనల్ డిజిటల్ లైబ్రరీ ఆఫ్ ఇండియా, స్వయం ఎంప్లాయిమెంట్ న్యూస్, ఎలక్ట్రానిక్ వీడియో ఉపన్యాసాలు,మొబైల్ అప్లికేషన్లో ఎంతగానో అందుబాటులో ఉన్నాయని,డిజిటల్ లైబ్రరీ పై గ్రంథాలయ పాఠకులకు అవగాహన ప్రత్యేక ప్రసంగం ద్వారా తెలియజేయడం జరిగింది. ఉపాధ్యాయురాలు ప్రమీల పాఠకులకు యోగ పై శిక్షణ ఇచ్చి,గ్రంథాలయానికి పోటీ పరీక్షల పుస్తకాలు వితరణ చేయడం జరిగింది.ఈ కార్యక్రమాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ సెక్రటరీ బాలమ్మ, మాజీ చైర్మన్ గాదె వినోద్ రెడ్డి,జిల్లా గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి త్రో బాల్ పోటీలకు ముత్తిరెడ్డిగూడెం క్రీడాకారులు



**ప్రజాపక్షం/మోటకొండూర్ :** యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలంలోని ముత్తిరెడ్డి గూడెం గ్రామానికి చెందిన గుర్రాల బన్నీ, ఆలకుంట్ల మనోజ్, ఆశిష్ జాయ్ క్రీడాకారులు జాతీయస్థాయి త్రో బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల నవంబర్ నెలలో హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో సిజిఆర్ ఇంటర్నేషనల్ పాఠశాలలో జరిగిన జూనియర్ కేటగిరి అండర్ 19 త్రో బాల్ రాష్ట్ర స్థాయి ఎంపికలో వీరిని జాతీయ స్థాయికి ఎంపిక చేశారు. గ్రామ స్థాయిని నుండి జాతీయ స్థాయికి వెళ్ళిన ముత్తి రెడ్డి గూడెం బిడ్డలను గ్రామస్థులు, పెద్దలు, యువత అభినందిస్తూ సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. డిసెంబరు 5 నుండి 7వ తేది వరకు మహారాష్ట్రలో జరగనున్న జాతీయ స్థాయి త్రో బాల్ పోటీల్లో వీరు పాల్గొననున్నారు.

## బస్సుజాత విజయవంతం చేయండి




**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో సిపిఐ పట్టణ శాఖ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బచ్చనగోని గాలయ్య హాజరై మాట్లాడుతూ సిపిఐ 100 వసంతాల ముగింపు బహిరంగ సభ విజయవంతం కోరుతూ ఈనెల 19న బస్సు జాతా సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం , సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాల నరసింహ, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు కే.శ్రీనివాస్ కళాకారుల నేతృత్వంలో మండల కేంద్రానికి ప్రచారబస్సు జాత మండల కేంద్రానికి వస్తున్న సందర్భంగా సిపిఐ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని బస్సు జాతాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి పల్లె మల్లారెడ్డి, సహాయ కార్యదర్శిలు మల్లయ్య, చదవాలి పందుల యాదగిరి, వీరమల్ల యాదయ్య, పార్టీ కార్యవర్గ సభ్యులు సూరపల్లి జనార్ధన్, మెగావత్ రవి, చిలువేరు రమేష్, ఎర్రోళ్ల లింగస్వామి, బిక్షం పాల్గొన్నారు.

## రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే ఎన్నికలు

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** బిసిలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు పెంచడానికి పార్లమెంట్‌లో బిల్లు పెట్టి రాజ్యాంగ సవరణ చేసి తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బిసి జెఏసి నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం బిసి జెఏసి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని సద్దల చెరువు ట్యాంక్ బండ్ నుండి ఎంజి రోడ్డు మహాత్మాజ్యోతిరావు పూలే విగ్రహం వరకు రన్ ఫర్ సోషల్ జస్టిస్ (మార్నింగ్ వాక్) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బిసిలకు న్యాయబద్ధంగా రావల్సిన జనాభా దామాషా ప్రకారం మేం ఎంతో మాకు అంత వాటాకై గత 40 సంవత్సరాల నుంచి పోరాటాలు చేస్తున్నామన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన బిసి డిక్లరేషన్ 42శాతం రిజర్వేషన్లను రాజ్యాంగబద్ధంగా పెంచిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిసి జెఏసి కోఆర్డినేటర్ చలమల్ల నర్సింహ, టిజెఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంట్ల ధర్మార్జున్, తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి అప్పం శ్రీనివాసరావు, నల్లగుంట్ల అయోధ్య, ఆకుల లవకుశ, నేరెళ్ల మధు, నిద్రా సంపత్ నాయుడు, నారబోయిన వెంకట్, కునుకుంట్ల సైదులు, బొమ్మగాని శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.





# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## రాతి క్వారీకూలి ఒకరు మృతి

**సోన్‌భద్ర (యుపి) :** సోన్‌భద్రలో కూలిపోయిన రాతి క్వారీ శిథిలాల నుండి ఆదివారం ఉదయం ఒక కార్మికుడి మృతదేహాన్ని బయటకు తీశారు, మరి కొందరు చిక్కుకున్నారని సీనియర్ పోలీసు అధికారి ఒకరు తెలిపారు. చిక్కుకున్న వ్యక్తుల సంఖ్య ఖచ్చితంగా తెలియదు. శనివారం కూలిపోయిన తర్వాత బిల్లీ మార్కుండి మైనింగ్ ప్రాంతంలో జరిగిన సంఘటనా స్థలాన్ని సందర్శించిన ఉత్తరప్రదేశ్ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే సంజీవ్ కుమార్ గోండ్ 'సుమారు డజను మంది కార్మికులు' శిథిలాల కింద ఉండవచ్చని అన్నారు. కొండ నుండి శిథిలాలను తొలగించే పని శనివారం రాత్రి నుండి కొనసాగుతోందని వారణాసి జోన్ అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (ఎడిజి) పియూష్ మోర్డియా ఆదివారం తెలిపారు. ఒక వ్యక్తి మృతదేహాన్ని వెలికితీశారు,మిగిలినవారికోసం అన్వేషణ జరుగుతోంది. మృతుడిని ఇక్కడి పనారి గ్రామానికి చెందిన రాజు సింగ్ (30)గా పోలీసులు గుర్తించారు. కొండపై నుండి పడిన రాళ్లు పెద్దవిగా ఉన్నాయని, జాగ్రత్తగా పని చేయాల్సిన అవసరం ఉన్నందున సహాయక చర్యలు సమయం తీసుకుంటున్నాయని ఎడిజి తెలిపారు. తగిన పరికరాలు, వనరులు అందుబాటులో ఉన్నాయని, మొత్తం పరిపాలన సహాయక చర్యల్లో నిమగ్నమై ఉందని మోర్డియా తెలిపారు.

## బిహార్‌లో ఓటమి, 'సర్'పై 18న కాంగ్రెస్ సమావేశం



**న్యూఢిల్లీ :** బిహార్ ఎన్నికల్లో పరాజయం, 'ఓట్ చోరీ'పై పార్టీ శ్రే ణులతో కాం గ్రెస్ సమీక్ష చేయనుంది. ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (సర్) జరుగుతున్న రాష్ట్రలు, కేంద్రపాలిత ప్రాంతాల కార్యదర్శులు, ఇతర రాష్ట్రాల పిసిసి చీఫ్‌లు, కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ నాయకులతో ఈనెల 18వ తేదీన సమీక్షా సమావేశం ఏర్పాటు చేసింది. బిహార్ అసెంబ్లీ ఫలితాల్లో ప్రతిపక్ష కూటమి మహాఘట్బంధన్ కేవలం 35 సీట్లతో సరిపెట్టుకోగా, ఎన్‌డిఎ కూటమికి 202 సీట్ల వచ్చాయి. అయితే ఎన్నికల అనంతరం కాంగ్రెస స్పందిస్తూ ఎన్నికల ప్రక్రియలో ఎన్నికల కమిషన్ పాత్రను ప్రశ్నించింది. పార్టీ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే శనివారం అత్యంత పేలవమైన ప్రదర్శనపై చర్చించారు. కాగా, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియ జరుగుతున్న 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ఎఐసిసి ఇన్‌చార్జ్‌లు, ప్రదేశ్‌కాంగ్రెస్ కమిటీ చీఫ్‌లు, కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ (సిఎల్‌పి) నాయకులు, కార్యదర్శుల సమీక్షా సమావేశం ఈనెల 18న ఇందిరా భవన్‌లో జరుగుతుందని పార్టీ సీనియర్ కార్యకర్త ఒకరు తెలిపారు. తొమ్మిది రాష్ట్రాలు, మూడు యుటిలలోని 5.99 కోట్ల మంది ఓటర్లలో 95 శాతానికి పైగా ఓటర్లు సర్ కసరత్తు కింద గణన ఫారమ్‌లను అందుకున్నారని ఇసి తెలిపింది. ఛత్తీస్‌గఢ్, గోవా, గుజరాత్, కేరళ, మధ్యప్రదేశ్, రాజస్థాన్, తమిళనాడు, ఉత్తర ప్రదేశ్, పశ్చిమ బెంగాల్, పుదుచ్చేరి, అండమాన్, నికోబార్ దీవులు, లక్షద్వీప్‌లలో 48.67 కోట్లకు పైగా గణన ఫారమ్‌లను పంపిణీ చేసినట్లు పోల్ అథారిటీ తన రోజువారీ సర్ బులెటిన్‌లో వెల్లడించింది. వీటిలో తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ, పశ్చిమ బెంగాల్ 2026లో ఎన్నికలు జరుగుతాయి. సర్ రెండవ దశను ఈనెల 4న గణనతో ప్రారంభమైంది. డిసెంబర్ 4 వరకు కొనసాగనుంది. అయితే బీహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఆశ్చర్యకరంగా ఉన్నాయని రాహుల్‌గాంధీ అభివర్ణించారు. ఎన్నికలు ప్రారంభం నుండే న్యాయంగా జరగలేదన్నారు. కాంగ్రెస్, ఇండియా కూటమి ఫలితాలపై లోతైన సమీక్ష నిర్వహిస్తాయని కూడా గాంధీ చెప్పారు. ఫలితాలు నిస్సందేహంగా 'భారీ స్థాయిలో ఓటు చోరీని ప్రతిబింబిస్తాయని ప్రధానమంత్రి, హోంమంత్రి, ఇసి సూత్రధారి' అని కాంగ్రెస్ పేర్కొంది.

## సగానికిపైగా ఎమ్మెల్యేలపై క్రిమినల్ కేసులు

### 90 శాతం మంది కోటీశ్వరులు!

**న్యూఢిల్లీ :** బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన 243 మంది ఎమ్మెల్యేలపై అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫారమ్స్ (ఎడిఆర్), బిహార్ ఎలక్షన్ వాచ్ సంచలన నివేదికను విడుదల చేశాయి. దీని ప్రకారం కొత్త ఎమ్మెల్యేల్లో సగం మందికిపైగా (130 మంది) క్రిమినల్ కేసులను ఎదుర్కొంటున్నారు. ఆరుగురిపై హత్య కేసులు ఉన్నాయి. ఈసారి ఎన్నికైన ఎమ్మెల్యేలలో 218 మంది (90 శాతం) కోటీశ్వరులే. ఆయా ఎమ్మెల్యేలు ఎన్నికల సంఘానికి సమర్పించిన అఫిడవిట్లను విశ్లేషించి ఈ నివేదికను రూపొందించారు. కొత్త ఎమ్మెల్యేల నేర చరిత్ర, ఆస్తిపాస్తుల చిట్టాలతో 'ఎడిఆర్ – బిహార్ ఎలక్షన్ వాచ్' సంయుక్త నివేదికను విడుదల చేశాయి. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్నికైన ఎమ్మెల్యేల నేపథ్యాలతో, కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేల నేపథ్యాలను ఈ నివేదిక తులనాత్మకంగా విశ్లేషించింది. తద్వారా ఆసక్తికరమైన, ఆశ్చర్యకరమైన విషయాలు వెలుగుచూశాయి. 2020లో బిహార్‌లో ఎన్నికైన ఎమ్మెల్యేలలో 163 మంది (68 శాతం) నేర చరితులలు ఉండగా, ఈసారి ఎన్నికైన ఎమ్మెల్యేలలో130మంది(53శాతం) ఉన్నారు. 15 శాతం తగ్గింది. కొత్త ఎమ్మెల్యేలలో 102 మంది (42 శాతం)పై తీవ్రమైన క్రిమినల్ కేసులు ఉన్నాయి. 2020 ఎన్నికల్లో ఈ తరహా కేసులు కలిగిన 51 శాతం మంది ఎన్నికయ్యారు. 6 మంది కొత్త ఎమ్మెల్యేలపై హత్య కేసులు ఉన్నాయి. 19 మంది కొత్త ఎమ్మెల్యేలపై హత్యాయత్నం కేసులు ఉన్నాయి. మహిళలపై దారుణాలకు సంబంధించిన కేసులను 9 మంది కొత్త ఎమ్మెల్యేలు ఎదుర్కొంటున్నారు.

### పార్టీల వారీగా తీవ్ర నేరారోపణలున్న ఎమ్మెల్యేలను పరిశీలిస్తే...

మజ్లిస్ : 5 మందిలో నలుగురు (80 శాతం), ఆర్‌జెడి : 25 మందిలో 14 మంది (56 శాతం), ఎల్‌జెపి (రామ్ విలాస్): 19 మందిలో 10 మంది (53 శాతం), కాంగ్రెస్: 6 మందిలో ముగ్గురు (50 శాతం), సిపిఐ(ఎంఎల్) : 2 మందిలో ఒకరు (50 శాతం), బిజెపి: 89 మందిలో 43 మంది (48 శాతం), జెడియు : 85 మందిలో 23 మంది (27 శాతం), రాష్ట్రీయ లోక్ మోర్చా: 4 మందిలో ఒకరు (25 శాతం)

సిపిఐ(ఎం): 1, ఇండియన్ ఇన్‌క్లూజివ్ పార్టీ : 1, బిఎస్‌పి : 1.




### ఎమ్మెల్యేలలో 90 శాతం మంది కోటీశ్వరులే

ఈసారి బిహార్‌లో ఎన్నికైన ఎమ్మెల్యేలలో 90 శాతం మంది కోటీశ్వరులే ఉండటం విశేషం. మొత్తం 243 మందిలో 218 మందికిపైగా రూ.కోట్లు విలువైన ఆస్తులను కలిగి ఉన్నారు. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన వారిలో 194 మందే (81 శాతం) కోటీశ్వరులు. ఈ గణాంకాలు ఎన్నికల రాజకీయాల్లో పెరుగుతున్న ఆర్థిక ప్రభావానికి నిలువెత్తు నిదర్శనాలుగా నిలుస్తున్నాయి. గెలిచిన అభ్యర్థుల సగటు ఆస్తులు కూడా ఆశ్చర్యకర స్థాయిలో ఉన్నాయి. ప్రతి ఎమ్మెల్యేకు సగటున రూ.9.02 కోట్ల ఆస్తులు ఉండటం గమనార్హం. బిహార్ రాజకీయాల్లో ఆర్థికంగా బలమైన అభ్యర్థుల ఆధిపత్యం పెరిగిన తీరుకు ఈ గణాంకాలు అద్దంపడుతున్నాయి. 2010 అసెంబ్లీ ఎన్నికల నాటికి రాష్ట్ర ఎమ్మెల్యేలలో కేవలం 45 మందే కోటీశ్వరులు. గత 15 ఏళ్లలో బిహార్‌లో కోటీశ్వరులైన ఎమ్మెల్యేల సంఖ్య ఏకంగా నాలుగు రెట్లు పెరిగింది. కొత్త ఎమ్మెల్యేలలో 35 శాతం మంది 5వ తరగతి నుంచి 12వ తరగతి మధ్య చదువుకున్నారు. 60 శాతం మంది ఎమ్మెల్యేలు గ్రాడ్యుయేట్ డిగ్రీ లేదా అంతకంటే ఎక్కువ చదువుకున్నారు. 5 శాతం మంది ఎమ్మెల్యేలు డిప్లొమా హోల్డర్లు. ఏడుగురు ఎమ్మెల్యేలు అక్షరాస్యులు. కొత్త ఎమ్మెల్యేలలో 38 మంది 2540 ఏళ్లలోపు వారు ఉండగా, 143 మంది ఎమ్మెల్యేలు 41 నుంచి 60 ఏళ్లలోపు వారు, 62 మంది ఎమ్మెల్యేలు 61 నుంచి 80 ఏళ్లలోపు వారు ఉన్నారు.

### కొత్త ఎమ్మెల్యేలలో 29 మంది మహిళలు



ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో 29 మంది మహిళలు గెలిచారు. మొత్తం 243 మంది ఎమ్మెల్యేలలో వీరు 12 శాతానికి సమానం. 2020లో బిహార్ అసెంబ్లీకి 11 శాతం మంది మహిళా ఎమ్మెల్యేలు ఎన్నికయ్యారు. ఈసారి మహిళల విజయాలలో స్వల్ప పెరుగుదల నమోదైంది. అయినప్పటికీ ఈ సంఖ్య చాలా తక్కువే. ఇక ఎడిఆర్ విడుదల చేసిన గణాంకాలు ఆశ్చర్యకరంగా ఉన్నాయి. రాజకీయ పార్టీలలో క్లీన్ ఇమేజ్ ఉన్న నేతలు పెద్దగా లేరని ఈ నివేదిక స్పష్టం చేస్తోంది. బిహార్ రాజకీయాల్లో నేరచరితులకు ఉన్న ప్రాధాన్యత తేటతెల్లం అవుతోంది. ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల మధ్య తీవ్ర ఆర్థిక అసమానతలు ఉన్నాయి. మహిళలకు అసెంబ్లీ టికెట్లను ఇచ్చేందుకు రాజకీయ పార్టీలు పెద్దగా మొగ్గుచూపడం లేదు. ఇకనైనా ఎన్నికల వ్యవస్థలో సంస్కరణలు చేయాలి. మహిళలు, ఉన్నత విద్యావంతులు, నేరచరిత్ర లేని వారిని రాజకీయాల్లోకి స్వాగతించాలి' అని సీనియర్ జర్నలిస్ట్ ప్రవీణ్ బాగి విశ్లేషించారు.

## స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా జరిగితే మరిన్ని సీట్లు వచ్చేవి



బిఎస్‌పి అధినేత మాయావతి

**లక్నో :** బిహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై బిఎస్‌పి అధినేత మాయావతి స్పందించారు. రాష్ట్రంలో ఎన్నికలు పూర్తిగా స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా జరిగి ఉంటే తమ పార్టీ మరిన్ని సీట్లు గెలుచుకునేదన్నారు. కైమూర్ జిల్లాలోని రామ్‌గఢ్ అసెంబ్లీ స్థానంలో(నం.203)పార్టీఅభ్యర్థి సతీష్ కుమార్ సింగ్‌యాదవ్ విజయం సాధించగా ఆయన విజయానికి కృషి చేసిన బహుజన్ సమాజ్ పార్టీ (బిఎస్‌పి) కార్యకర్తలకు మాయావతి ఎక్స్‌లో అభినందలు తెలిపారు. ఓట్లను తిరిగి లెక్కించే నెపంతో బిఎస్‌పి అభ్యర్థిని ఓడించడానికి అధికార యంత్రాంగం, అన్ని ప్రతిపక్ష పార్టీలు ఐక్యంగా ప్రయత్నించినప్పటికి, ధైర్యవంతులైన పార్టీ కార్యకర్తల అచంచలమైన సంకల్పం ఈ కుట్రను భగ్నం చేసిందని మాజీ ముఖ్యమంత్రి పేర్కొన్నారు. 'ఇది మాత్రమే కాదు, బిహార్‌లోని ఇతర స్థానాల్లో ప్రతిపక్షాలకు గట్టి పోటీ ఇచ్చినప్పటికీ, బిఎస్‌పి అభ్యర్థులు గెలవలేకపోయారు. ఎన్నికలు పూర్తిగా స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా జరిగి ఉంటే, బిఎస్‌పి కచ్చితంగా మరిన్ని సీట్లు గెలుచుకునేది. అయితే, ఇది జరగలేదు' అని మాయావతి అన్నారు. ఓటమి పార్టీ కార్యకర్తల్లో ఎటువంటి భయాందోళనలకు కారణం కావద్దని, బదులుగా రెట్టింపు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. బిహార్‌లో బిఎస్‌పి కేవలం ఒకే ఒక్క సీటను మాత్రమే గెలుచుకుంది. పార్టీ అభ్యర్థి సతీష్ కుమార్ సింగ్ యాదవ్ తన సమీప ప్రత్యర్థి, బిజెపి నాయకుడు అశోక్ కుమార్ సింగ్‌ను కేవలం 30 ఓట్ల తేడాతో ఓడించారు.

## మూడు ప్రయోగాల ఫలితం

### బిహార్ ఫలితాలపై సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య విమర్శలు



**పాట్నా :** బిహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితం అసాధారణమైనదని, ఇది మూడు ప్రయోగాల ఫలితమని ప్రతిపక్ష సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య పేర్కొన్నారు. ఈ ప్రయోగాలు మహిళా రోజ్‌గార్ యోజనలో మొదటి విడతగా మహిళలకు రూ. 10,000 బదిలీ చేయడం, సర్ ప్రక్రియలో పేర్ల మార్పులు, చేర్పులు, ఓ కార్పొరేట్ సంస్థకు తక్కువ ధరకు భూమిని బదిలీ చేశారని ఆయన విమర్శించారు. ఆర్‌జెడి నేతృత్వంలోని మహాఘట్బంధన్‌లో భాగంగా ఉన్న సిపిఐ(ఎంఎల్) 20 స్థానాల్లో పోటీ చేయగా, రెండు సీట్లను మాత్రమే గెలుచుకుంది. 2020 ఎన్నికల్లో 19 సీట్లలో పోటీ చేస్తే 12 స్థానాల్లో విజయం సాధించింది. కాగా, ఆదివారం భట్టాచార్య విలేకరులతో మాట్లాడుతూ 'మహిళలకు రూ. 10,000 అందించడంతో సహా ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్న అన్ని సంక్షేమ పథకాలు కార్యరూపం దాల్చే వరకు ఎన్నికల తేదీలను ప్రకటించలేదు. ఇది భారతదేశ ఎన్నికల చరిత్రలో అపూర్వమైన, ప్రత్యేకమైన ప్రయోగం' అని పేర్కొన్నారు. సర్ ద్వారా 65 లక్షల ఓట్లను తొలగించడం, ఎన్నికలకు ముందు తరువాతి దశలో 3.54 లక్షల ఓట్లు చేర్చడంతో ఫలితాన్ని ప్రభావితం చేసిందని వామపక్షనేత ఉద్ఘాటించారు. ఇక 'సర్' బిహార్ ప్రయోగశాలలో రెండవ పెద్ద ప్రయోగమన్నారు. 'తక్కువ ధరకు' ఒక కార్పొరేట్ సంస్థకు భూమిని బదిలీ చేయడాన్ని మూడవ ప్రయోగంగా భట్టాచార్య అభివర్ణించారు. బీహార్ వనరుల కార్పొరేటీకరణను సాధారణీకరించే అవకాశం ఉన్న ఈ అంశాన్ని ప్రతిపక్షాలు లేవనెత్తాయని, కానీ ప్రజలపై ఎటువంటి ప్రభావం చూపలేదన్నారు. ఈ మూడు ప్రయోగాలు, రానున్న కాలంలో భారత రాజకీయాల గమనం, ఎజెండాను నిర్ణయించవచ్చని ఆయన అన్నారు. ఎన్నికల ఫలితాలు 'మా ఆశలకు, అవగాహనకు మించి అసాధారణమైనవి' అంటూ పార్టీ, కూటమి భవిష్యత్తు కార్యాచరణను నిర్ణయించడానికి ఈ అంశంపై ఆలోచిస్తాయన్నారు. ఈనెల 18 నుండి 24 వరకు, తమ పార్టీ అభ్యర్థులు, కార్యకర్తలు అభిప్రాయ సేకరణ, ప్రజా సంబంధాల ప్రక్రియలో భాగంగా ప్రజల మధ్యకు వెళ్తారన్నారు. అయితే ఈ ప్రయోగాలను ఆపాలని, లేకుంటే, రాజకీయాల్లో సమాన స్థాయి ఉండదన్నారు.

## నన్ను అవమానించారు

### లాలూ కుమార్తె సంచలన పోస్టు



**పాట్నా :** అసెంబ్లీ ఎన్నికల్లో తీవ్ర పరాబవానికి గురైన లాలూ కుటుంబంలో గొడవలు తారాస్థాయికి చేరుకున్నాయి. ఆర్‌జెడి అధ్యక్షుడు లాలూ ప్రసాద్ కూతురు రోహిణి ఆచార్య తన సోదరుడు తేజస్వీ యాదవ్‌పై సంచలన ఆరోపణలు చేశారు. కోట్లాది రూపాయలు, పార్టీ టికెట్ తీసుకుని తన తండ్రికి మురికి కిడ్నీ ఇచ్చారని తనను అవమానపరిచారని ఆరోపించారు. తాను రాజకీయాల నుంచి తప్పుకుంటున్నానని, తన కుటుంబాన్ని కూడా వదలుకుంటుకున్నట్లు శనివారం ఆమె ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే ఆదివారం ఎక్స్‌లో పలు మార్లు రోహిణి తన బాధను వ్యక్త పరిచారు. తేజస్వీ, రాజ్యసభ ఎంపి సంజయ్ యాదవ్, ఆమె సోదరుడి క్రికెట్ రోజుల నుండి సన్నిహితుడైన రమీజ్ తనను నా ఇంటి నుండి వెళ్ళగొట్టారన్నారు. 'నన్ను తీవ్రంగా అవమానించారు. నా మురికి కిడ్నీని నా తండ్రికి దానం చేసినట్లు ఆరోపణలు వచ్చాయి, అది కూడా కోట్ల రూపాయలు, పార్టీ టికెట్ కోసమని' అని అన్నారు. తేజస్వీ, సంజయ్ యాదవ్‌లను తీవ్రంగా విమర్శిస్తూ, 'వివాహితులందరూ తమ తల్లిదండ్రులను కాపాడుకోవడానికి ఎప్పు డూ ఏమీ చేయవద్దు. వారికి సోదరుడు ఉంటే, వారు అతని స్వంత కిడ్నీని దానం చేయమని అడగాలి లేదా అతని హర్యానావి స్నేహితుడిని అలా చేయమని అడగాలి. నా భర్త లేదా అత్తమామల ఆమోదం తీసుకోకుండా లేదా నా ముగ్గురు పిల్లల గురించి ఆలోచించకుండా కిడ్నీని దానం చేయడం ద్వారా నేను పాపం చేశాను... ఏ కూతురికి రోహిణి విధి రాకూడదు' అని ఆచార్య ఆవేదనను వ్యక్తం చేశారు. మరొక పోస్ట్‌లో 'వివాహితురాలు, తల్లి అయినప్పటికీ దుర్భాషలాడారు. నాపైకి విసిరేందుకు ఒక చెప్పును ఎత్తుకున్నారు' అని ఆరోపించారు. 'ఏడుస్తున్న సోదరిని, తల్లిదండ్రులకు ఓ కూతురు నిస్సహాయతతో వదిలివెళ్లింది. మా అమ్మ అంటిని వదిలేసి వెళ్లిపోవాల్సి వచ్చింది. నన్ను అనాథను చేశారు. మీరు ఎప్పటికీ నా మార్గాన్ని అనుసరించవద్దు. ఏ కుటుంబానికి రోహిణి వంటి కుమార్తె సోదరి ఉండకూడదని కోరుకుంటున్నా' అని భావోద్వేగపూరిత పోస్టు చేశారు. శనివారం, ఢిల్లీకి విమానం ఎక్కేటప్పుడు, ఆచార్య ఇటీవల జరిగిన ఎన్నికల్లో పార్టీ పరాజయానికి బాధ్యత వహించాలని పట్టుబట్టినప్పుడు పరిస్థితులు వికటించాయని విలేకరుల ముందు సూచించారు. ఆమె సంజయ్, రమీజ్ గురించి కూడా తీవ్రంగా మాట్లాడారు. 'చాణక్య' లాంటి మాస్టర్ స్ట్రాటజిస్టులమని, వారు అట్టడుగు స్థాయి కార్యకర్తల అభిప్రాయాలను పట్టించుకోలేదని పేర్కొన్నారు. రమీజ్ గురించి పెద్దగా తెలియదు, ఆయన ఉత్తరప్రదేశ్‌లోని బలరాంపూర్‌కు చెందినవారు. అక్కడ ఆయన మామ రిజ్వాన్ జహీర్ మాజీ ఎంపిగా ఉన్నారు. ఆచార్య ఆయనను 'నేరపూరిత మనస్తత్వం కలిగిన గ్యాంగ్‌స్టర్, సంజయ్ యాదవ్ కోసం పనిచేసే హత్య నిందితుడు' అని అభివర్ణిస్తూ సోషల్ మీడియా పోస్ట్‌ను షేర్ చేశారు.

## శాస్త్రీయ పరీక్ష కోసం శబరిమలకు సిట్

**పతానంతిట్ట :** శబరిమల ఆలయం నుండి బంగారం అదృశ్యంపై దర్యాప్తు చేస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఆదివారం శాస్త్రీయ పరీక్ష నిర్వహించడానికి ఆలయానికి చేరుకుందని పోలీసు అధికారులు తెలిపారు. కేరళ హైకోర్టు సూచించిన విధంగా దేవ అనుజ్ఞ (దైవిక అనుమతి) ఆచారాల తర్వాత సోమవారం మధ్యాహ్నం 1 గంట తర్వాత శాస్త్రీయ పరీక్ష నిర్వహించబడుతుంది. దర్యాప్తు అధికారి డిప్యూటీ ఎస్‌పి శశిధరన్ నేతృత్వంలోని బృందం ఆదివారం ఉదయం పంపకు చేరుకుంది. పోలీసులతో పాటు, రసాయన విశ్లేషకులు సహా ఫోరెన్సిక్ నిపుణులు కూడా ఈ ప్రక్రియ కోసం బృందంలో చేరుతారని అధికారులు తెలిపారు. సోమవారమే ప్రక్రియను పూర్తి చేయడానికి ఈ బృందం సన్నిధానంలో ఉంటుందని భావిస్తున్నారు. 2019లో నివేదించబడిన బంగారం నష్టం ఎంత ఉందో తెలుసుకోవడానికి ద్వారపాలక (సంరక్షక దేవత) విగ్రహాల శాస్త్రీయ పరీక్షలు నిర్వహించడానికి అనుమతి కోరుతూ ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) కోర్టును ఆశ్రయించింది. ద్వారపాలక (సంరక్షక దేవత) విగ్రహ ప్లేట్లు, సైడ్ పిల్లర్ ప్లేట్లను తూకం వేయాలని కోర్టు సిట్‌ను ఆదేశించింది. బంగారు పూత నమూనాను తీసుకొని పూత స్వచ్ఛత, నాణ్యతను అంచనా వేయడానికి, ప్లేట్ల ఉపరితల వైశాల్యాన్ని కొలవడానికి, ద్వారపాలక ప్లేట్లు, తలుపు ఫ్రేముల నుండి రాగి నమూనాలను సేకరించాలని కూడా పరిశోధకులను ఆదేశించింది. ఈ నమూనాలను విద్యుత్ వాహకత, స్పెక్ట్రోస్కోపిక్, మైక్రోస్ట్రక్చర్ పరీక్షలతో సహా శాస్త్రీయ విశ్లేషణలకు గురిచేయాలని కోర్టు తెలిపింది. శబరిమల తీర్థయాత్ర కాలం ప్రారంభమయ్యే ముందు ఈనెల 15 నాటికి సిట్ పరీక్షను పూర్తి చేయాలని భావించినప్పటికీ, తంత్రి (ప్రధాన పూజారి) దేవ అనుజ్ఞ ఆచారాల తర్వాత మాత్రమే శాస్త్రీయ పరీక్షను నిర్వహించాలని సూచించారు. తంత్రి సూచన ఆధారంగా సోమవారం మధ్యాహ్నం 1 గంటలకు ఉచ్చ పూజ, ఆలయం మూసివేసిన తర్వాత పరీక్ష నిర్వహించాలని కోర్టు సిట్‌ని ఆదేశించింది.

## మార్చినాటికి మరో ఏడు అంతరిక్ష ప్రయోగాలు

### మానవసహిత గగనయాన్–27లో మార్పులేదు

### ఇస్రో ఛైర్మన్ నారాయణన్

**కోల్‌కతా:** రాబోయే నాలుగు నెలలు పూర్తయ్యే నాటికి మరో ఏడు అంతరిక్ష ప్రయోగాలు చేస్తున్నట్లు ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్ చెప్పారు. అదేవిధంగా 2027లో దేశం నిర్దేశించుకున్న మానవసహిత గగనయాన్ షెడ్యూలులో ఎలాంటి మార్పు లేదని ప్రకటించారు. ఇటీవలికాలంలో వాణిజ్య కార్యకలాపాలను ముమ్మరంగా నిర్వహిస్తున్న ఇస్రో ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు భారీ ప్రణాళికను నిర్దేశించుకున్నట్లు కోల్‌కతాలో పిటిఐ వార్తాసంస్థకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో చెప్పారు. దేశం శరవేగంగా శాస్త్ర, సాంకేతిక రంగాలలో ముందుకు దూసుకుపోవడమేకాకుండా, ఈ రంగాలలో పారిశ్రామిక సామర్థ్యాన్ని కూడా పెంచుకునేందుకు ఇస్రో సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26) ముగిసేనాటికి మరో ఏడు అంతరిక్ష ప్రయోగాలు చేయడమే లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు చెప్పారు. ఇందులో వాణిజ్య ప్రయోజనాలతో కూడి ఒక కమ్యూనికేషన్ ఉపగ్రహం, మల్టిపుల్ పిఎస్‌ఎల్‌వి, జిఎస్‌ఎల్‌వి ప్రయోగాలు కూడా ఉన్నారు. అదే విధంగా ఒకేసారి అనేక ఉపగ్రహాలను వేరు వేరు కక్ష్యలలోకి ప్రవేశపెట్టే దేశీయ పిఎస్‌ఎల్‌వి ప్రయోగం, భూస్థిర కక్ష్యలో, భూ అనువర్తిత కక్ష్యలో ఉపగ్రహాలను ప్రవేశపెట్టేందుకు ఉద్దేశించిన దేశీయ నిర్మిత జిఎస్‌ఎల్‌విల ప్రయోగాలు కూడా ఈ షెడ్యూలులో ఉన్నాయి. విదేశీల సాంకేతికతపై ఆధారపడకుండా పూర్తిగా దేశీయ సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన మొట్టమొదటి పిఎస్‌ఎల్‌వి ప్రయోగం కూడా ఈ షెడ్యూల్‌లో ఉండటం ప్రధానాంశం.

### 2028 లో చంద్రయాన్–4



జపాన్‌తో కలిసి దక్షిణ ధృవాన్వేషణ

చంద్రయాన్–4 ప్రయోగానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలియజేసినట్లు నారాయణన్ చెప్పారు. చంద్రయాన్–4 ప్రయోగం ద్వారా భారతదేశ కీర్తిప్రతిష్టలు మరింతగా ఇనుమడిస్తాయి. చంద్రుడిపై ఉన్న మట్టి నమూనాలను భూమికి తీసుకురావడమే చంద్రయాన్–4 ప్రయోగం ప్రధాన లక్ష్యమని చెప్పారు. 2028లో చంద్రయాన్–ఫోర్ ప్రయోగం చేయాలని నిర్దేశించుకున్నట్లు చెప్పారు. చంద్రుడి మీద మట్టి సేకరణకు అత్యంత సంక్లిష్టమైన సాంకేతిక ప్రక్రియ అవసరమని, ఇప్పటివరకూ మూడు అగ్రదేశాలు (అమెరికా,రష్యా,చైనా) ఈ మట్టిని సేకరించి తెచ్చాయన్నారు. భారత్ కూడా ఈ లక్ష్యాన్ని సాధించి ఆ స్థాయికి చేరుతుందన్నారు. అదేవిధంగా ''లూపెక్స్'' అనేక మరో కీలకమైన చంద్రుడి దక్షిణ ధృవాన్వేషణ కార్యక్రమాన్ని జపాన్‌తో కలిసి సంయుక్తంగా ఇస్రో చేపట్టిందన్నారు. జపాన్ అంతరిక్ష అన్వేషణా సంస్థ (జెఎఎక్స్‌ఎ)తో కలిసి ఇస్రో ఎంతో ప్రణాళికాబద్ధంగా 2026లోగానీ, ఆ తర్వాత గానీ చంద్రుడి దక్షిణ ధృవ అన్వేషణ యాత్ర చేస్తుందన్నారు. ఈ ప్రయోగంలో మానవ రహిత ల్యాండర్‌ను రోవర్‌ను చంద్రుడి దక్షిణ ధృవానికి పంపుతారు. జపాన్ అంతరిక్ష సంస్థ రోవర్‌ను తయారు చేస్తుంది. ఇస్రో ల్యాండర్‌ను తయారు చేస్తుంది. చంద్రుడి దక్షిణ ధృవంలో ఉన్న మంచును అధ్యయనం చేసే లక్ష్యంతో లూపెక్స్ ప్రయోగాన్ని చేపడుతున్నారు. అటు చంద్రయాన్–4, ఇటు జపాన్‌తో కలిసి లూపెక్స్ ప్రయోగ కార్యక్రమాలు, వాటి పనులను ఇస్రో ఏక కాలంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

### రాబోయే పదేళ్ళలో భారత అంతరిక్ష కేంద్ర నిర్మాణం


అత్యంత ప్రతిష్టాత్మకంగా భారతదేశం చేపట్టిన అంతరిక్ష పరిశోధనా కేంద్ర నిర్మాణ కార్యక్రమాన్ని 2035 నాటికి ఇస్రో పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు నారాయణన్ చెప్పారు. భారత అంతరిక్ష పరిశోధనా కేంద్ర నిర్మా ణం పనులను ఇస్రో ఇప్పటికే ప్రారంభించిందని చెప్పా రు. ప్రపంచంలో ప్రస్తుతం కేవలం చైనా దేశానికి మాత్రమే ప్రత్యేకంగా ఒక అంతరిక్ష కేంద్రం ఉంది. ఇంకెవ్వరికీ అంతరిక్షంలో పరిశోధనలకు ఒక ప్రత్యేక కేంద్రం లేదు. ఐతే అమెరికా నాయకత్వంలో నిర్మించిన ఐఎస్‌ఎస్‌కు క్రమంగా కాలం చెల్లుతోంది. ఈ అంతరిక్ష కేంద్రాన్ని అమెరికా, రష్యా, జపాన్, యూరోపియన్ యూనియన్, కెనడా దేశాలకు చెందిన అంతరిక్ష సంస్థలు ఉమ్మడిగా నిర్మించాయి. దాని ద్వారా ఉమ్మడి ప్ర యోజనాలు పొందుతున్నాయి. 1998లో ఏర్పడిన అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం భూమికి 400 కి.మీ ఎత్తులో పరిభ్రమిపస్తోంది. ఐతే 2021 ఏప్రిల్‌లో చైనా తియాన్‌గాంగ్ అంతరిక్ష కేంద్రాన్ని ప్రారంభించింది. అదేతరహాలో భారత్ కూడా తన కంటూ ఒక అంతరిక్ష కేంద్రాన్ని నిర్మించుకోవాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది.

### 2040 నాటికి చంద్రడిపైకి భారతీయులు

భారతదేశం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన మానవ సహిత రోదసీయాత్ర నిర్ణీత ప్రకారం 2027లోనే జరుగుతుందని, అందులో ఎలాంటి మార్పు లేదని నారాయణన్‌చెప్పారు. దీనికి ముందుగా మూడు రకాలుగా మానవ రహిత గగనయాత్రలను ఇస్రో చేపడుతుందని, వాటి అనుభవ సారాంశాలను తీసుకునిమానవ సహిత గగనయాన్‌కు జాగ్రత్తగా ఏర్పాట్లు చేస్తామన్నారు. భారత వ్యోమగాములను అంతరిక్షంలోకి పంపించి తిరిగి జాగ్రత్తగా భూమిపైన దింపడం ప్రధాన లక్ష్యమన్నారు. ఈ విజయాలు తదుపరిభారత అంతరిక్ష కేంద్రం నిర్వహణకు ఉపయోగపడతాయి. చంద్రుడు మీదకు 2040 నాటికి భారత వ్యోమగాములు రాకపోకలు సాగించాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీలక్ష్యంగా నిర్దేశించారన్నారు. చైనా ప్రభుత్వం 2030 నాటికి చంద్రుడిమీదకు వ్యోమగాములను పంపాలని లక్ష్యంగా పెట్టుకుంది. అదేవిధంగా భారతదేశం అంతరిక్ష వాణిజ్య వ్యాపారంలో కూడా బాగా రాణిస్తోందని చెప్పారు. ప్రస్తుతం భారతదేశం అంతరిక్ష ఆర్థికలావాదేవీలు ప్రస్తుతం 8.2 బిలియన్ డాలర్లుగా ఉందని, 2033 నాటికి ఈ విలువను 44 బిలియన్ డాలర్లకు పెంచాలన్నది లక్ష్యమన్నారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ విలువ 630 బిలియన్ డాలర్లుగా నమోదైంది. 2035 నాటికి ఈ విలువ 1.8 ట్రిలియన్‌డాలర్లకుచేరుకుంటుంది. అంతరిక్ష రంగంలో ప్రైవేటురంగ సంస్కరణలు గణనీయంగా పెరుగుతున్నాయన్నారు. భారతదేశంలో ప్రస్తుతం 450 కి పైగా పరిశ్రమలు, 330కి పైగా అంకుర సంస్థలు క్రియాశీలంగా పనిచేస్తున్నాయని చెప్పారు. కేవలం మూడేళ్లవ్యవధిలోనే ఈ అంకుర సంస్థల విలువ భారీగా పెరిగిందన్నారు.

## బిహార్ ఎన్నికలకు రూ.14,000 కోట్లు మళ్లింపు

### కేంద్ర ప్రభుత్వంపై జన్‌సురాజ్ సంచలన ఆరోపణ



**న్యూఢిల్లీ :** బిహార్ అసెంబ్లీ ఎన్నికల కోసం ఫారెన్ డెవలప్‌మెంట్ ఫండ్స్‌ను కేంద్ర ప్రభుత్వం దుర్వినియోగం చేసిందని జన్ సురాజ్ ప్రతినిధి, సీనియర్ నేత పవన్ కె వర్మ సంచలన ఆరోపణలు చేశారు. ఆదివారంనాడిక్కడ మీడియాతో ఆయన మాట్లాడుతూ, ప్రపంచ బ్యాంకు మంజూరు చేసిన ప్రాజెక్టుకు ఉద్దేశించిన రూ.14,000 కోట్లను మళ్లించి, బిహార్‌లో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి రావడానికి ముందు మహిళా ఓటర్లకు పంపిణీ చేశారని ఆరోపించారు.దారిమళ్లించిన నిధులను 'ముఖ్యమం త్రి మహిళా రోజ్‌గార్ యోజన' ద్వారా బిహార్‌లోని 1.25 కోట్ల మహిళల అకౌంట్లలోకి రూ.10,000 చొప్పున జమచేశారని వర్మ తెలిపారు.అయితే ఈ సమాచారాన్ని ఆయన స్వతంత్రంగా నిర్ధారణ చేయలేదు. నిధులు మళ్లించినదే నిజమైతే నైతికత అనేది ప్రశ్నార్థకమవుతుందని పేర్కొన్నారు. ఒక ప్రాజెక్టు కోసం వరల్డ్ బ్యాంకు నుంచి అందిన రూ.21, 000 కోట్లలో రూ.14,000 కోట్లు దారిమళ్లినట్టు తమకు తెలుస్తోందని, ఇది వాస్తవమైతే రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడమే అవుతుందన్నారు. బిహార్‌ఆర్థిక పరిస్థితి ఇప్పటికే తీవ్ర ఇబ్బందుల్లో ఉందని, రాష్ట్రానికి రూ.4.06 లక్షల కోట్ల రుణాలున్నాయని, ప్రతిరోజూ రూ.63 కోట్లు వడ్డీ కింద చెల్లింపులు జరుగుతున్నాయని పవన్‌వర్మ తెలిపారు. బిహార్ ఖజానాఖాళీఅయిన తరుణంలో ఇంత భారీ వ్యయంఎలాసమర్ధనీయమవుతుందని ప్రశ్నించారు. ఎన్‌డిఎ అధికారంలోకి రాకుంటే తక్కిన ఇన్‌స్టాల్‌మెంట్స్ మహిళలకు రావంటూ ఉద్దేశపూర్వకంగనే వదంతులు వ్యాప్తి చేశారనిఆరోపించారు.4 కోట్ల మహిళా ఓటర్లలో 1.25 కోట్ల మందికి నిధులు జమచేసి, ఎన్డీయేకు ఓటు వేయకుంటే తక్కిన వారికి చెల్లింపులు ఆపేస్తారనే అభిప్రాయం కలిగించారన్నారు. ఉచితాల సంస్కృతిని గతంలో విమర్శించిన ప్రధాని నరేంద్ర మోదీ బిహార్‌లో ఇందుకు భిన్నంగా వ్యవహరించడాన్ని ప్రశ్నించారు. ఉచితాలపై ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీని మోదీ విమర్శించారని గుర్తు చేశారు.

**Change of Name**

I **Jatothu VarunKumar S/O Boda Veeranna** (Old name) R/O : H.NO.1–182/2,Balunayak Thanda, Nallabelli (Village) Sangem (Mandal), Warangal District, Telangana state, have changed my name from **Jatothu Varunkumar to Boda Sai Varun S/O Boda Veeranna** (new name) for all purposes.

# సాహితీ విహారి

# అందెశ్రీ పాట.. తెలంగాణ బాట

తెలంగాణ ఆత్మను ఆవిష్కరించిన అందెశ్రీ రచన.. తెలంగాణ ఉద్యమానికి కొత్త ఊపిరినిచ్చి, ఆత్మగౌరవాన్ని దిగదిగాంతాలకు వ్యాపింప చేసిన ఈ పాటకు సముచిత న్యాయం.. స్థానం లభించాయి. అందరికీ తెలిసిందే, కానీ, ఎప్పటికప్పుడు కొత్తగా అనిపించే.. సరికొత్తగా వినిపించే మన రాష్ట్రం గీతం మరోసారి మీకోసం..

జయ జయహే తెలంగాణ
జననీ జయకేతనం
ముక్కోటి గొంతుకలు ఒక్కటైన చేతనం
తరతరాల చరిత గల తల్లీ నీరాజనం
పదపదాన నీ పిల్లలు ప్రణమిల్లిన శుభతరుణం
జై తెలంగాణ జైజై తెలంగాణ
జై తెలంగాణ జైజై తెలంగాణ

**చరణం: (1)**
పంపనకు జన్మనిచ్చి బద్దెనకు పద్యమిచ్చి
భీమకవికి చనుబాల బీజాక్షరమైన తల్లి
హాలుని గాథాసప్తశతికి ఆయువులూదిన నేల
బృహత్కథల తెలంగాణ కోటి లింగాల కోన
జై తెలంగాణ జైజై తెలంగాణ
జై తెలంగాణ జైజై తెలంగాణ

**చరణం: (2)**
ప్రజల భాషలో కావ్య ప్రమాణాలు
ప్రకటించిన
తెలుగులో తొలి ప్రజాకవి 'పాలకుర్కి' సోమన్న
రాజ్యాన్ని ధిక్కరించి రాములోరి గుడిని గట్టి
కవిరాజై వెలిగె దిశల 'కంచర్ల గోపన్న'
జై తెలంగాణ జైజై తెలంగాణ
జై తెలంగాణ జైజై తెలంగాణ

**చరణం: (3)**
కాళిదాస కావ్యాలకు భాష్యాలను రాసినట్టి
'మల్లినాథసూరి' మా మెతుకు సీమ కన్నబిడ్డ
ధూళికట్ట నేలినట్టి భౌద్ధానికి బంధువతడు
ధిజ్ఞాగుని గన్న నేల ధిక్కారమే జన్మహక్కు
జై తెలంగాణ జైజై తెలంగాణ
జై తెలంగాణ జైజై తెలంగాణ

**చరణం: (4)**
'పోతన'దీ పురిటిగడ్డ.. 'రుద్రమ'దీ వీరగడ్డ
గండరగండడు 'కొమురం భీముడే' నీ బిడ్డ
కాకతీయ కళాప్రభల కాంతి రేఖ రామప్ప
గోలుకొండ భాగ్యనగరి గొప్ప వెలుగు
చార్మినారు
జై తెలంగాణ జైజై తెలంగాణ
జై తెలంగాణ జైజై తెలంగాణ

**చరణం: (5)**
రాచకొండ ఏలుబడిగ రంజిల్లిన రేచర్ల
'సర్వజ్ఞ సింగ భూపాలుని' బంగరుభూమి
వాణీ నా రాణి అంటూ నినదించిన కవి
కులరవి
'పిల్లలమర్రి పినవీరభద్రుడు' మాలో రుద్రుడు
జై తెలంగాణ జైజై తెలంగాణ
జై తెలంగాణ జైజై తెలంగాణ

**చరణం: (6)**
'సమ్మక్క'లు 'సారక్క'లు సర్వాయి పాపన్నలు
సబ్బండ వర్ణాల సాహసాలు కొనియాడుతు
ఊరూర పాటలైన 'మీరసాబు' వీరగాథ
దండు నిడిపే పాలమూరు 'పండు గొల్ల
సాయన్న'
జై తెలంగాణ జైజై తెలంగాణ
జై తెలంగాణ జైజై తెలంగాణ

**చరణం: (7)**
కవిగాయక వైతాళిక కళల మంజీరాలు
డప్పు, ఢమరుకము, డక్కి, శారద
స్వరనాదాలు
పల్లవుల చిరుజల్లుల ప్రతి ఉల్లము రంజిల్లగ
అనునిత్యము నీ గానం
అమ్మ నీవే మా ప్రాణం
జై తెలంగాణ జైజై తెలంగాణ
జై తెలంగాణ జైజై తెలంగాణ

**చరణం: (8)**
జానపద జనజీవన జావళీలు జాలువార
జాతిని జాగృతపరిచే గీతాల జనజాతర
వేలకొలదిగా వీరులు నేల ఒరిగి పోతెనేమి
తరుగనిదీ నీ త్యాగం మరువనదీ
శ్రమ యాగం
జై తెలంగాణ జైజై తెలంగాణ
జై తెలంగాణ జైజై తెలంగాణ


**చరణం: (9)**
బడుల గుడులతో పల్లెల ఒడలు పులకరించాలి
విరిసే జనవిజ్ఞానం నీ కీర్తిని పెంచాలి
తడబడకుండా జగాన తల ఎత్తుకొని బ్రతుక
ఒక జాతిగ నీ సంతతి ఓయమ్మ వెలగాలి.
జై తెలంగాణ జైజై తెలంగాణ
జై తెలంగాణ జైజై తెలంగాణ

అసలుసిసలైన తెలంగాణ వాది అందెశ్రీకి మరణం ఏమిటి? భౌతికంగా దూరమైనా, పాటల రూపంలో ఆయన మనందరి గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోతారు. అందెశ్రీతో ఉన్న కొద్దోగొప్పో పరిచయం... కాస్తోకూస్తో సాన్నిహిత్యం ఆయన మాటల్లో, పాటల్లో, చేతల్లో ఉన్న నిజాయితీని అర్థం చేసుకోవడానికి ఉపయోగపడుతుందేమో!. చాలా మంది కవులు చెప్పేది ఒకటి.. చేసేది మరొకటి... వారి మాటల్లో (కవిత్వానికి అనాలేమో!) కనిపించే భావాలు, సిద్ధాంతాలు, విలువలు నిజజీవితంలో భూతద్దం పెట్టి వెతికినా కానరావు. స్వార్థం నిండిన హృదయాలు.. నిజాయితీ కొరవడిన జీవితాల మధ్య అందెశ్రీ ప్రస్థానం ఒక సాహసమే. ఈ రోజుల్లో ముక్కుసూటిగా మాట్లాడితే మెచ్చేదెవరు? పారదర్శకంగా ఉంటే నచ్చేదెవరు? అందుకే, అందెశ్రీ వెరపులేని మాట గరుగ్గా.. ఒకింత కఠినంగా ఉంటుంది. తెలంగాణ మలిదశ ఉద్యమ జ్వాలను రగిలించి, లక్ష్యసాధన వరకూ తీసుకెళ్లిన వారు ఎంతో మంది ఉన్నారు. సామాన్య ప్రజల నుంచి వివిధ పార్టీల రాజకీయ నాయకుల వరకూ అందరూ ఎంతోకొంత మద్దతునిచ్చారు. అయితే ప్రజాకవుల పాత్ర అసమాన్యం... అందులో అందెశ్రీది అగ్రస్థానం. తెలంగాణ ఆత్మగౌరవ నినాదాన్ని.. భావనను అందెశ్రీ తన పాటల్లో పలికించారు. తెలంగాణ అస్తిత్వ వాదాన్ని వినిపించారు. తెలంగాణ ఆత్మగౌరవ భావాన్ని ప్రజల్లో స్ఫూర్తి నింపారు. తెలంగాణ ఘనతను చాటి చెప్పారు. 'జయజయహే తెలంగాణ జననీ జయకేతనం' అంటూ సాగిన పాటను 'హైజాక్' చేసే కుట్రలు జరిగాయి. తెలంగాణ రాష్ట్ర గీతంగా గుర్తింపుకు నోచుకోకుండా అడ్డుకున్న కుత్సితపు బుద్ధులు బయటపడ్డాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత, 'జయజయహే తెలంగాణ' పాటను రాష్ట్రగీతంగా ప్రకటించిన ప్రభుత్వం తనను తాను సత్కరించుకుంది. తెలంగాణ వైభవాన్ని నిలుదిశలా వ్యాపించే మార్గాలను సుసంపన్నం చేసింది. ఈ పాటలో తెలంగాణ గొప్పతనమేకాదు... తెలంగాణ ఆత్మ ఆవిష్కృతమవుతుంది. మనవత్వపు జాడలు వెతుకుతున్నప్పుడు ఆయనలో ఆర్ద్రత కనిపిస్తుంది. అన్యాయాలపై నిలదీస్తున్నప్పుడు ఆయన గొంతు అగ్ని వర్షం కురిపిస్తుంది. మాటల్లో... రచనల్లో ఎంత వైవిధ్యం కనిపించినా, ఆహార్యంలో... వ్యవహారంలో ఏమాత్రం మార్పు ఉండదని అందెశ్రీతో పరిచయం ఉన్న ప్రతి ఒక్కరికీ తెలుసు. 'నా కులం ఏమిటో నాకు తెలియదు. కానీ నన్ను పెంచుకున్న తల్లి చనుబాలు తాగాను కాబట్టి, నన్ను నేను దళితుడిగా పిలిపించుకోవడానికి సిగ్గుపడను. కానీ, ఉద్యమానికి కులం రంగు ఎందుకు? పెను తుపానులా విరుచుకుపడే నిరసన జ్వాలల ముందు కులం నిలబడుతుందా?' అంటున్న అందెశ్రీ ఆంతర్యం కడిగిన ముత్యంలా మెరుస్తూ కనిపిస్తుంది. కులమతాలకు అతీతంగా ఆయన ఆలోచించిన విధానం ఆచరణీయం. తెలంగాణ పట్ల ఆయనకు ఉన్న ఎల్లలు లేని ఆరాధనా భావం ప్రతి పాటలోనూ.. ప్రతి పదంలోనూ మనసులకు హత్తుకునేలా మనలను పలకరిస్తుంది. తెలంగాణ ఆత్మను ఆవాహన చేసుకున్నాడు కాబట్టే అవమానాన్ని ఎదిరించారు. దోపిడీని ఎండగట్టారు. 'జై బోలో తెలంగాణ' అంటూ నినదించారు. ఆంధ్ర పాలకుల దోపిడీ, వివక్ష పాలనలో 'నిలువెల్ల గాయాల వీణ'గా మారిన తెలంగాణ దుస్థితిని వివరించారు. 'జన జాతరలో మన గీతం జయకేతనమై ఎగరాలి' అని ఆశించారు. 'జంఝూ మారుత జన నినాదమై జేగంటలు మోగించాలి' అని కలలు కన్నారు. జీవితం ఒకటే... మరణం కూడా ఒకటే... కాబట్టి జీవితమంతా జనమే మననం కావాలని అనడమేకాదు, తాను స్వయంగా జనం కోసం బతికి చూపించిన ఘనత ఆయనది. 'కష్టాల్ నష్టాలెన్నెదురైనా.. కార్యదీక్షలో తెలంగాణ' ముందుకు దూసుకెళుతునే ఉంటుదని స్పష్టం చేశారు. గూడ అంజయ్య... గద్దర్.. సుద్దాల హనుమంతు.. గోరేటి వెంకన్న.. జైరాజు.. నందిని సిధారెడ్డి వంటి ఎంతో మంది పాటలతో తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగసిపడడానికి కారణమయ్యారు. ప్రత్యేక తెలంగాణ ఆవిరాభవంలో కీలక పాత్ర పోషించారు. ఒకరితో మరొకరిని పోల్చడానికి వీల్లేదు. అందెశ్రీది మరింత విలక్షణమైన శైలి. ఆయన పాటలు పోరాటాల బావుటాలు. ఆత్మగౌరవ ప్రతీకలు. ప్రజల జీవితాలకు దర్పణాలు. ఒక్క మాటలో చెప్పాలంటే, తెలంగాణ ఆత్మ ప్రతిబింబాలు. అణచివేతను, దోపిడీని తెలంగాణ ఎన్నడూ సహించలేదని, పోరుబాటకు ఎన్నడూ వెనుకంజ వేయలేదని '**జై బోలో తెలంగాణ' పాటలో గుర్తుచేస్తారు.**

**'దేశముఖులను దొరభూస్వాముల**
**గడీల నుండి ఉరికించాం**
**రజాకారులను తరిమికొట్టి**
**నైజాముకే గోరి గట్టేశాం**' అని గతాన్ని గుర్తుచేసుకుంటారు. అందుకే, ప్రత్యేక రాష్ట్రం అవతరించిన తర్వాత, కుటుంబ పాలన మొదలైందని పలు సందర్భాల్లో ఆవేదన వ్యక్తం చేశారు. '**ఐదు సంవత్సరాలు... కాకుంటే పదేళ్లు.. ఎల్లకాలం పాలించడానికి తెలంగాణ మీ జాగీరు కాదు' అని గర్జిస్తారు.**

**'రోషం గుండెల.. రోకలి బండలు**
**బిగిసిన పిడికిళ్ళు.. వడిశెల రాళ్ళు**
**వేలకువేలా బలిదానాల**
**వీరులు చేప్పిన దారుల్లో**' నడవాలని మార్గదర్శకం చేస్తూనే, 1969 తెలంగాణ ఉద్యమాన్ని కొందరు రాజకీయ నాయకులు తమ స్వార్థానికి ఉపయోగించుకున్న వైనాన్ని, నాటి వేలాది మంది విద్యార్థులు, యువత త్యాగాన్నీ ప్రస్తావిస్తారు.


**'ఆత్మగల్ల మా తెలంగాణకు**
**అరవై తొమ్మిది గ్రహణం**
**మూడువందల అరవై తొమ్మిది**
**విద్యార్థుల బలిదానం' అంటూ ఆవేదన వ్యక్తం చేస్తారు.**
**'వంచన వచ్చి.. పంచను జేరితె**
**సమరాంగణంలో.. సైంధవులుంటరు**' అని మలిదశ ఉద్యమ వీరులను హెచ్చరించి మార్గదర్శకం చేస్తారు.
**'మోసాలను పసిగడుతూ అమరుల**
**త్యాగాలను నిలబెట్టే దిశల**' సాగాలని సూచిస్తారు. తెలంగాణ విద్యార్థులే ఉద్యమాల తొలిపొద్దులని, ఖాకీ జులుం నిర్మించిన కత్తుల వంతెన మీద కవాతు చేశారని గుర్తుచేసుకుంటారు. ప్రత్యేక తెలంగాణ కోసం ఎంతో మంది 'ప్రతినలు బూని.. ప్రాణాలొడ్డిన' తీరును బాధతో ప్రస్తావిస్తారు. తుపాకీ రాజ్యం చెల్లదన్న ఆయన సింహగర్జన తెలంగాణ నలుమూలలా ప్రతిధ్వనించింది. నిప్పులు చెరిగే తుపాకీ రవ్వలను గుప్పిట బట్టి నలిపేస్తామని, నెత్తురు చిందే దారుల్లోన విత్తనాలమై మొలకేస్తాం అంటారు. ఇంతకంటే స్ఫూర్తినిచ్చే పదాలు ఎక్కడ ఉంటాయి? ఇంతకు మించిన గొప్ప ఉద్యమ సాహిత్యం ఎక్కడ దొరుకుతుంది? లాఠీలు విరిగినా లడాయి మానబోమని, పిడుగులు పడినా మడమలు తప్పబోమని తెగించి చెప్పడంలోనే చావోరేవో తేల్చుకోవాలన్న ఆశయం, అమీతుమీకి సిద్ధమయ్యే తెంపరితనం అర్థమవుతాయి. అందెశ్రీ పాటలో ఎన్ని లోతులో... ఆ పదాలకు ఎంత పదునో! అందెశ్రీ పుస్తకాలు చేతబట్టి పాఠశాలకు వెళ్లలేదు... కర్ర అందుకొని పశువులు కాశారు. కలం పట్టుకొని గ్రంథాలు రచించలేదు... తాపీ పని చేశారు. అందుకే, విస్తారంగా పుస్తకాలు చదివి.. ఎక్కడి నుంచో ఎరువు తెచ్చుకున్న ఆలోచనలు ఆయనకు లేవు... రానే రావు. ఆయన పాట స్ఫటికం. సైద్ధాంతిక ప్రస్థానం పారదర్శకం. తెలంగాణ సాహితీ ప్రపంచంలో అందెశ్రీ ఓ మేరుపర్వతం.



**— బిఎల్**

## చదవాల్సిన పుస్తకం


# అమెరికన్ రాజకీయాలను ఎండగట్టిన 'జైల్‌బర్డ్'




కర్ట్ వొనెగట్ రచించిన 'జైల్‌బర్డ్' అమెరికన్ రాజకీయాలను ఎండగట్టిన ఒక గొప్ప రచన. 1974లో అగ్రరాజ్యాన్ని కుదిపేసిన వాటర్‌గేట్ కుంభకోణం కారణంగా, అప్పటి దేశాధ్యక్షుడు రిచర్డ్ నిక్సన్ తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. ఉన్నతాధికారులు హెచ్‌ఆర్ హాల్డ్‌మన్, జాన్ ఎర్లిచ్‌మన్ శిక్ష అనుభవించారు. ఈ కుంభకోణంతో సంబంధం లేకపోయినప్పటికీ, నిక్సన్ ప్రభుత్వంలో కీలక పదవిలో ఉన్న కారణంగా వాల్టర్ ఎఫ్. స్టార్‌బక్ కూడా శిక్షకు గురయ్యాడు. ఫెడరల్ జైల్ నుంచి బయటకు వచ్చిన తర్వాత, అతనిని కలుసుకోవడానికి కూడా ఎవరు రాలేదు. కుటుంబ సభ్యుల నుంచి స్నేహితుల వరకూ అంతా తమకు సంబంధం లేనట్టుగానే వ్యవహరించారు. వాల్టర్ జైలు జీవితం అనుభవించడానికి దారితీసిన పరిస్థితులు, ఆ తర్వాత అతను ఎదుర్కొన్న సమస్యల ఆధారంగా వొనెగట్ రచించిన 'జైల్‌బర్డ్' నవల 1979లో విడుదలైంది. ప్రభుత్వ వర్గాల్లోని మంచి వ్యక్తుల నుంచి కార్మిక ఉద్యమాల వరకూ పలు అంశాలను ఈ నవల చర్చిస్తుంది. అమెరికన్లు తమ నాయకులపై ఉంచిన నమ్మకం, పెట్టుకున్న ఆశలు ఏ విధంగా ఆవిరవుతున్నాయో కూడా వివరిస్తుంది. వొనెగట్ ప్రతి విషయాన్నీ చాలా స్పష్టంగా వ్యక్తీకరించాడు. రాజకీయ పరిస్థితులను కూడా అద్భుతంగా వివరిస్తాడు. సంప్రదాయ కార్మిక ఉద్యమాలను ప్రస్తావిస్తాడు. రాజకీయ క్రీనీడలో మరణిస్తున్న ఆదర్శాలను గుర్తుచేస్తాడు. హార్వర్డ్ నుంచి పట్టాపొంది, ప్రభుత్వ ఉన్నతాధికారిగా ఎదిగిన స్టార్‌బక్ జీవితాన్ని ఈ నవల వివరిస్తుంది. నిక్సన్ పరిపాలనలో, చేయని నేరానికి అతను జైలుపాలైన విధానాన్ని రచయిత వివరిస్తాడు. ఒక వ్యక్తి తప్పు చేయకపోయినా, తప్పుడు మనుషులతో కలిసి ఉంటే ఎదురయ్యే సమస్యలను, కష్టాలను వివరిస్తాడు. వాటర్‌గేట్ కుంభకోణం చోటు చేసుకున్న సమయంలో, అధికారిగా ఉండడం మినహా స్టార్‌బక్ చేసిన పొరపాటు లేదని స్పష్టం చేస్తాడు. ఈ కథనాన్ని రచయిత 'ఫ్లాష్‌బ్యాక్' రూపంలో వివరిస్తాడు. న్యూయార్క్ జైలు నుంచి విడుదలైన రెండు రోజుల్లో, స్టార్‌బక్ జీవితంలో చోటు చేసుకున్న పరిణామాలను ప్రధానంగా పేర్కొంటాడు. యువ సామాజికవేత్త, ఆదర్శప్రాయుడిగా పేరుతెచ్చుకున్న ప్రజాప్రతినిధి సామ్యూల్ ఇర్విన్ జూనియర్ నేతృత్వంలో ఏర్పడిన కమిటీ ముందు హాజరైనప్పుడు స్టార్‌బక్ ఎదుర్కొన్న మానసిక సంఘర్షణను, ఒత్తిడిని అద్భుతంగా వివరిస్తాడు రచయిత. స్టార్‌బక్, మేరీ కాథలిన్ ఓ' లూనీ మధ్య ప్రేమ, అమెరికన్ ర్యాడికల్ ఆదర్శాలు, ద్రోహం వంటి అంశాలు కూడా ఇందులో ఇమిడి ఉంటాయి. రాజకీయ పార్టీల ఆలోచనలు, విధానాలు మారనంత వరకూ ఎంతో మంది స్టార్‌బక్‌లకు సమస్యలు తప్పవని, ఏ తప్పూ చేయకపోయినా శిక్ష అనుభవించాల్సిన పరిస్థితులు కొనసాగుతాయని వొనెగట్ తేల్చిచెప్తాడు.


కర్ట్ వొనెగట్

# ఉద్యమగీతాల తపస్వీ 'ఎస్వీ'




సమాజంలో దోపిడీ కొనసాగుతున్నంత కాలం.. అణచివేత ఉన్నంత కాలం.. సామాజిక స్పృహ ఉన్న అభ్యుదయ, ప్రగతిశీల రచయితలు స్పందిస్తునే ఉంటారు. ప్రతిఘటన స్ఫూర్తిని నింపుతునే ఉంటారు. మిగతా సాహితీ ప్రక్రియలతో పోలిస్తే, నిరసనల నుంచి పుట్టుకొచ్చే ఉద్యమాలకు పాట పునాది అవుతుంది. స్ఫూర్తినిస్తుంది. ముందుకు సాగే బలాన్నిస్తుంది. అందుకేనేమో, ఆచార్య డాక్టర్ ఎస్వీ సత్యనారాయణ తమ పిహెచ్‌డి కోసం 'తెలుగులో ఉద్యమ గీతాలు' అంశాన్ని ఎంచుకున్నారు. భారీ బాధ్యతను తలకెత్తుకున్నారు. దీనిని ఒక సాహసంగా పర్యవేక్షక వాక్యంలో ఆచార్య గోపీ అభివర్ణించారంటే, ఈ అంశం ఎంత విస్తృతమైనదో, రచయిత ఎంతగా శ్రమించాల్సి వచ్చిందో అర్థం చేసుకోవచ్చు. అందుకే, ఇది కేవలం ఒక పిహెచ్‌డి కోసం రాసిన పుస్తకంలా ఉండదు. అంతకంటే ఎక్కువగా ఇది ఉద్యమ చరిత్రను, నిర్మాణాలను కూడా వివరించే గ్రంథం. ఉద్యమ నిర్వచనంతోనే ఎస్వీ తాను ఎంచుకున్న అంశంపై ప్రస్థానాన్ని ప్రారంభించారు. అమెరికా నుంచి రష్యా వరకూ పలు ఉద్యమాలను అందులో ప్రస్తావించారు. ఒక లక్ష్యం కోసం ప్రారంభమైన ఉద్యమం, అది నెరవేరేవరకూ నిరంతరం జ్వలిస్తునే ఉంటుందని అంటారు. ఆయన మాటలు అక్షర సత్యాలు. దశాబ్దాల తరబడి కొనసాగిన తెలంగాణ ఉద్యమమే ఇందుకు తార్కాణం. ఆందోళనలు ఒక్కోసారి స్వార్థ చింతనగల నాయకుల చేతుల్లో పడి అర్ధాంతరంగా నిచిపోతాయని, అసంతృప్త జానాలను ఆకర్షించగలిగేవారు నాయకులైపోతారని నిక్కచ్చిగా చెప్తారు. రాజకీయ పరిజ్ఞానం, సమస్యల్ని విశ్లేషించే సామర్థ్యం, సరైన అనుభవం లేని వ్యక్తులు ఆందోళనల నుంచి ఉద్భవించి నాయకత్వ స్థాయికి చేరుకుంటారని, ఈ కారణంగానే ఒక్కోసారి వ్యక్తిగత లాభాలకు ఆందోళలను తాకట్టుపెట్టే పరిస్థితి కూడా వస్తుందని ధైర్యంగా ప్రకటిస్తారు. తెలంగాణ ఉద్యమంలో ఇలాంటి దుర్మార్గాలు చోటు చేసుకున్న వైనం మన స్మృతి పథంలో మెరుస్తుంది. కాగా, ప్రపంచ ఉద్యమాల నుంచి భారత జాతీయోద్యమం వైపు దృష్టిసారించడంతో రెండో అధ్యాయం మొదలవుతుంది. స్వాతంత్ర్య సమరంలోని కీలక ఘట్టాలను పేర్కోవడం ద్వారా, భారతీయుల్లో రగిలిన ఉద్యమ జ్వాలను వివరిస్తారు. జలియన్ వాలాబాగ్ ఉదంతం నుంచి క్విట్ ఇండియా వరకు... సహాయ నిరాకణ నుంచి మన్యం తిరుగుబాటు వరకు చోటు చేసుకున్న అనేకానేక ఘటనలను పేర్కొంటూ ముందుకు సాగుతారు. జాతీయోద్యమంగా ప్రారంభమై, స్వాతంత్ర్యోద్యమంగా రూపుదిద్దుకున్న ఒక మహాసంగ్రామంలో పాటలు పోషించిన పాత్రను, స్ఫూర్తి నింపిన వైనాన్ని వివరిస్తారు. ఇన్ని స్వాతంత్ర్యోద్యమ గీతాలను సేకరించడానికి ఆయన ఎంత శ్రమించారో! నాలుగో అధ్యాయంలో ఆంధ్రోద్యమాన్ని, ఐదో అధ్యాయంలో నాటి గీతాలను ఆయన వివరిస్తారు. కేవలం ఉద్యమ గీతాలకే పరిమితమైతే, ఈ రచనకు సంపూర్ణత చేకూరేది కాదు. సార్థకత ఉండేది కాదు. కానీ, జాతీయోద్యమం మాదిరిగానే ఆంధ్రోద్యమానికి దారితీసిన పరిస్థితులను పరిచయం చేస్తారు. తెలుగు వారు అప్పటి మద్రాసు రాష్ట్రం నుంచి ఎందుకు విడిపోవాలని కోరుకున్నారో విశ్లేషిస్తారు. ఐదో అధ్యాయంలో, ఆంధ్రోద్యమంలో ప్రతిధ్వనించిన ఎన్నో గీతాలను ఆయన అందిస్తారు. ప్రపంచాన్ని తిరిగి వచ్చి... దేశాన్ని పరామర్శించి... ఎస్వీ తెలంగాణ చేరుతారు. ఆరు, ఏడు, ఎనిమిది అధ్యాయాల్లో వరుసగా మలిదశ/తుదిదశ తెలంగాణ రాష్ట్రోద్యమ గీతాలు, తెలంగాణ సాయుధ పోరాటం, తెలంగాణ సాయుధ పోరాట గీతాలను విమర్శనాత్మకంగా వివరిస్తారు. స్వతఃగా రచయిత కావడం, పాటల పల్లకీలో ఊరేగడం ఇష్టం కాబట్టి, తెలంగాణ గీతాలను వివరించే సమయంలో విశ్వరూపాన్ని చూపిస్తారు. ఉద్యమ నేపథ్యాన్ని ప్రస్తావించి... ఉద్యమ కాంక్ష రగలడానికి కారణాలను వివరిస్తారు. దీనితో, ఆ ఉద్యమ తీవ్రత పాఠకులకు అర్థమవుతుంది. పాటల ప్రాధాన్యత తెలుస్తుంది. అవి పోషించిన పాత్ర అవగతమవుతుంది. ఈ పుస్తకంలో ఎస్వీ సేకరించిన గీతాలను ప్రస్తావిస్తూపోయినా, అది ఒక మహా గ్రంథమే అవుతుంది. ఎన్నో పాటలు... మరెన్నో నేపధ్యాలు.. ఇంకెన్నో భావోద్వేగాలు.. వెరసి ఆత్మగౌరవ త్యాగాలు.. వీటన్నిటినీ ఒక సమాహారంగా అందించిన ఎస్వీ ధన్యుడు. 'తెలుగులో ఉద్యమగీతాలు' పుస్తకం ఆషామాషీ రచన కాదు.... ఉద్యమాల చరిత్ర. వామపక్ష ఉద్యమాలు... దళిత ఉద్యమాలను కూడా చేర్చడంతో ఈ పుస్తకానికి సంపూర్ణత చేకూర్చుకొని, తప్పక చదవాల్సిన పుస్తకాల జాబితాలో చేరుతుంది.




**ఈ వారం కవితలు**

## అందెశ్రీకి అశ్రు నివాళి

అందుకో అందుకో అశ్రు నివాళి
అందుకో అందె శ్రీ అశ్రు నివాళి
కవుల గుంపు నుండి మాయమై పోతివా
నీ సోపతిగాళ్ళ ఏడిపించి పోతివా
తల్లడిల్లుతున్నది నీ తెలంగాణ తల్లి

సాహిత్య లోకాన్ని ఏలినవాడా
ఉద్యమ గీతాలను రాసినవాడా
పాటలతో ప్రశ్నిస్తూ సాగినవాడా
తిరుగుబాటు గొంతుకై మర్లబడ్డ వీరుడా
తెలంగాణ ప్రతి ఇంటా నీ గీతం ఉంటది
కవి రేడా అందె శ్రీ అందుకో అక్షర నివాళి

మూగబోయింది జయహే తెలం'గాణం'
నిన్నుగన్న నేలతల్లి నీ కోసం ఏడుస్తోంది
వేగుచుక్క నేలరాలి నింగికేగింది
ప్రగతి శీల ఉద్యమం కన్నీరు పెట్టింది

పల్లె పొలంలోని అన్ని పువ్వులు కలిసి
నీ జాడ కోసము వెతుకుతున్నవి సూడు

తెలంగాణ 'గీతకర్త 'ప్రజా కవి కలం యోధా
ఏటికో కోటికో ఒక్కడే అంటివి..
జనం పాటలు రాసి జనంలో ఉంటివి
తెలంగాణ గుండె చప్పుడే అంటివి
జగమెరిగిన అందె శ్రీ అందుకో జోహార్లు
తెలంగాణ ప్రజల ఆత్మ జోహార్లు

నువ్విచ్చిన నినాదం నీతోనే ఆగిపోదు
తెలంగాణ ఆత్మ ఘోష నిన్ను తలుచుకుంటది
చిరకాలం మదిలోన పాటపాడుకుంటది
నీ యాదిలో తెలంగాణ పోరుతిలకమైతది
పల్లె పల్లె జనంలోన ప్రతిధ్వనిస్తది

**– గడ్డమీది చంద్రమోహన్ గౌడ్**

## అక్షరాంజలి

నా భారత్ లో జ్ఞాన సముపార్జనకై
దక్కింది చదువు కొందరికే
ఆ జ్ఞానం రెండు దారులను చూపిస్తుంది
ఒకటి అంధకార విస్వాశాలవైపు
మరొకటి విజ్ఞానపు వెలుగు వైపు
అదే సమాజాన్ని మారుస్తుంది
ఏ దారిని ఎన్నుకుంటావో
నీ చైతన్య స్థాయి నిర్ణయిస్తుంది

చదువులేని అందెశ్రీ సమాజాన్ని గొప్పగా చదివాడు
కవిత్వం అంటే ఇది అని దారి చూపినోడు
మనిషన్నవాడు మాయమైపోతున్నడమ్మాని
ఖరా ఖండిగా చెప్పిన యోధుడతడు
నిప్పుల వాగులో నిప్పు కణికై నిలిచినోడు
జయ జయహే తెలంగాణంటూ
ఉద్యమ గొంతుకై నిలిచినోడు
సహజ కవి అందెశ్రీకి ఇదే నా అక్షరాంజలి

**– డా.మార్క శంకర్ నారాయణ**

## తగవులు

తరువుల పెనుగులాటలు
అరణ్యాన్ని దహించే నిప్పుకూ,
జనుల జగడాలు సంఘ శాంతిని
హరించే ముప్పుకూ
కారణాలుగా మారి
కారకులనూ కష్టపరచడం తథ్యం!

ద్వేషాల ఆవేశాలతో రగిలే రాజ్యాలు
యుద్ధాగ్నికి ఆజ్యాలుగా మారి
ఒకరినొకరు నష్టపరచడం యథార్థం!
రెండు పిట్టల పీకులాటలు పిల్లికీ,
రెండు దేశాల తగవు మరో దేశానికీ
మేలును కూర్చే ఘటనలు కావడం
వాస్తవం! కొన్ని పోరులు ఉన్నతికి
ఉచిత దారులు కావడం నిజం!
పట్టు వీడని ప్రయత్నాలకూ,
మనోబలాన్ని పరీక్షించే
పరాజయాలకూ మధ్యన
మాటి మాటికీ సాగే రణాలు
విజయానికి విలువైన కారణాలు!
అనేక సదాలోచనల
వాదులాటాల ఒరయిక వెంబడి
చక్కని నిర్ణయం వెల్లడి!
ఇది సూనృతం!

మతవాద వర్గాల కక్షలూ,
కులవాద కూటముల విద్వేషాలూ
సహనాన్ని కోల్పోయి సదా
ఘర్షించుకుంటూ
కలహాలకు కాల్దువ్వుతున్నట్లు
పాతాళంలోని నేల పలకలూ
నిగ్రహాన్ని కోల్పడి నిత్యం
జగడించుకుంటే క్షితి గతి అస్తవ్యస్తం!
ప్రాణి జగతి ధ్వస్తం!
ఇది తథ్యం!

**– వై. గోపీనాథ రావు**

## డిఫెన్సివ్ డ్రైవింగ్‌తో రోడ్డు ప్రమాదాల నివారణ: ఎస్ఐ



**ప్రజాపక్షవ/ఖానాపూర్:**రోడ్డు ప్రమాదాలను తగ్గించడంలో డిఫెన్సివ్ డ్రైవింగ్ అత్యంత సహాయపడుతుందని ఖానాపూర్ పట్టణంలోని బస్టాండ్ సమీపంలో ప్రైవేట్ వాహనదారులు, ఆటో,టాటా ఏస్,వాహనదారులకు ఎస్సై రా హుల్ గైక్వాడ్ రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.వాహనదారులు వాహనాలను నడిపేటప్పుడు రోడ్డుపై అప్రమత్తంగా ఉండటం,పరిసరాలను గమనించడం,ఇతర వాహనదారుల తప్పిదాలను ముందుగా అంచ నా వేయడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని ఎస్సై వివరించారు.ప్రమాదాల తగ్గింపులో డిఫెన్సివ్ డ్రైవింగ్ అత్యంత కీలమని అన్నారు.

## నిజాంసాగర్ నుండి దిగువకు 2498 క్యూసెక్కుల నీరు

**ప్రజాపక్షం/నిజాంసాగర్:**నిజాంసాగర్ ప్రాజెక్టు నుండి మాంజీరాకు నీటి విడుదల కొనసాగుతుందని ప్రాజెక్టు అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎగువ ప్రాంతం నుండి ప్రాజెక్టులోకి 2498 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లోగా వస్తుండగా ప్రాజెక్టు 5వ నెంబర్ గేటు ఎత్తి 2498 క్యూసెక్కుల వరదనీటిని మాంజీరాకు వదులుతున్నట్లు చెప్పారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1405.00 అడుగులు, పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 17.802 టీఎంసీలకు గాను అదే మోతాదులో పూర్తిస్థాయిలో నీటిని నిల్వ ఉంచుతున్నట్లు అధికారులు వెళ్ళడించారు.



## అంతర్రాష్ట్ర ట్రాన్స్‌ఫార్మర్ దోపిడీ ముఠా అరెస్ట్



**ప్రజాపక్షం/నిజామాబాద్:**ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలకు పాల్పడుతున్న అంతరాష్ట్ర దొంగలను పట్టుకున్నట్లు సిపి సాయిచైతన్య తెలిపారు. సిపి కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు.

## బిసి జెఎసి ఆధ్వర్యంలో బిసిల న్యాయసాధన దీక్ష




**ప్రజాపక్షం/పిట్లం:** తెలంగాణ రాష్ట్ర బిసి జెఎసి పిలుపు మేరకు కామారెడ్డి జిల్లాకేంద్రంలో బిసిల న్యాయసాధన దీక్ష కామారెడ్డిలోని నిజాంసాగర్ చౌరస్తాలో కానిస్టేబుల్ కిష్టయ్య విగ్రహ ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బిసిజెఎసి ప్రతినిదులు మాట్లాడుతూ బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు న్యాయబద్ధమైనవి, బిసిలకు జనాభా ప్రతిపదికన 60 శాతం రిజర్వేషన్లు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అయినప్పటికి గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 42 శాతానికి కట్టుబడి బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కామారెడ్డి బిసిడిక్లరేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేని యెడల రానున్న కాలంలో పెద్ద ఎత్తున ఆందోళణ కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు. కాగా ఈ శిబిరాన్ని తెలంగాణ బిసిలెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాముని సుదర్శన్ తమ సంఘీభావం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా బిసి జెఎసి నాయకులు చింతల శంకర్‌నేత, పాప శివరాములు, నీల నాగరాజు, మల్లన్న, సూర్య మల్లేష్, చాకలి రాజయ్య, తుమ్మ మచ్చేంధర్, సోషల్ మీడియా ఇంచార్జ్జీ రాజేంధర్, రాజీవ్, శ్రావణ్‌కుమార్‌గౌడ్, మంజుల, లలిత, మహేష్, అఫ్రోజ్, తదితరులు పాల్గొన్నారు.

## చలికి గజగజ వణుకుతున్న ప్రజలు



**ప్రజాపక్షం/మోర్తాడ్:**రోజురోజుకు గ్రామాలలో చలి తీవ్రత కలుగుతున్నందు వలన ప్రజలు అక్కడక్కడ చలికి గజగజ వణుకుతూ చలిమంటలు కాగుతున్నాయి. మోర్తాడ్ మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాలలో ఆదివారం ఉదయం పూట ప్రజలు అక్కడక్కడ చలిమంటలు కాగుతున్నారు. గ్రామాలలో ప్రజలను చలి వణికిస్తుంది. సాయంత్రం ఐదు గంటల నుంచి చల్లటి గాలులు వీస్తున్నాయి. ఉదయం పూట దాదాపు 8గంటల నుంచి 9గంటలు దాటే వరకు చలి వదలడం లేదని స్థానిక ప్రజలు తెలిపారు. గ్రామాలలో చలి తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఉదయం పొలం పనులకు వెళ్లే రైతులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. మండలంలోని ఆయా గ్రామాలలో చలి తీవ్రత పెరగడంతో ప్రజలు ఎవరూ ఇండ్ల నుంచి తొందరగా బయటకు రావడం లేదని పొలం పనులకు వెళ్లే రైతులు కూడా ఆలస్యంగా వెళ్తున్నారని స్థానిక ప్రజలు తెలిపారు. ఇకపోతే మోర్తాడ్ మండల కేంద్రంలో గ్రామం నుంచి బస్టాండ్ వరకు ఉదయం పూట వెళ్లి ఆటోలు ఆలస్యంగా వెళ్లడంతో కామారెడ్డి, కరీంనగర్, హైదరాబాద్ వంటి దూర ప్రాంతాలకు వెళ్లే ప్రజలకు ఇబ్బంది కలుగుతుందని దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు తెలిపారు.

## పాత్రికేయులకు ఘన సన్మానం



**ప్రజాపక్షం/ఎడపల్లి:**తెలంగాణ లోకల్ ఫోర్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు డల్లా సురేష్ మహాజన్ ఆధ్వర్యంలో ఎడపల్లి మండల కేంద్రంలో జాతీయ పత్రిక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అందుబాటులో ఉన్న పాత్రికేయ మిత్రులను శాలువాలు కప్పి, పూలమాలలతో సన్మానించారు. అనంతరం స్వీట్లను పంచుకొని జాతీయ పత్రిక దినోత్సవ శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ సందర్భంగా టిఎల్ఎఫ్ ఫౌండర్ డల్లా సురేష్ మహాజన్ మాట్లాడుతూ.. దేశ ప్రెస్ కమీషన్ సిఫార్సు మేరకు 1966 నవంబర్ 16న ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాను ఏర్పాటు చేశారని, నాటి నుంచి ప్రతి సంవత్సరం నవంబర్ 16న జాతీయ పత్రిక దిరనోత్సవాన్ని జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందని తెలిపారు. పత్రిక మిత్రులు అందిస్తున్న సేవలను కొనియాడుతూ.. పాత్రికేయుల సేవలు మరువలేనివని ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారిధిగా నిలుస్తూ, సామాజిక, ఆర్థిక, రాజకీయ సమాచారాన్ని నిరంతరం అందిస్తున్నారన్నారు. అంకిత భావంతో పాత్రికేయులు చేస్తున్న కృషి అభినందనీయమని వారి సేవలను గుర్తించి, వారిని సన్మానించుకోవడం మనందరి సామాజిక బాధ్యత అని డల్లా సురేష్ మహాజన్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టి.ఎల్.ఎఫ్ అధ్యక్షుడు డల్లా సురేష్ మహాజన్‌తో పాటు స్థానిక విలేకరులను సన్మానించడంలో అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు మెతరి గంగాధర్, మండల కిసాన్ కేత్ అధ్యక్షుడు శివరామ్ ప్రసాద్, తాజా మాజీ వార్డు సభ్యులు పురం శేఖర్, అబ్బారెడ్డి, గ్రామ యువ నాయకుడు మయూర్, కాంగ్రెస్ నాయకులు హబీబ్, కాశిగోళ్ల గంగాధర్, అజయ్, బుడిది లచ్చరాం తదితరులు పాల్గొన్నారు.

# సైన్స్, ఇన్‌స్పైర్ ఎగ్జిబిషన్లకు సన్నాహాలు

### బోధన్‌లో 23నుంచి జిల్లా స్థాయి ప్రదర్శనలు

### అన్ని యాజమాన్య పాఠశాలలు పాల్గొనాలని డిఇఒ పిలుపు




**ప్రజాపక్షం/ఎడపల్లి:**నిజామాబాద్ జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈ సంవత్సరం ప్రతిష్టాత్మకమైన జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్, ఇన్‌స్పైర్ ప్రదర్శనలను సం యుక్తంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. నవంబర్ 23, 24, 25వ తేదిలలో ని జామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలోని విజయమేరీ ఉ న్నత పాఠశాల ఈ ఉమ్మడి ప్రదర్శనకు వేదిక కానుంది.

జిల్లా విద్యాశాఖ అధికారి పి.అశోక్ ఈ మేరకు ఉమ్మడి జిల్లాలోని అన్ని యాజమాన్యాలకు చెందిన ప్రాథమికొన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, గైడ్ టీచర్లకు వివరాలను తెలియచేశారు. ఇందులో భాగంగా జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ యొక్క ప్రధాన థీమ్ అభివృద్ధి చెందిన స్వయం సమృద్ధి భారత దేశం కొరకు శాస్త్ర సాంకేతిక రంగాలైన సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, గణితం, అలాగే విద్యార్థులు తమ ప్రాజెక్టులను ఏడు ముఖ్య ఉప అంశాల క్రింద ప్రదర్శించవచ్చని అందులో సుస్థిర వ్యవసాయం, వ్యర్థ ప్రదార్థాల నిర్వహణ మరియు ప్రత్యామ్నాయ మొక్కలు, హరిత శక్తి (పునరుత్పాదక శక్తి) అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు, వినోద భరితమైన గణిత నమూనాలు, ఆరోగ్యం మరియు పరిశుభ్రత, నీటి సంరక్షణ మరియు నిర్వహణ వంటి అంశాలపై ప్రదర్శనలు ఉండనున్నాయి. అయితే ప్రతి పాఠశాల నుంచి గరిష్టంగా ఐదు ప్రాజెక్టులు మాత్రమే పాల్గొనడానికి అనుమతి ఉందని, ప్రతి పాఠశాల నుంచి ఒక గైడ్ టీచర్ మాత్రమే పాల్గొనాలనే నిబంధనలు ఉన్నాయి. విద్యార్థులు జూనియర్ 6,7,8 తరగతులు మరియు 9, 10, 11, 12 తరగతులు విభాగాలలో పాల్గొనవచ్చు.

**ఇన్‌స్పైర్ ప్రదర్శనకు 119 ప్రాజెక్టులు ఎంపిక...**

సైన్స్ ఎగ్జిబిషన్‌తో పాటు, జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ ప్రదర్శన కూడా ఇదే సమయంలో నిర్వహించబడుతుంది. ఈ ప్రదర్శన కోసం ఇప్పటికే 119ప్రాజెక్టులు జిల్లా స్థాయికి ఎంపికయ్యాయి. ఎంపికైన విద్యార్థులకు ప్రదర్శన ఖర్చుల నిమిత్తం వారి సొంత బ్యాంకు ఖాతాలలో రూ. 10వేల జమ చేయబడినట్లు డిఇఒ తెలిపారు. ఎంపికైన 119ప్రాజెక్టులు తప్పనిసరిగా ఈ ప్రదర్శనలో పాల్గొనేలా సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, గైడ్ టీచర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులు సూచించారు. ప్రతి ఇన్‌స్పైర్ ప్రదర్శనకు ఒక విద్యార్థి మరియు ఒక గైడ్ టీచర్ పాల్గొనవలెనని తెలిపారు.

**అదనపు ప్రదర్శనలు, సెమినార్ నిర్వహించేందుకు అవకాశం**

ఉపాధ్యాయులు కూడా నూతన ఆవిష్కరణలతో కూడిన బోధనా అభ్యాసనా సామాగ్రిని ప్రదర్శించడానికి అవకాశం కల్పించబడిందని, బిఎడ్‌తో పాటు డిఎడ్ ట్రైనీ విద్యార్థులు సైతం నూతన బోధనా అభ్యాసనా సామాగ్రిని ప్రదర్శించవచ్చని అధికారులు తెలిపారు.

**ప్రత్యేక సెమినార్ నిర్వహణ...**

ప్రాజెక్టుల ప్రదర్శనలో భాగంగా రెండవ రోజు సాయంత్రం ప్లాస్టిక్ కాలుష్యాన్ని తగ్గించడం అనే అంశంపై విద్యార్థుల కోసం ప్రత్యేక సెమినార్ నిర్వహించ బడుతుందని, జిల్లా స్థాయి ఈ ప్రతిష్టాత్మక ప్రదర్శనలను విజయవంతం చేయడానికి అన్ని యాజమాన్య పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సంసిద్ధం కావాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.అశోక్ పిలుపునిచ్చారు.

## బస్ స్టాండ్ కోసం 20 గుంటల భూమి దానం

### 35 సంవత్సరాల నుండి బస్టాండ్ మంజూరు చేయలేదు?

### బస్టాండ్ కట్టించండి లేదా నా భూమి నేను వాపస్ తీసుకుంటాను?

**ప్రజాపక్షం/నిజాంపేట్:**గ్రామ ప్రజల కోరిక మేరకు ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని నిజాంపేట నుండి ఇతర గ్రామాలకు వెళ్లాలంటే బస్టాండ్ లేక ఎంతో ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని బస్టాండ్ ఆర్టీసీ అధికారులు కట్టించినట్లయితే ప్రయాణికుల ఇబ్బందులు దూరమవుతాయని చదువుకునే విద్యార్థులకు కూడా ఎంతో సులభంగా ఉంటుందనే దృష్టితోనే మెదక్ జిల్లా ఆర్టిసి అధికారులకు 20 గుంటల భూమిని రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వడం జరిగిందని మండల కేంద్రానికి చెందిన చిన్నపైడి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ నిజాంపేట గ్రామస్తులకు రోడ్డుమీద నిలవడానికి నీడ లేక వర్షంలో తడుస్తూ ఎండలో నిలబడుతూ ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనే దృష్టితో ఆర్టీసీ అధికారులకు నా యొక్క సొంత పట్టా భూమిని ఆర్టీసీ అధికారులకు రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వడం జరిగిందని ఇప్పటివరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము కాని అధికారులు కానీ నిజాంపేట గ్రామంలో బస్టాండ్ కట్టించలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు 35 సంవత్సరాల నుండి 20 గుంటల భూమి ఆర్టీసీ అధికారుల పేరు మీదనే ఉన్నదని 6 నెలల క్రితం బస్టాండ్ స్థలం చుట్టూ ప్రహరీ గోడ ఆర్టీసీ అధికారులు కట్టించడం జరిగిందని ఇప్పటివరకు బస్టాండ్ ఊసే ఎత్తడం లేదని పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత గత ప్రభుత్వము 10 సంవత్సరాలు కాలయాపన చేసింది కానీ ఎలాంటి చర్యలు చేపట్టలేదు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి దాదాపు రెండు సంవత్సరాలు అవుతున్నందున ఈ ప్రభుత్వంలోనైనా మండల కేంద్రంలో బస్టాండు మంజూరు చేసి కట్టించాలని లేనియెడల అట్టి స్థలాన్ని నేను తిరిగి స్వాధీనం చేసుకుంటానని అన్నారు.



## కొనుగోలు చేసిన ధాన్యానికి వేగంగా చెల్లింపులు

### అక్రమాలకు తావు లేదు

### మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**ప్రజాపక్షం/మెదక్ :**అక్రమాలకు తావు లేకుండా,కొనుగోలు చేసిన ధాన్యానికి చెల్లింపులు వేగంగా జరగాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. జిల్లా పరిధిలోని శంకరంపేట్ (ఆర్) మండలంలోని అంబాజీపేట గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కొనుగోలు చేసిన ధాన్యానికి చెల్లింపులు వేగంగా జరగాలన్నారు. గత సంవత్సరం ఇదే నెలలో 11,865 మంది రైతుల నుంచి 68,669.640 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి 4.71 కోట్ల రూపాయలను చెల్లించగా... ప్రస్తుత సీజన్ కి... ఇప్పటివరకు 27,993 మంది రైతుల నుండి 1,19,461.560 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి 102.84 కోట్ల చెల్లింపులు జరిగాయన్నారు.రైతులకు ప్రభుత్వం మద్దతు ధర కింద ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతోందని, తేమ శాతం నిర్దేశిత ప్రమాణాలకు లోబడి ఉండేలా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే ధాన్యం తూకాలు సక్రమంగా జరుగుతున్నాయా, గోదాముల్లో నిల్వలు గన్ని బ్యాగ్ లు పూర్తిగా ఉన్నాయన్నారు. అధికారులు రైతులకు సకాలంలో చెల్లింపులు జరగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.

## మెదక్ పట్టణ అభివృద్ధికి రూ.50 కోట్లు

**ప్రజాపక్షం/మెదక్:**మెదక్ జిల్లా కేంద్రం పట్టణ అభివృద్ధి కొరకు గతంలో ఎన్నడు లేనివిధంగా దాదాపు 50 కోట్ల రూపాయల అభివృద్ధి పనుల కు నిధులు మంజూరు కృషి చేసిన మెదక్ ఎ మ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావుకు పట్టణ ప్రజల తరపున కాంగ్రెస్ పార్టీ తరపున ధన్యవాదాలు తె లియడం జరుగుతుందని మాజీ మార్కెట్ క మిటీ చైర్మన్ మేడి మధుసూదన్ రావు తెలిపారు.ఆదివా రం జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నేతలు బొ ద్దుల కృష్ణ, దుర్గ ప్రసాద్, సలీం, గంట రాజుతో కలిసి మధుసూదన్ రావు విలేకరుల సమావేశ ంలో మాట్లాడారు. మెదక్ జిల్లా కేంద్రానికి టు యూఎఫ్ఐడిసి గ్రాంట్ ద్వారా 30.29 కోట్ల రూ పాయలు యుడిఐ ఎఫ్ గ్రాంట్ ద్వారా 18.70 కోట్ల రూపాయలు కేటాయించడం ద్వారా మెదక్ పట్టణ అభివృద్ధికి దోహదం జరుగుతుందన్నారు. ప్రతి స ందర్భంలో సిద్దిపేట ఒకటి మాత్రమే అ భివృద్ధి పథంలో జరిగిందని, ఒక వెనుకబడ్డ మెదక్ ప్రాంతానికి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు చేస్తున్న నిరంతర అభివృద్ధికి పట్టణ ప్రజలమందరం బాసటగా ఉంటామని తెలియజేశారు.



## కోల్పోయిన రూ.20,96,406లను తిరిగి సైబర్ బాధితులకు అందజేత

**ప్రజాపక్షం/నిజామాబాద్:**స్పెషల్ లోక్ అదాలత్‌లో భాగంగా వివిధ కేసులలో రాజీ పడి 4898 కేసులు పరిష్కారమైనందునకు గాను విజయవంతం చేసిన అధికారులను సిబ్బందిని సీపీ సాయిచైతన్య అభినందించారు. గతనెల రోజుల నుండి 15 వరకు జరిగిన స్పెషల్ లోక్ అదాలత్‌లో భాగంగా జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్‌స్టేషన్లలో నమోదైన రాజీ పడటానికి అవకాశం ఉన్న చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న ఐపీసీ బిఎన్ఎస్ 372 కేసులు, సైబర్ క్రైమ 111 ఇ పెట్టి 2064, డిడి అండ్ ఎంవి యాక్ట్ 2351, మొత్తం 4898 కేసులలో ఇరువర్గాలను రాజీ కుదర్చటం జరిగిందన్రాను. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ స్పెషల్ లోక్ అదాలత్‌తో భాగంగా జిల్లాకు సైబర్ క్రైమ్ వివిధ కేసులలో రాజీ మార్గం చేసినందుకు సైబర్ క్రైమ్ సిబ్బంది కోర్టు సిబ్బందిని ప్రత్యేకంగా అభినందిస్తున్నామన్నారు. క్షణికావేశంలో చేసే తప్పులు సరిదిద్దుకోవడానికి లోక్ అదాలత్ అనేది ఒక మంచి అవకాశమని, అనవసర గొడవలకు పోయి జీవితాలను ఇబ్బందుల పాలు చేసుకోకూడదన్నారు. రాజీ మార్గమే రాజా మార్గమని రాజీ కుదుర్చుకోవడానికి అవకాశమున్న అన్ని కేసులలో ఇరువర్గాలు రాజీ పడవచ్చన్నారు. ముఖ్యంగా సైబర్ బాధితులకు సత్వర న్యాయం చేయాలని, టిఎస్‌సిఎస్‌బి డైరెక్టర్ శిఖాగోయల్ ఆధ్వర్యంలో 7 కమీషనరేట్ పరిధిలో సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్లు, ప్రతి జిల్లాలో డి4సి ని ఏర్పాటు చేసి జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో నమోదైన సైబర్ నేరాలలో ఈ స్పెషల్ లోక్ అదాలత్‌లో 111 సైబర్ క్రైమ్ కేసులలో రూ.2 0,96,406 తిరిగి సైబర్ బాధితులకు ఇప్పించేందుకు ఆర్డర్ కాపీలను సంబంధిత బ్యాంకు నోడల్ అధికారులకు పంపించామన్నారు. జిల్లా ప్రజలెవరైనా సైబర్ మోసాలకు గురైనట్లయితే వెంటనే 1930కి కాల్ చేసి గాని వెబ్ పోర్టల్ నదు లాగిన్ అయి దరఖాస్తు చేయవచ్చన్నారు. ఈ సందర్భంగా స్పెషల్ లోక్ అదాలత్‌ను విజయవంతం చేసిన అధికారులు సైబర్ క్రైమ్ ఎసిపి వెంకటేశ్వర్ రావు, సిఐ ముఖిద్‌పాషా, అంజయ్య, సిబ్బందిని అభినందించారు.

## అంతారం గ్రామంలో శ్రీజీవన్ ముక్త మహారాజ్ ఉత్సవాలు

### ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్ర పాండు రంగ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు

### రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ





**ప్రజాపక్షం/మునిపల్లి :**మునిపల్లి మండలం అంతారం గ్రామంలోని శ్రీ జీవన్ ముక్త మహారా జ్ ఉత్సవాల సందర్భంగా ప్రముఖ ఆద్యాత్మిక క్షే త్రం శ్రీ పాంగు రంగ స్వామి దేవాలయం లో రా ష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈకార్యక్రమంలో పీఠాధిపతి శ్రీ జ్ఞానేశ్వర (బాలరాజు) మహారాజ్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మేన్ అంజయ్య మార్కెట్ కమిటీ చైర్మేన్ సుధాకర్ రెడ్డి ,మాజీ ఎంపిపి రాంరెడ్డి, అంతారం నర్సింహా గౌడ్, సతీష్, కంబంపల్లి సంగమేశ్వర్ పాండు, మహిపాల్‌రెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు ఇతర నాయకులు యువజన నాయకులు పాల్గొన్నారు.

**మంత్రి దామోదర్ రాజనర్సింహను కలిసిన జిల్లా వైద్యాధికారి డా. వసంతరావు**

**సంగారెడ్డి :** రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను సంగారెడ్డి జిల్లా వైద్యాధికారిగా నూతనంగా భాద్యతలు సీకరిని సందర్భంగా డాక్టర్ వసంత రావు మర్యాద పూర్వకంగా కలిశారు.

## కెజిబివి విద్యార్థినులతో 24 గంటలు ...

### భద్రత,భవిష్యత్తుపై ప్రత్యేక అవగాహన..

### సమస్యలు దగ్గరుండి తెలుసుకున్న పోలీసులు..







**ప్రజాపక్షం/నిర్మల్‌టౌన్:**నిర్మల్ జిల్లా ఎస్‌పిడా .జి.జానకి షర్మిల వినూత్న ఆలోచనల మేరకు రూపొందించిన పోలీస్ అక్క'' కార్యక్రమంలో భాగంగా,జిల్లాలోని అన్ని పోలీస్ అక్క టీమ్‌లు శనివారం రాత్రి తమతమ స్టేషన్ల పరిధిలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల (కెజిబివి ) పాఠశాలల్లో విద్యార్థినులతో కలిసి 24 గంటలు గడిపాయి.ఈ కార్యక్రమం ద్వారా భద్రత,భవిష్యత్తు విషయంలో విద్యార్థినులకు తోడుగా నిలవాలని నిర్మల్ పోలీసులు సంకల్పించారు.ఈ ప్రత్యేక కార్యాచరణలో భాగంగా,మహిళా పోలీసులు విద్యార్థినులతో కలిసి భోజనం చేసి,రాత్రి స్కూల్లోనే బస చేశారు.వారు పిల్లలతో స్నేహపూర్వకంగా మమేకమై మహిళల భద్రత,చట్టాలపై సమగ్ర అవగాహన కల్పించారు .ముఖ్యంగా,సైబర్ నేరాల గురించి హెచ్చరి స్తూ,గుడ్ టచ్‌బ్యాడ్ టచ్ గురించి వివరించారు.చదువు పట్ల ఆసక్తి,ఆత్మవిశ్వాసం పెంపొందించేలా వారికి ప్రేరణ (మోటివేషన్) ఇచ్చారు.పోలీస్ అక్కలు విద్యార్థినుల సమస్యలు,భవిష్యత్తు ఆశయాల గురించి,క్లుప్తంగా అడిగి తెలుసుకున్నారు.చిరునవ్వులు పంచుకుంటూ,వారితో సమయం గడపడం ద్వారా మానవత్వాన్ని చాటారు.అంతేకాకుండా,ఉదయం విద్యార్థినులతో కలిసి యోగా,ఫిజికల్ ఎక్సర్సైజ్ సెషన్లను నిర్వహించి, ఆరోగ్యపరమైన అంశాలపైనా దృష్టి సారించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పిడా.జి.జానకి షర్మిల ఐపీఎస్ మాట్లాడుతూ,విద్యార్థుల హృదయాల్లో భద్రతా భావనను బలపరిచే లక్ష్యంతోనే పోలీస్ అక్క కార్యక్రమాన్ని ప్రారంభించాం.చిన్నారులతో నేరుగా సమయం గడిపే ఈ కార్యాచరణ ద్వారా,వారు ఎదుర్కొంటున్న సమస్యలను దగ్గరుండి తెలుసుకునే అవకాశం కలుగుతుంది.దీని ఫలితంగా విద్యార్థులలో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది.అలాగే వారిలో ఉండే భయభ్రాంతులు,అభద్రతా భావం క్రమంగా తొలగిపోతాయి'' అని పేర్కొన్నారు.

## ఉచిత వైద్య శిబిరం


ప్రజాపక్షం/గొల్లపల్లి : గ్రామీణ ప్రాంతాల పేదల ఆరోగ్యం కోసమే ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు డాక్టర్ బంగారి స్వామి అన్నారు .జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని శ్రీరాములపల్లి గ్రామంలోని గ్రామపంచాయతీ ఆవరణలో ఆదివారం రెనె హాస్పిటల్ కరీంనగర్ వారి సహకారంతో సామాజిక స్వచ్ఛంద సేవా సభ్యులు పొన్నం రాజలింగం గౌడ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు .ఈ వైద్య శిబిరంలో ఆసుపత్రి వైద్యులు బంగారి స్వామి గ్రామస్తులకు అన్ని రకాల అనారోగ్య సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహించినారు.అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు .అదేవిధంగా రోగులకు సలహాలు సూచనలు అందజేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మాజీ సర్పంచ్ శనిగరం మల్లేశం ,మాజీ ఎంపీటీసీ లంబ లక్ష్మణ్ ,కిష్టంపేట రమేష్ రెడ్డి ,నల్ల నరసింహారెడ్డి ,రామ్ రెడ్డి ,అంజయ్య గౌడ్ ,రేవెల్ల సూర్య ,శోభన్ , గుండేటి రాజిరెడ్డి ,వడ్లకొండ బుచ్చన్న, గుండమహేష్ ,హాస్పిటల్ వైద్యులు ,సిబ్బంది,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవు

### జగిత్యాల రూరల్ ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన ఉమాసాగర్

ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ : జగిత్యాల రూరల్ నూతన ఎస్ఐగా ఉమాసాగర్ ఆదివారం బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఉమాసాగర్ మాట్లాడుతూ జగిత్యాల రూరల్ పరిధిలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జగిత్యాల రూరల్ పరిధిలోని గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎవరైనా అనుమానితులుగా కనబడితే వెంటనే జగిత్యాల రూరల్ పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ఐ అన్నారు. గ్రామాల ప్రజలు కుటుంబసభ్యులు అందరు కలిసి ఎటైనా వెళితే చుట్టూ పొరుగు వారికి సమాచారం ఇచ్చి వెళ్లాలని జగిత్యాల రూరల్ ఎస్ఐ ఉమాసాగర్ ప్రజలకు సూచించారు.

## రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు సర్వం సిద్ధం



ప్రజాపక్షం/రామగిరి : రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్టు పెద్దపల్లి జిల్లా ఎస్‌జిఎఫ్ కార్యదర్శి కనుకుంట్ల లక్ష్మణ్ తెలిపారు. పెద్దపల్లి జిల్లా రామగిరి మండలంలోని రాణి రుద్రమదేవి స్టేడియంలో ఉన్న సింగరేణి స్విమ్మింగ్ పూల్‌లో 69వ ఎస్‌జిఎఫ్ అండర్14 బాలబాలికల రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలు ఈ నెల 17 నుంచి 19 వరకు నిర్వహించనున్నట్లు పెద్దపల్లి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కనుకుంట్ల లక్ష్మణ్ తెలిపారు.ఈ రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఉమ్మడి తెలంగాణలోని పది జిల్లాల నుంచి సుమారు 520 మంది క్రీడాకారులు హాజరవనున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను తెలంగాణ జట్టుకు ఎంపిక చేసి, వచ్చే నెల న్యూఢిల్లీలో జరగనున్న జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీలకు పంపనున్నట్లు వివరించారు. తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఈ పోటీలను అధికారికంగా ప్రారంభించనున్నారు.రాష్ట్రం నలుమూలల నుంచి విచ్చేసే స్విమ్మింగ్ క్రీడాకారుల కోసం అన్ని అవసరమైన వసతులు సిద్ధం చేశామని నిర్వాహకులు తెలిపారు.

## రెండు మోటార్ సైకిళ్లు ఢీ



ప్రజాపక్షం/శంకరపట్నం: మండలంలోని తాడికల్ గ్రామంలో ఆదివారం రోడ్డు క్రాస్ చేస్తున్న సమయంలో రెండు బైకులు ఢీకొట్టిన సంఘటన జరిగింది. వివరాల్లోకి వెళితే శంకరపట్నం మండలం ఆముదాలపల్లి గ్రామానికి చెందిన కందుల రాజు(26) తిమ్మాపూర్‌లో పెళ్లికి వెళ్లి తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో తాడికల్ బస్టాండ్ వద్ద అన్వర్ బాష(53) రోడ్డు క్రాస్ చేస్తుండగా రెండు బైకులు ఢీకొన్నాయి. రాజుకు ఎడమ కాలు విరిగింది. అన్వర్‌పాషాకు గాయలయ్యాయి. అది చూసిన స్థానికులు 108కు ఫోన్ చేయడంతో సిబ్బంది గూ దూరు సతీష్‌రెడ్డి హుటాహుటిన సంఘటన స్థలాన్ని చేరుకుని క్షతగాత్రుల్ని హుజురాబాద్ ఆసుపత్రికి తరలించారు.

## జగిత్యాల సర్కిల్ విద్యుత్ కార్యాలయంలో మందు పార్టీ

### మద్యం సేవించిన ముగ్గురు విద్యుత్ ఉద్యోగుల సస్పెండ్



ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ : జగిత్యాల సర్కిల్ టౌన్ 1 సెక్షన్ కార్యాలయం స్టాఫ్ రూమ్ లో శనివారం రాత్రి ముగ్గురు అసిస్టెంట్ లైన్ మెన్లు ఏ. ప్రభాకర్, జి. బాలకృష్ణ, వి. రాజశేఖర్ మందు పార్టీ చేసుకునట్లు ప్రాధమిక విచారణలో నిర్ధారణ అయినందున వెంటనే ఆ ముగ్గురు అసిస్టెంట్ లైన్ మెన్లను సస్పెండ్ చేయడం జరిగిందని జగిత్యాల డివిజినల్ ఇంజనీర్ గంగారాం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పై విషయంపై సంస్థ సీఎండీ శ్రీ కర్నాటి వరుణ్ రెడ్డి తీవ్రంగా స్పందిస్తూ ఎన్.పి.డీ.సీ.ఎల్ పరిధిలోని 17 సర్కిళ్లలోని అన్ని సబ్‌స్టేషన్‌లు, విద్యుత్ సంస్థ కార్యాలయాలు లేదా సంస్థ ప్రాంగణంలో విధులు నిర్వహించే ప్రదేశలలో అనైతిక కార్యకలాపాలు, క్రమశిక్షణా చర్యలకు విరుద్ధంగా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎటువంటి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని ఉద్యోగస్తులకు, సిబ్బందికి హెచ్చరిస్తున్నామని సీఎండీ శ్రీ కర్నాటి వరుణ్ రెడ్డి తెలిపారు. ఒక వేళా విధులకు సంబంధించి ఏవైనా ఉద్యోగి ప్రవర్తనా నియమాలను ఉల్లంఘించి అనైతిక చర్యలకు పాల్పడిన పక్షంలో విధుల నుండి తక్షణమే తొలగిస్తామని గట్టిగా హెచ్చరించారు. ఇందుకు సంబంధించి హెచ్‌ఆర్డి విభాగం నుండి అడ్వైజరీ మెమోను జారీచేసినట్లు ఆయన తెలియజేశారు. విద్యుత్ అధికారులు అందరు విధుల పట్ల అత్యంత బాధ్యతతో వ్యవహరించి, సంస్థ ప్రతిష్టను కాపాడాలని వినియోగదారులకు మెరుగైన నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడంలోభాగస్వామ్యులు కావాలనిసంస్థసీఎండీ శ్రీకర్నాటివరుణ్‌రెడ్డి కోరారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు

### జిల్లా ఎస్‌పి అశోక్‌కుమార్

ప్రజాపక్షం/జగిత్యాలటౌన్: మత్తులో వాహనం నడపడం చట్ట విరుద్ధమే కాకుండా సమాజానికి తీవ్ర ముప్పని డ్రంక్ అండ్ డ్రైవ్‌పై జీరో టాలరెన్స్ విధానంతో కఠినం అయిన చర్యలు కొనసాగుతాయని, ఎవరైన నిబంధనలు ఉల్లంఘిస్తే తప్పకుండా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గడిచిన 10 నెలల్లో జిల్లా వ్యాప్తంగా 8686డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేయడం జరిగిందని అని మద్యం సేవించి వాహనం నడిపి ప్రమాదాలకు కారణమైన వారిపై 304 2 ఐఐపిసి సెక్షన్ కింద కేసులు బుక్ చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తు పట్టుబడిన వ్యక్తుల డ్రైవింగ్ లైసెన్స్ రద్దుకు సిఫారసు చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో రోడ్డు ప్రమాద నివారణ చర్యల్లో భాగంగా డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిరంతరం నిర్వహించడం జరుగుతుందని అన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వారిని వారి కుటుంబసభ్యుల సమక్షంలో కౌన్సిలింగ్ నిర్వహిస్తు ప్రజలలో అవగాహన కల్పిస్తున్నామన్నారు.

# రాజీలేని పోరాటాల చరిత్ర సిపిఐదే

### సిపిఐ రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి



ప్రజాపక్షం/ధర్మపురి : భారతదేశానికి స్వాతంత్ర్యం కావాలని తొలుత గర్జించింది భారత కమ్యూనిస్టు పార్టీ అని,అనాటినుండి నేటి వరకు రాజీలేని పోరాటాలు,మరెన్నో త్యాగాలు, అమరుల రక్తతర్పణతో ఎన్నో విజయాలు సాధించిన చరిత్ర సీపీఐది అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎమ్మెల్యే చాడ వెంకట్ రెడ్డి అన్నారు. సిపిఐ పార్టీ వందేళ్ల ముగింపు ఉత్సవాలలో భాగంగా డిసెంబర్ 26న చలో ఖమ్మం బహిరంగ సభ సందర్భంగా జోడేఘాట్ లో ప్రారంభమైన ప్రచార జాత ఆదివారం జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణానికి చేరుకుంది. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకులు,మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. భారత గడ్డపై సీపీఐ పార్టీ అడుగుపెట్టి శతాబ్దకాలం పూర్తి చేసుకున్న సందర్భంగా పార్టీ సాధించిన లెక్కకు మిక్కిలి విజయాలను మననం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పార్టీ ప్రస్థానంలో అనుబంధంగా కార్మిక,విద్యార్థి,యువజన, రైతు, మహిళ ప్రజా సంఘాలను నిర్మించి వెట్టిచాకిరీ విముక్తి కొరకు ఎన్నో త్యాగాలు చేసి విజయాలు సాధించిందని తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాటంలో 4500 ప్రాణత్యాగాలతో మూడు వేల గ్రామాల విముక్తి 10 లక్షల ఎకరాల భూమిని పంచిన ఘన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీదని పునరుద్ఘాటించారు.సింగరేణి సంస్థను పరిరక్షణ కై బయ్యారం ప్రాంతంలోని లక్ష కోట్ల విలువైన ఖనిజ సంపద ఐరన్ ఓరును కాపాడటంలో వీరోచిత పాత్ర కమ్యూనిస్టు పార్టీ పోషించిన విషయాన్ని గుర్తుచేశారు.చరిత్రాత్మక సమాచార హక్కు చట్టం,ఉపాధిహామీ పథకం, అటవీ హక్కుల చట్టం తీసుకురావడానికి సీపీఐ పార్టీ కృషి మరవలేనిదన్నారు.దేశ ప్రజల మధ్య మత విద్వేషాలు రెచ్చగొడుతూ కేంద్రంలోని బీజేపీ సర్కారు అధికారంలో కొనసాగితున్నదని,దేశ సంపదను అదాని, అంబానీలకు దోచిపెడుతోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎన్డీయే హయాంలో సంపన్నులు మరింత ధనవంతులు అవుతుండగా పేదలు నిరుపేదలుగా మారుతున్నారని చెప్పారు.రైతులను, కార్మికులను పెట్టుబడిదారులకు కట్టుబానిసలుగా మార్చే చట్టాలు తెచ్చిన కేంద్రంపై సీపీఐ పోరాటం చేస్తున్నదని తెలిపారు. దేశంలోని వామపక్ష శక్తులు ఏకమై కమ్యూనిస్టులు బలపడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.డిసెంబర్ 26న ఖమ్మం వేదికగా జరిగే భారీ బహిరంగ సభలో జాతీయ నాయకత్వం,40 దేశాల కమ్యూనిస్టు ప్రతినిధులు, తెలుగు రా ష్ట్రాల తోపాటు దేశ నలుమూలల నుండి వేలాదిమంది పాల్గొంటారని,అధిక సంఖ్యలో సభకు హాజరై విజయవంతం చేయాలని చాడ వెంకట్ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్ళపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేన శంకర్,డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్,కె. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠ రెడ్డి,ప్రజానాట్యమండలి కార్యదర్శి పల్లె నర్సింహ,జిల్లా కార్యదర్శి చెన్న విశ్వనాథం,వెన్న మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## రిజర్వేషన్లు చట్టబద్ధంగా అమలు చేయాలి

### కలెక్టరేట్ ఎదుట బిసి జెఎసి న్యాయ సాధన దీక్ష




ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ: బిసి జెఎసి రాష్ట్ర చైర్మన్, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య పిలుపు మేరకు ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు చట్టబద్ధంగా అమలు చేయాలని కోరుతూ కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ ఎదుట బిసి జెఎసి ఆధ్వర్యంలో న్యాయ సాధన దీక్షను చేపట్టారు. ఈ సందర్భంగా జెఎసి నేతలు ఆది మల్లేశం, నాగుల కనుకయ్య, నర్సింగోజు శ్రీనివాస్‌లు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు చట్టబద్ధంగా అమలు చేసిన తర్వాతనే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. సిఎం రేవంత్‌రెడ్డి బిసి సంఘాల నాయకులను, అఖిల పక్షాన్ని ఢిల్లీకి తీసుకుపోయి కేంద్రంపై ఒత్తిడి తెచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ శీతాకాల పార్లమెంటు సమావేశాలలో మొత్తం కాంగ్రెస్ ఎంపిలు 42 శాతం రిజర్వేషన్లు అంశంపై చర్చ జరపాలని, బిల్లు ఆమోదం పొందేలా చూడాలని, రాజ్యాంగం సవరణ చేసి బిసి బిల్లును 9వ షెడ్యూల్‌లో చేర్చి బిల్లుకు చట్టబద్ధత కల్పించేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. 42 శాతం బిసి రిజర్వేషన్లు చట్టబద్ధంగా అమలు అయిన తర్వాతే రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలని, లేకుంటే బిసి జెఎసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. ఈ సమావేశంలో బిసి జాక్ నాయకులు జిఎస్ ఆనంద్, ఉమా మహేశ్వర్, గున్నాల కన్నాంబ, మహేష్, బాబన్న, అంజద్, నల్లగోని శ్రీనివాస్, నితిన్, మహేందర్ ముదిరాజ్, గట్టు సత్యం, బిసి జెఎసి నాయకులు తదితరులున్నారు.

## సిద్దిపేట ప్రభుత్వ వైద్య కళాశాలకు మాజీ మంత్రి మదన్‌మోహన్ పేరు పెట్టేలా కృషిచెస్తా

### మాజీ మంత్రి హరీశ్‌రావు



ప్రజాపక్షం/ సిద్దిపేట : సిద్దిపేట జిల్లా కేంద్రలో కెసిఆర్ మంజూరు చేసిన ప్రభుత్వ వైద్య కళాశాలకు మాజీ మంత్రి మదన్‌మోహన్ పెట్టేలా కృషిచేస్తానని.. ఇందుకోసం సిఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాస్తానని మాజీ మంత్రి హర్‌శ్‌రావు అన్నారు. రాజకీయాలుకంటే వ్యక్తులు.. వ్యక్తులు చేసిన కృషిగొప్పదన్నారు. తొలిదశ తెలంగాణ ఉద్యమంలో సిద్దిపేట ఎన్నికల్లో మదన్‌మోహన్ గెలిచారని. మలిదశ ఎన్నికల్లో కెసిఆర్‌ను గెలిపించారన్నారు. ఆదివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో విక్టరీ చౌరస్తాలోని పార్కు ప్రాంగణంలో మాజీ మంత్రి మదన్‌మోహన్ విగ్రహాన్ని వారి కటుంబ సభ్యులతో కలసి ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ ఏలాంటి సౌకర్యాలు లేని సమయంలో వారు తెలంగాణ ఉద్యమాన్ని గొప్పగా పెంచారన్నారు. తాను ఇటీవల కెసిఆర్‌తో మదన్‌మోహన్‌తో కలసి గంట సేపు చర్చించినట్లు తెలిపారు. సిద్దిపేటకు తెలంగాణకు.. మదన్‌మోహన్, కెసిఆర్‌కు విడదీయరాని సంబంధం ఉందన్నారు. పార్టీలు, రాజకీయాలు శాశ్వతం కాదని వ్యక్తులు చేసిన సేవలే శాశ్వతం అని చెప్పటమే సిద్దిపేట విజన్ అన్నారు. సిద్దిపేటకు సేవ చేసిన వారిని స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఒక రాజకీయ నేతగా గాకుండ.. ఒక వ్యక్తిగా మదన్‌మోహన్ తనదైన శైలిలో సిద్దిపేటకు సేవ చేశారన్నారు. అందుకే మదన్‌మోహన్‌కు ఈ గౌరవం దక్కిందన్నారు. గతంలో సిద్దిపేట నుండి తొలి ఎమ్మెల్యేగా పనిచేసిన సిపిఐ నేత గురువారెడ్డి విగ్రహం సైతం ఇక్కడే ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. తొలిదశ తెలంగాణ ఉద్యమంలో మదన్‌మోహన్ ఆనాడు విశేషంగా కృషిచేసినట్లు తెలిపారు. ఆ స్ఫూర్తితోనే కెసిఆర్ ఉద్యమించి ఏకంగా తెలంగాణ రాష్ట్రాన్ని సాకారం చేసినట్లు గుర్తుచేశారు. స్వరాష్ట్రం సాకారమైనప్పుడు మదన్‌మోహన్ ఉంటే ఏంతో సంతోషించేవారన్నారు. ఈనాడు సిద్దిపేట అభివృద్ధి గురించి దేశ, విదేశాల్లో ప్రశంసలు దక్కుతుంటే మదన్‌మోహన్ ఆత్మ సంతోషిస్తు ఉండొచ్చు అన్నారు. అల్టిమెట్‌గా మదన్‌మోహన్ సిద్దిపేట అభివృద్ధిని కాంక్షించారన్నారు. ఆతర్వాత కెసిఆర్, ఇప్పుడు తాను సైతం సిద్దిపేట అభివృద్ధి. ప్రజల కోసమే శక్తిని మించి పనిచేసినట్లు తెలిపారు. కొంతమంది నన్ను అడిగారని మదన్‌మోహన్ వేరే పార్టీలో పనిచేశారని, ఆయన మరణం తర్వాత కూడ ఇన్నేళ్లు ఆయన సేవలను గుర్తించలేదని మనం ఏలా విగ్రహం పెడుతామని అన్నారన్నారు. కాని మదన్‌మోహన్ చేసినసేవలను పార్టీలకు అతీతంగా గుర్తించాలని, ఆయన కృషి శాశ్వతంగా సిద్దిపేట చరిత్రలో నిలవాలని చెప్పి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. పార్టీలకు అతీతంగా పనిచేసి పెట్టడమే సిద్దిపేట నాయకుల విజన్‌గా ఉండాలన్నదే తపన అన్నారు. అందుకే నా దగ్గరకు వచ్చే వాళ్లలో అన్ని పార్టీల వాళ్లు పనుల చేసుకేళ్తారన్నారు. ఆరోజుల్లో సిద్దిపేటకు వంద పడకల ఆసుపత్రి తీసుకొచ్చిన గొప్ప నాయకుడు మదన్‌మోహన్ అన్నారు. సిద్దిపేట మెడికల్ కళాశాలకు మదన్‌మోహన్‌కు పేరు పెట్టెలా సిఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాస్తానని మాజీ మంత్రి హరీశ్‌రావు వెల్లడించారు. మదన్‌మోహన్ కుటుంబ సభ్యులను మాజీ మంత్రి హరీశ్‌రావు సన్మానించి, జ్ఞాపికలు అందచేశారు. వారంత కలసి హరీశ్‌రావును సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సి,ఎస్‌టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్, మాజీ ఎమ్మెల్సీ ఫారుక్‌హుస్సేన్, మదన్‌మోహన్ కుటుంబ సభ్యులు సారిక, డాక్టర్ రవీందర్, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, వైస్ చైర్మన్ కనకరాజు, బిఆర్‌ఎస్ నేతలు కిరణ్, వరుణ్, అశ్వీన్. పెద్దన్న, పాల సాయిరాం, సంపత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఆదివారం అంబేద్కర్ స్మరణం




ప్రజాపక్షం/గొల్లపల్లి : అంబేద్కర్ దేశానికి అందించిన అమూల్యమైన సేవలు సమానత్వం, న్యాయం ,సామాజిక సంస్కరణలో వారి ఆలోచనలు ఆశయాలను ఆదర్శాల ద్వారా భవిష్యత్ తరాలు స్ఫూర్తి పొందటంతో పాటు స్మరించుకోవాలని గొల్లపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ,న్యాయవాది బొల్లె రాజన్న అన్నారు.జగిత్యాల జిల్లా గొల్లపెల్లి మండల కేంద్రం లో ఆవుల సత్యం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆదివారం అంబేద్కర్ నామ స్మరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బొల్లె రాజన్న పాల్గొని మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూల మాలవేసి నివాళులు అర్పించారు .అంబేద్కర్ నామ స్మరణ కార్యక్రమానికి విచ్చేసిన సభ్యులతో రాజ్యాంగ పీఠికను చదువుతూ ప్రతిజ్ఞ చేయించారు .అనంతరం వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అందించిన సమానత్వం, స్ఫూర్తి,ధైర్యాన్ని స్మరించుకునేది సర్వసాధారణ అంశం కాదు. అంబేద్కర్ పేరు స్మరించుకుంటేనే ఒక ధైర్యం ఉద్భవిస్తుంది. భారతదేశంలోని బహుజనులు అందరికీ ఆయన ధైర్యం. ఆయన బహుజనులు అందరికీ ఆశాజ్యోతి అయ్యారు.సమాజంలో ఎన్నో అవమానాలకు గురైన తట్టుకొని నిలబడడం ద్వారా మాకు ప్రేరణగా నిలిచారు. సమానత్వ స్వప్నాన్ని కలిగి చివరి శ్వాస వరకు అన్యాయాలపై అసమానతలపై అలుపెరుగని పోరాటం చేశారని అన్నారు.ప్రతి ఆదివారం కుల మతాలకు ,రాజకీయాలకు అతీతంగా నిర్విరామంగా కొనసాగుతున్న అంబేద్కర్ స్మరణం కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వాములై డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ మహనీయులను కీర్తించాలని కోరారు .ఈ కార్యక్రమలో కచ్చు కొమురయ్య, చౌటపల్లి తిరుపతి, శాలివాహన కుమ్మరి సంఘం మండల అధ్యక్షుడు సిరికొండ తిరుపతి,అంబేద్కర్ సంఘం అధ్యక్షులు చెవులమద్ది సంతోష్, రజక సంఘం అధ్యక్షులు కలకోట సత్యం, తాండ్ర కిరణ్,కోమల్ల జలంధర్, ముదిరాజ్ మండలం అధ్యక్షులు, అంబేద్కర్ సంఘం పట్టణ అధ్యక్షులు గంగాధర మధుసూదన్,దావుల రాకేష్,సంగెం కళ్యాణ్, సరసాని అనిల్ రెడ్డి, విజయ్ ఎరవేణి కన్ను, సిరికొండ వెంకటేష్, గడ్డం గంగాధర్,రాజలింగు, జంగిలి ఎల్లయ్య,కొండ్రా చంద్రయ్య, నర్సయ్య, అంబేద్కర్ వాదులు తదితరులు పాల్గొన్నారు.

## సిఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే సత్యం చిత్రపటాలకు క్షీరాభిషేకం



ప్రజాపక్షం/గంగాధర:గంగాధర మండలం నారాయణపూర్ నిర్వాసితుల 20 ఏళ్ల నిరీక్షణకు తెరపడింది. ఎల్లంపలి ప్రాజెక్టులో భాగంగా గంగాధర మండలం నారాయణపూర్ రిజర్వాయర్‌లో నారాయణపూర్, మంగపేట, చర్లపల్లి(ఎన్) గ్రామాలకు చెం దిన ప్రజల భూములు, ఇండ్లు ముంపు గురికాగా ఎట్టకేలకు శనివారం రూ.23 .50 కోట్ల పరిహారం మంజూరయ్యింది. ఈ మేరకు ఆయా గ్రామాల ప్రజల హర్షం వ్యక్తం చేస్తూ గంగాధర మండలం మధురానగర్ చౌరస్తాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, అందుకు కృషి చేసిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు నిర్వాసితులు కృతజ్ఞతలు తెలియజేస్తూ వారి చిత్రపాటాలకు పాలాభిషేకం చేశారు. గంగాధర మార్కెట్ కమిటీ చైర్మన్ జాగిరపు రజిత శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ వెలిచాల తిరుమల్‌రావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తోట కరుణాకర్, సింగిల్ విండో వైస్ చైర్మన్ వేముల భాస్కర్, మండల అధ్యక్షుడు పురుమల్ల మనోహర్, దుబ్బాసి బుచ్చన్న, రామిడి రాజిరెడ్డి, బూరుగు గంగన్న, సాగి అజయ్‌రావు, సత్తు కనుకయ్య, కర్ర విద్యాసాగర్, తోట సంధ్య, కవిత, వేముల అంజి, బాపురెడ్డి, మేర కొండయ్య, స్వామి, దీకొండ మధు, నగేష్, కోల ప్రభాకర్, మ్యాక వినోద్, మహేష్, గంగివేణి నవీన్ తదితరులున్నారు.

## మంత్రి పొన్నంను కలిసిన టిఎన్‌జిఒ నాయకులు



ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ: తెలంగాణ రాష్ట్ర బిసి సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హుస్నాబాద్‌లోని వారి నివాసంలో నిర్వహించుకున్న సత్యనారాయణ స్వామి వ్రతం కార్యక్రమంలో భాగంగా కరీంనగర్ జిల్లా టిఎన్‌జిఒ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. మంత్రి ప్రత్యేక ఆహ్వానం మేరకు హాజరైన టిఎన్‌జీవో నాయకులు మాట్లాడుతూ మంత్రి పొన్నం ప్రభాకర్ తో పాటు వారి కుటుంబ సభ్యులపై సత్యనారాయణ స్వామి కరుణాకటాక్షాలు ఎల్లప్పుడూ ఉండాలని సంఘం తరపున ఆకాంక్షించారు. ఇటీవల జరిగిన జూబ్లీ హిల్స ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించినందుకు మంత్రికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో టిఎన్‌జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మణ్ రావు, కేంద్రం సంఘం నాయకులు నాగుల నరసింహస్వామి, కోశాధికారి కిరణ్‌కుమార్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు మారుపాక రాజేష్ భరద్వాజ్, నాయకులు భగవాన్ రెడ్డి, పవన్, వేణు తదితరులున్నారు.

## అర్హులైన అందరికీ విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లు

### ఇందిరమ్మ ఇళ్ల నూతన గృహ ప్రవేశానికి హాజరైన ప్రణవ్



ప్రజాపక్షం / హుజురాబాద్ : ప్రతి పేద వారి కుటుంబంలో సొంతింటి కల అనేది లక్ష్యమని అలాంటి కలను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రివర్గం, కాంగ్రెస్ పార్టీ ఇందిరమ్మ ఇళ్ల ద్వారా నెరవేరుస్తున్నామని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ అన్నారు. ఆదివారం హుజురాబాద్ పట్టణ పరిధిలోని ఒకటవ వార్డు కొత్తపల్లిలో గౌరవేని లక్ష్మి నూతన గృహప్రవేశానికి ముఖ్య అతిథిగా హాజరైయారు. గృహ ప్రవేశ సమయంలో లబ్ధిదారు ఒకింత భావోద్వేగానికి లోనయ్యారు. ఇంటి నిర్మాణం కోసం ఇన్నేళ్లుగా ఎదురుచూశామని ఇప్పుడు ఇళ్లు కట్టుకుని గృహప్రవేశానికి వెళ్లడం ఆనందంగా ఉందని తెలిపారు. రాబోయే రోజుల్లో హుజురాబాద్ నియోజకవర్గంలో అర్హులైన పేదవారికి విడతల వారీగా ఇళ్లు అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# క్రీడ



## రెండో వన్డేలో భారత్–ఎ ఘన విజయం

దక్షిణాఫ్రికా–ఎతో జరిగిన రెండో అనధికార వన్డే మ్యాచ్‌లో భారత్–ఎ 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. దీంతో మూడు వన్డేల సిరీస్‌ను 2–0తో భారత్–ఎ ఒక మ్యాచ్ మిగిలుండగానే కైవసం చేసుకుంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న దక్షిణాఫ్రికా–ఎ 30.3 ఓవర్లలో 132 పరుగులకు ఆలౌటైంది. ఈ లక్ష్యాన్ని భారత్–ఎ 27.5 ఓవర్లలోనే ఒక వికెట్ నష్టపోయి ఛేదించింది. రుతురాజ్ గైక్వాడ్ (68*; 83 బంతుల్లో 9 ఫోర్లు) హాఫ్ సెంచరీ బాదాడు. అభిషేక్ శర్మ (32; 22 బంతుల్లో 6 ఫోర్లు), తిలక్ వర్మ (29; 62 బంతుల్లో 2 ఫోర్లు) రాణించారు. దక్షిణాఫ్రికా–ఎ బ్యాటర్లలో రివాల్డో మూన్సామి (33; 34 బంతుల్లో) టాప్ స్కోరర్. డెలానో పోట్గీటర్ (23), డయాన్ ఫారెస్టర్ (22), లువాన్‌డ్రే ప్రిటోరియస్ (21), ప్రేనేలన్ సుబ్రాయెన్ (15) పరుగులు చేశారు. భారత బౌలర్లలో నిషాంత్ సింధు (4/16), హర్షిత్ రాణా (3/21) మెరిశారు. ప్రసిద్ధ్ కృష్ణ 2, తిలక్ వర్మ ఒక వికెట్ పడగొట్టారు. సిరీస్‌లో చివరి మ్యాచ్ నవంబర్ 19న జరగనుంది.



## గిల్‌కు గాయం

### అప్‌డేట్ ఇచ్చిన బిసిసిఐ

దక్షిణాఫ్రికాతో కోల్‌కతాలో జరుగుతున్న తొలి టెస్టు మ్యాచ్‌కు భారత జట్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అందుబాటులో ఉండడం లేదు. మ్యాచ్ రెండోరోజు టీమిండియా తొలి ఇన్నింగ్స్ సమయంలో బ్యాటింగ్ చేస్తున్న సమయంలో గిల్ గాయపడ్డ విషయం తెలిసిందే. గాయం కారణంగా పెవిలియన్‌కు చేరుకున్నాడు. ఆ తర్వాత గిల్ మైదానంలోకి దిగలేదు. శనివారం రాత్రి ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చేరాడు. మూడో రోజు ఆట ప్రారంభానికి ముందు భారత క్రికెట్ నియంత్రణ బోర్డు కెప్టెన్ ఫిట్‌నెస్ గురించి అప్‌డేట్ ఇచ్చింది. కోల్‌కతా వేదికగా జరుగుతున్న టెస్ట్ మ్యాచ్ రెండోరోజు భారత ఇన్నింగ్స్ సమయంలో కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మెడకు గాయమైందని తెలిపింది. ఆట ముగిసిన తర్వాత పరీక్షల కోసం దవాఖానాకు తరలించామని. ప్రస్తుతం ఆసుపత్రిలో వైద్యుల పర్యవేక్షణలో ఉన్నాడని బిసిసిఐ పేర్కొంది. తొలి టెస్టు మిగతా ఆటకు అందుబాటులో ఉండే అవకాశం లేదని.. బిసిసిఐ మెడికల్ టీమ్ అతని ఆరోగ్యాన్ని ప్రత్యేకంగా పర్యవేక్షిస్తుందని బీసీసీఐ పేర్కొంది. కెప్టెన్ గైర్హాజరీలో టీమిండియా తొమ్మిది మంది బ్యాటర్లతోనే రెండో ఇన్నింగ్స్ ఆడనున్నది. వాస్తవానికి తొలిరోజు మ్యాచ్‌కు ముందే గిల్ మెడ కండరాలు పట్టేయగా.. పెయిన్ కిల్లర్స్ సహాయంతో బ్యాటింగ్‌కు వచ్చాడు. మూడు బంతులు ఆడి ఓ ఫోర్ కొట్టాడు. ఈ సమయంలో మెడ కండరాలపై ఒత్తిడి పెరగడంతో నొప్పి తీవ్రమైంది. ఫిజియో మైదానంలోకి వచ్చిన పరిస్థితిలో మార్పులు లేకపోవడంతో రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరగాల్సి వచ్చింది.

## డబ్ల్యుటిసిలో టీమిండియాకు షాక్



| TEAM | PER% | PTS | M | W | L | D |
|---|---|---|---|---|---|---|
| AUSTRALIA | 100.00 | 36 | 3 | 3 | 0 | 0 |
| SOUTH AFRICA | 66.67 | 24 | 3 | 2 | 1 | 0 |
| SRI LANKA | 66.67 | 16 | 2 | 1 | 0 | 1 |
| INDIA | 54.17 | 52 | 8 | 4 | 3 | 1 |
| PAKISTAN | 50.00 | 12 | 2 | 1 | 1 | 0 |
| ENGLAND | 43.33 | 26 | 5 | 2 | 2 | 1 |
| BANGLADESH | 16.67 | 4 | 2 | 0 | 1 | 1 |
| WEST INDIES | 0.00 | 0 | 5 | 0 | 5 | 0 |
| NEW ZEALAND | - | - | - | - | - | - |



ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో ప్రతి విజయం ఫైనల్ అవకాశాల్ని మెరుగుపరుస్తుంది. అలానే ప్రతి ఓటమి ర్యాంక్‌ను తగ్గిస్తూ పోతోంది. ఇప్పుడు భారత జట్టురెండో పరిస్థితిని ఎదుర్కొంటోంది. డబ్ల్యుటిసి 2025–27 సీజన్‌లో ఇంగ్లాండ్ గడ్డపై సిరీస్ సమం చేసి.. వెస్టిండీస్‌ను వైట్ వాష్ చేయడంతో మూడో ర్యాంక్‌లో నిలిచిన టీమిండియాకు పెద్ద షాక్. ఈడెన్ గార్డెన్స్‌లో అనూహ్య ఓటమితో భారత ర్యాంక్ పడిపోయింది. ఈడెన్ గార్డెన్స్‌లో టీమిండియాదే గెలుపు అనుకున్న ప్రతిఒక్కరూ కంగుతిన్నారు. స్వల్ప ఛేదనలో తడబడిన భారత ఆటగాళ్ల సమిష్టి వైఫల్యంతో జట్టును ముంచారు. స్పిన్ ట్రాక్‌ను కోరిమరి తయారుచేయించుకున్నప్పటికీ అదే పిచ్ మీద మనోళ్లు చేతులెత్తేశారు. 124 పరుగుల ఛేదనలో అక్షర్ పటేల్(26) మినహా ఏ ఒక్కరూ కూడా క్రీజులో నిలబడకపోవడంతో ఆలౌటై ఘోర పరాభవం చవిచూసింది. పదమూడేళ్ల తర్వాత ఈడెన్స్‌లో విక్టరీ కొట్టిన దక్షిణాఫ్రికా డబ్ల్యుటిసి పట్టికలో రెండో స్థానానికి దూసుకెళ్లగా.. టీమిండియా నాలుగో స్థానంలో నిలిచింది. మూడు మ్యాచుల్లో మూడు నెగ్గిన ఆస్ట్రేలియా అగ్రస్థానంలో ఉంది. గత మూడు మ్యాచుల్లో రెండు విజయాలు, ఒక ఓటమితో సఫారీ టీమ్ రెండో ర్యాంక్ కైవసం చేసుకుంది. ఒక విజయం, రెండు డ్రాలతో శ్రీలంక మూడో స్థానంలో కొనసాగుతోంది.

తెలంగాణ పారా షూటర్ ధనుశ్ శ్రీకాంత్ చరిత్ర సృష్టించాడు. డెఫ్లింపిక్స్ క్వాలిఫికేషన్‌లో రికార్డు బ్రేక్ చేసిన ఈ యంగ్‌స్టర్.. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగం ఫైనల్లో విజేతగా నిలిచాడు. 251.7 పాయింట్లతో పసడి పతకం పట్టేశాడు శ్రీకాంత్. రాష్ట్రం గర్వించే విజయాన్ని సాధించిన శ్రీకాంత్‌కు భారీ నజరానా ప్రకటించింది ప్రభుత్వం. అంతర్జాతీయంగా అదరగొడుతున్న శ్రీకాంత్‌కు ప్రోత్సాహకంగా రూ.1.20





## డెఫ్లింపిక్స్‌లో ధనుష్‌కు పసిడి

### రూ.1.20 కోట్ల నజరానా

కోటి నగదు ఇస్తామని క్రీడా మంత్రి వాకిటి శ్రీహరి చెప్పారు. పంతొమ్మిదేళ్ల వయసులోనే డెఫ్లింపిక్స్‌లో అరంగేట్రం చేసిన ధనుశ్ శ్రీకాంత్ గోల్డ్ మెడల్ సాధించి వార్తల్లో నిలిచాడు. ఇటీవల టోక్యోలో జరిగిన డెఫ్లింపిక్స్ 25వ సమ్మర్ పోటీల్లో ధనుశ్ రికార్డులు బద్దలు కొట్టాడు. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగంలో తన గురికి తిరుగులేదని చాటుతూ గోల్డ్ మెడల్ కొల్లగొట్టాడు. క్వాలిఫికేషన్‌లో 252.2 పాయింట్లతో సత్తా చాటిన శ్రీకాంత్ ఫైనల్లోనూ రాణించాడు. పసిడి పతకమే లక్ష్యంగా గన్ అందుకున్న అతడు ఫైనల్లో 251.7 పాయింట్లతో విజేతగా అవతరించాడు. ఇదే పోటీల్లో భారత్‌కే చెందిన మొహమ్మద్ ముర్తాజా వనియా రెండో స్థానంతో వెండి పతకం గెలుచుకున్నాడు.

# ఆరోగ్యం

ఫోకస్


## మెదడు కణాల పునరుజ్జీవనం సాధ్యమే!

మెదడులోని కణాలు ఒకసారి నశిస్తే అవి తిరిగి ఉత్పత్తయ్యే అవకాశం లేదన్నది ఇప్పటి వరకూ శాస్త్రవేత్తలు, వైద్య నిపుణుల అభిప్రాయం. కానీ, ఇది నిజం కాదని తాజా పరిశోధనలు అంటున్నాయి. న్యూరోసైన్స్ నిపుణుల బృందం అధ్యయనాలను అనుసరించి, వివిధ కారణాలతో, ప్రత్యేకించి వయసు మీదపడుతున్న వారిలో నష్టమయ్యే న్యూరాన్లు మళ్లీ మెరుగుతాయి. ఈ సామర్థ్యం మెదడుకు ఉంది. వీటి పునరుజ్జీవనం కోసం మందులు లేదా శస్త్రచికిత్సలు అవసరం లేదు. ఆశ్చర్యకరంగా 'ధ్వని'తో ఇది సాధ్యమవుతుంది. నిర్దిష్ట ధ్వని తరంగాల ద్వారా శోధకులు, పెద్దవయసు వారి మెదడులో విశ్రాంతిగా ఉన్న న్యూరల్ స్టెం కణాలను ఉత్తేజించగలిగారు. ఇలా చేసినప్పుడు, ఆ కణాలు సక్రమంగా పనిచేసే న్యూరోన్లుగా మారాయి. అయితే, ఈ ధ్వనులు సంగీతం లేదా సాధారణ శబ్దాలు కావు. అత్యంత నాణ్యతతో రూపొందించిన థెరప్యూటిక్ తరంగాలు. ఇవి సెల్యులార్ స్థాయిలో మెదడు కణాలను ఉత్తేజితం చేస్తాయి. ప్రయోగాల్లో, ఈ తరంగాలను పంపినప్పుడు, పెద్ద వయసు ఉన్నవారిలో జ్ఞాపకశక్తి, న్యూరల్ కనెక్టివిటీ సామర్థ్యాలు గణనీయంగా పెరిగాయి. మెదడును స్కాన్ చేసినప్పుడు, నష్టమైన ప్రాంతాల్లో కొత్త న్యూరోన్ల వృద్ధిని కనుగొన్నారు. ఎలాంటి శస్త్ర చికిత్సగానీ, మందులుగానీ అవసరం లేకుండా జరిపే ఈ 'సౌండ్ థెరపీ' ద్వారా అల్జీమర్స్, పార్కిన్సన్స్, మానసిక గాయాలు, వృద్ధాప్యంలో వచ్చే మేధస్సు తగ్గుదల వంటి సమస్యలకు మార్గం చూపొచ్చు. మెదడును కాపాడటానికి కాదు, ఇప్పుడు శాస్త్రవేత్తలు దాన్ని తిరిగి పునరుద్ధరించాలనే




లక్ష్యంతో పనిచేస్తున్నారు. దానికి సాధనంగా 'ధ్వని'ని ఉపయోగిస్తున్నారు. సెల్ఫ్‌రిపేర్ బయోమెకానిజంతో సహజంగా జ్ఞాపకాన్ని తిరిగి తెచ్చుకోవడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తున్నది. సాంప్రదాయ చికిత్సలకు భిన్నంగా, ధ్వని తరంగాలు కెమికల్స్ లేదా ఇంప్లాంట్స్‌పై ఆధారపడవు. ఇవి నెమ్మదిగా మెదడు మీదుగా ప్రవహించి మన శరీరంలోని సహజ సేద్యం వ్యవస్థలను ఉత్తేజించగలవు. ఈ విప్లవాత్మక ఆవిష్కరణ వల్ల జ్ఞాపక నష్టంతో బాధపడుతున్నవారికి, న్యూరాలజికల్ డ్యామేజ్ ఉన్నవారికి కొత్త ఆశ కలుగుతుంది. ఇకపై సంచలన కిరాయి సాధనాల అవసరం లేకుండా, సరైన ఫ్రీక్వెన్సీలో సరియైన తరంగాలే, పెద్దవయసులో మార్పులకు లోనవదని అనుకున్న మన మెదడు, ఇప్పుడు విశేష పట్టుదల, తేలిక, ప్రయోగశీలతను చూపిస్తోంది.

## జీవనశైలి కీలకం



మనిషి ఆరోగ్యంగా ఉండడం వివిధ అంశాలపై ఆధారపడినప్పటికీ, జీవన శైలి అత్యంత కీలకంగా వ్యవహరిస్తుంది. అయితే, చెడు అలవాట్లు, అనారోగ్య జీవన విధానాలు చాలా సులభంగా వస్తాయి. ఆరోగ్యకరమైన జీవన శైలిని అనుసరించడానికి చాలా కష్టపడాలి. తాజా పరిశోధనలను అనుసరించి, మెదడును సరైన దిశలో ఆలోచింప చేసి, ఆరోగ్యకరమైన జీవన శైలిని అలవరచుకోవడానికి పరిసంప్రేక్షణ నాడీ వ్యవస్థ లేదా పారాసింపథెటిక్ నర్వస్ సిస్టమ్ ఉపయోగపడుతుంది. దానిని యాక్టివ్ చేయడం ఆరోగ్యానికి, అలవాట్లు మార్చుకోవటానికి, భావోద్వేగ స్వస్థతకు అత్యంత ప్రభావవంతమైన సాధనం అవుతుంది. ఈ వ్యవస్థ యాక్టివేషన్ వల్ల ఒత్తిడి తగ్గుతుంది. భావోద్వేగాలు నియంత్రణలోకి వస్తాయి. ప్రశాంతత పెరుగుతుంది. ఫలితంగా, అప్పటి వరకూ అసాధ్యంగా కనిపించే మానసికంగా హానికరమైన అలవాట్లు విడిచిపెట్టడం, చిన్నప్పటి ట్రామాను విడుదల చేయడం, శరీరాన్ని గరిష్ఠంగా పనిచేసేలా రీసెట్ చేయడం వంటివి కూడా సాధ్యమవుతాయి. పారాసింపథెటిక్ నర్వస్ సిస్టమ్ యాక్టివ్ అయితే, హృదయ స్పందన సక్రమంగా ఉంటుంది. జీర్ణక్రియ మెరుగుపడుతుంది, శరీరంలోని వాపు తగ్గుతుంది. తిరిగి సరైన స్థితిలో ఉంచే పరిస్థితులను కల్పిస్తుంది. ఒక రకంగా చెప్పాలంటే, ఇది 'ఫైట్ ఆర్ ఫ్లైట్' స్పందనకు విరుద్ధంగా ఉంటుంది. సహజంగా, చిరకాల ఒత్తిడిలో ఉన్నప్పుడు 'ఫైట్ ఆర్ ఫ్లైట్' స్పందన అధికమవుతుంది. హానికర అలవాట్లు విడిచిపెట్టడం కష్టంగా మారుతుంది. లోతైన శ్వాస, ధ్యానం, మృదువైన కదలికలు, చల్లటి నీటి ఆక్రమణ, మైండ్‌ఫుల్‌నెస్ వంటి సాధనలు పారాసింపథెటిక్ నర్వస్ సిస్టమ్ యాకివిటీని ఉత్తేజపరుస్తాయి. తద్వారా నాడీ వ్యవస్థ సహజంగా సమతుల్యతను పొందుతుంది.

## నిద్ర తగ్గితే ప్రమాదమే!



సరైన ఆహారం, క్రమమైన వ్యాయామం ఆరోగ్యం కోసం ఎంత ముఖ్యమో నిద్ర కూడా అంతే కీలకమని కొత్త పరిశోధనలు సూచిస్తున్నాయి. శరీరానికి అవసరమైన పోషకాలు అన్నీ తీసుకున్నా, నిద్ర తగినంతగా లేకపోతే మన శరీరం ఆహారాన్ని కొవ్వుగా మార్చే దిశలో పనిచేస్తుంది. దీనికి ప్రధాన కారణం ఇన్సులిన్, లెప్టిన్, గ్రెలిన్ వంటి ఆకలి, తృప్తి, శక్తి నిల్వలని నియంత్రించే హార్మోన్ల అసమతౌల్యం. నిద్ర లేమి వల్ల శరీరం కార్బోహైడ్రేట్లను సమర్థంగా ప్రాసెస్ చేయలేకపోతుంది. దీంతో రక్తంలో చక్కెర స్థాయిలు పెరుగుతాయి. అంతేకాకుండా, శరీరం కొవ్వు నిల్వ చేయడానికి మరింత ఆసక్తి చూపుతుంది, అదే సమయంలో కడుపు నిండిన భావనను పంపించే సంకేతాలు బలహీనమవుతాయి. ఈ పరిస్థితి ఒక చెడు వలయంలా మారుతుంది. ఆకలి పెరుగుతుంది. అధికకేలరీలతో కూడిన ఆహారం తీసుకునేలా ప్రేరేపిస్తుంది తిన్న కొద్దిపాటి ఆహారాన్ని కూడా శరీరం కొవ్వుగా నిల్వ చేస్తుంది. దీని ఫలితంగా సమతుల ఆహార ప్రణాళికను అనుసరించినా ప్రయోజనం లేకుండా, అధిక బరువు, మధుమేహం, గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదం పెరుగుతుంది. పరిశోధకుల మాటల్లో పెద్దవారు రోజుకు 7 నుండి 9 గంటల నాణ్యమైన నిద్ర పొందడం ద్వారా మాత్రమే శరీరం మెటాబాలిజం సజావుగా పనిచేస్తుంది. ఇది కేవలం విశ్రాంతిగా కనిపించడం కోసం కాకుండా, శరీరానికి కావాల్సిన పునరుద్ధరణ సమయాన్ని ఇవ్వడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుతుంది. కాబట్టి నిద్రను నిర్లక్ష్యం చేయకండి. అది ఒక అదనపు ఎంపిక కాదు, ఆరోగ్యానికి అత్యవసరం. సరైన ఆహారం, వ్యాయామం ఉన్నప్పటికీ నిద్ర లేకపోతే అవి ఎందుకూ కొరగాకుండా పోతాయి.

## 'ఢిల్లీ' ఘటనకు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా బాధ్యత వహించాలి

### ఎఐవైఎఫ్ జిల్లా సమితి డిమాండ్



ప్రజాపక్షం/నేరడిగొండ : ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన కారు బాంబు పేలుడు ఘటనకు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా బాధ్యత వహించి తక్షణమే రాజీనామా చేయాలని ఎఐవైఎఫ్ నిర్మల్ జిల్లా కార్యదర్శి మెస్రం భాస్కర్ డిమాండ్ చేశారు. ఆదివారం అదిలాబాద్ జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో ఎఐవైఎఫ్ జిల్లా సమితి సమావేశం జరిగింది. సమావేశంలో భాస్కర్ మాట్లాడుతూ ఉగ్రవాదం దేశంలో ఎక్కడ ఉన్నా కూకటి వేళ్లతో పెకిలించాలన్నారు. ఢిల్లీలో శాంతిభద్రతలు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ నియంత్రణలో ఉన్నాయని ప్రగల్భాలు పలికిన అమిత్ షా, ఇంతటి ఘోరం జరుగుతున్నా ఇంటెలిజెన్స్, రా, నేషనల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ నిఘా విభాగాలు నిద్రావస్థలో ఉండటం మోదీ ద్వంద్వ పాలనకు నిదర్శనమన్నారు. ఉగ్రదాడిలో మరణించిన వారికి కోటి రూపాయలు, గాయపడిన వారికి 25 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో ఎఐవైఎఫ్ జిల్లా నాయకులు, అరుణ్ కుమార్, నగేష్, లఖన్, మారుతి, హరీష్, రాజు, విలాస్, బబ్లూ, సాయి, సచిన్, నాగ్నాథ్, హరీష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలకు విరుద్ధంగా ఆదివారం తరగతులు నిర్వహిస్తున్నా చర్యలేవి?

### ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వెలుగు శ్రావణ్



ప్రజాపక్షం/మహబూబాబాద్ : నిబంధనలకు విరుద్ధంగా ఆదివారం తరగతులు నిర్వహిస్తున్న కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వెలుగు శ్రావణ్ కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం తరగతులు నిర్వహిస్తున్న పాఠశాలలు, కళాశాలను ఎఐఎస్ఎఫ్ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా శావణ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రైవేట్ విద్యాసంస్థల్లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఆదివారం సెలవురోజు తరగతులు నిర్వహిస్తూ ర్యాంకుల పేరుతో విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నారని ఆయన ఆరోపించారు. తరగతులు నిర్వహిస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని, తరగతులు బహిష్కరించి పాఠశాల ఎదుట నిరసన తెలిపారు. ర్యాంకుల పేరుతో విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురి చేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహిస్తున్నప్పటికీ విద్యాశాఖ అధికారులు పట్టించుకోకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. జిల్లా విద్యాశాఖ అధికారి స్పందించి శ్రీచైతన్య యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి మేక వెంకటేష్ పట్టణ కార్యదర్శి చెలువురి వికాస్ సాయికుమార్ ప్రకాష్ వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి





### సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ డిమాండ్

ప్రజాపక్షం/పెద్దపల్లి : మధ్యాహ్న భోజన కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పెద్దపల్లి జిల్లాలోని బస్సు జాతా సందర్భంగా స్థానిక అమరవీరుల స్థూపం వద్ద మధ్యాహ్న భోజన వర్కర్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మెకు మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మధ్యాహ్న భోజన కార్మికులకు రావాల్సిన పెండింగ్ బకాయిల విడుదలకు, వారి డిమాండ్ల సాధనకు సిపిఐ ఆధ్వర్యంలో సిఎం, మంత్రులతో చర్చించి, పరిష్కారానికి కృషి చేస్తామ న్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు మధ్యాహ్న భోజన కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి ఆర్థికంగా వారిని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కల్లపల్లి శ్రీనివాస రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కలవేన శంకర్, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్, మధ్యాహ్న భోజన జిల్లా కార్యదర్శి పూసాల రమేష్, బాలసాని లెనిన్, మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

## సిపిఐ నాయకులు నాగిళ్ల దేవయ్య మృతి పార్టీకి తీరని లోటు : ఆందోజు

ప్రజాపక్షం/సరూర్‌నగర్ : ఎల్‌బినగర్ మున్సిపల్ పరిధిలో సిపిఐ బలోపేతానికి కృషి చేసిన సీనియర్ నాయకులు నాగిళ్ల దేవయ్య మృతి పార్టీకి తీరనిలోటని సిపిఐ రాష్ట్ర నాయకులు ఆందోజు రవీంద్రచారి అన్నారు. ఆదివారం నాగోల్ ఎస్‌ఎ. డాంగేభవన్ సిపిఐ అనుబంధ సంఘాల కార్యాలయంలో నియోజకవర్గంలోని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బోయపల్లి రాములుగౌడ్ ఆధ్యక్షతన సిపిఐ నాయకులు నాగిళ్ల దేవయ్య సంతాప సభ నిర్వహించారు. ఆందోజు రవీంద్రచారితో పాటు సిపిఐ నియోజకవర్గం కార్యవర్శి సామిడి శేఖర్ రెడ్డి, చంద్రమౌళి, ఎస్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్ణాకర్‌రెడ్డి హాజరై దేవయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవయ్య ఇసిఐఎల్‌లో ఉద్యోగం చేస్తూ ఎఐటియుసి కార్మిక సంఘంలో కీలక పాత్ర పోషించారన్నారు. పార్టీ ఆదేశాల మేరకు ఎల్‌బినగర్ మునిసిపల్ ఏరియా సిపిఐ సమితి ప్రధాన కార్యదర్శిగా పనిచేశారన్నారు. రిటైర్మెంట్ తర్వాత సిపిఐని బలోపేతం చేయడానికి, ప్రజాసంఘాల నిర్మాణానికి కృషి చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు బొడ్డుపల్లి కృష్ణ, చంద్రశేఖర్‌రెడ్డి, కందుల సుధాకర్, పాండురంగాచారి తదితరులు పాల్గొన్నారు.





## పేదలకు భూములు పంచిన ఘనత సిపిఐదే : యానాల

ప్రజాపక్షం/వలిగొండ : పేదలకు భూములు పంచిన ఘనత కమ్యూనిస్టులదేనని సిపిఐ యాదాద్రి జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి పేర్కొన్నారు. సిపిఐ వలిగొండ మండల కౌన్సిల్ సమావేశం ఎల్లంకి మహేష్ అధ్యక్షన ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సిపిఐ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ యానాల దామోదర్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ జిల్లాలో అర్హులైన నిరుపేదలకు ఇండ్లు, ఇళ్లస్థలాలలు, రైతులకు వ్యవసాయ భూములు పంచిన ఘనత సిపిఐకే ఉందన్నారు. సిపిఐ శత వసంతాల ఉత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న సిపిఐ బస్సు జాతా ఈనెల 21న నల్లగొండకు రానున్న సందర్భంగా విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బోడ సుదర్శన్, మండల కార్యదర్శి సలిగంజి వీరస్వామి, సహాయ కార్యదర్శి ఎలంక మహేష్, సిపిఐ సీనియర్ నాయకులు ఎలగందుల అంజయ్య, పోలేపాక యాదయ్య, పట్టణ కార్యదర్శి సలిబద్రి రవీందర్, బాలగోని సత్యనారాయణ, నరిగే యాదయ్య, కట్ల యాదగిరి బోడిగే సుదర్శన్, సుద్దాల సాయి కుమార్, మేడి దేవేందర్, మారోజు నరసింహ చారి, కోయగూరి రాములయ్య, సలిగంజి కృష్ణ కుమార్, పోషణపోయిన బొందయ్య పాల్గొన్నారు.





## ధాన్యం కొనుగోలు ప్రారంభించకుంటే ఆందోళన బాట

### సిపిఐ నాయకుల హెచ్చరిక



ప్రజాపక్షం/పానుగల్ : పిఎసిఎస్, ఐకెపి ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోళ్లనువు వెంటనే ప్రారంభించాలని, లేదంటే రైతులతో కలిసి ధర్నాలు చేస్తామని ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షుడు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీరామ్ హెచ్చరించారు. పానుగల్ మండలంలోని కేతేపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వారు సందర్శించి మాట్లాడారు. కేంద్రాల్లో ధాన్యం పోసి 10 నుంచి 21 రోజులుగా ఆరబెట్టారని తేమశాతం రాలేదన్న సాకుతో కొనుగోలు చేయటం లేదన్నారు. పానుగల్, కేతేపల్లి, మహమ్మదాపురం, రేమద్దుల తదితర గ్రామాల్లో తేమ శాతం వచ్చిందని అధికారులే చెబుతున్నారని కొనుగోళ్లు ఎందుకు ప్రారంభించలేదని ప్రశ్నించారు. వర్షాలు పడితే ధాన్యం తడిసి మొలకలు వచ్చి నష్టపోతామని కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు భయంతో ఉన్నారన్నారు. ధాన్యం పోసిన కేంద్రాలలో నీరు, నీడ తార్పలిన్‌లు, ప్రాథమిక చికిత్స కిట్లు ఏర్పాటు చేయలేదన్నారు. తరుగు తీయకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించారని కానీ జిల్లాలో రబీ సీజన్లో సేకరించిన ధాన్యానికి బకాయిలు ఇంతవరకు చెల్లించలేదన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతుల సమస్యలను పరిష్కరించకుం టే సిపిఐ వారి పక్షాన పోరాడుతుందన్నారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు, మాజీ సర్పంచ్ కళావతమ్మ మండల కార్యదర్శి డంగు కురుమయ్య, మాజీ వార్డు సభ్యుడు పెంటయ్య, చిన్న నారాయణ, పరుశురాముడు, ఎల్లయ్య పాల్గొన్నారు.

## బడుగు, బలహీన వర్గాల కోసం నిరంతరం పోరాటం : శ్రవణ్

ప్రజాపక్షం/చిట్యాల : పేద, బడుగు, బలహీన వర్గాల కోసం నిరంతరం పోరాటం చేసే పార్టీ సిపిఐ అని పార్టీ నల్లగొండ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్‌కుమార్ అన్నారు. భారత కమ్యూనిష్టు పార్టీ ఆవిర్భవించి వంద వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే భారీ బహిరంగా సభకు పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. నల్లగొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటీ కేంద్రంలో ఆదివారం జరిగిన మండల కౌన్సిల్ సమావేశంలో ముఖ్య అతిధిగా పాల్గొని శ్రవణ్‌కుమార్ మాట్లాడుతూ సిపిఐ పేద, బడుగు, బలహీన వర్గాల కోసం నిరంతరం పోరాటం చేసే పార్టీ అని అన్నారు. కార్మిక, కర్షక వర్గాల హక్కుల సాధన కోసం అనేక ఉద్యమాలు చేపట్టి సాధించిందని అన్నారు. వంద సంవత్సరాల ఘనమైన చరిత్ర కలిగి, నిలకడైన రాజకీయాలతో ప్రజల పక్షాన నిలుస్తున్న పార్టీ సిపిఐ పార్టీ అని అన్నారు. వేల సంఖ్యలో బహిరంగ సభలో పాల్గొని విజయవంతం చేయాలని శ్రవణ్‌కుమార్ కోరారు. సమావేశంలో పార్టీ జిల్ల కౌన్సిల్ సభ్యులు బొడిగె సైదులు, మండల కార్యదర్శి ఎండి అక్బర్, సహాయ కార్యదర్శి జిల్లా సత్యం, నాయకులు గుండాల సత్తయ్య, దేశగోని బాలరాజు, కడగంచి రామలింగయ్య, బాల్‌రెడ్డి, బొలుగూరి లింగయ్య, దేవేందర్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.





# స్థానికం
REGIONAL NEWS
ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం

## ఘనంగా విశ్వకర్మ ఉద్యోగుల వన సమారాధన



**ప్రజాపక్షం/ ఖమ్మం :** విశ్వకర్మ ఉద్యోగుల వన సమారాధన ఆదివారం ఘనంగా నిర్వహించారు. చెరుకూరి వారి మామిడి తోటలో జరిగిన ఈ వేడుకల్లో విశ్వకర్మ బంధువులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్న పలువురు విశ్వకర్మ ప్రముఖులను సన్మానించారు. ప్రకృతి వైద్య సేవలో ఉన్న రామ్మడుగు వీరభద్రాచారి దంపతులను, సీనియర్ జర్నలిస్టు జనార్ధనాచారి దంపతులను ఘనంగా సన్మానించారు. సంఘం బాధ్యులు పాపాచారి, గురుబ్రహ్మం, వెంకటేశ్వరరావు, ఆదిశేషు, నర్సింహాచార్యా స్వామి, కిరీటి, నాగలక్ష్మి పాల్గొన్నారు.

## సిపిఐ శతాబ్ది ముగింపు ఉత్సవాలలో విరాళాల సేకరణ



**ప్రజాపక్షం/అశ్వాపురం:** మల్లెలమడుగు గ్రామ పంచాయితీలో ఇంటింటికి సిపిఐ ప్రతి ఇంటికి వెళ్లి కరపత్రాలు పంచుతూ విరాళాలు సేకరించారు. ఈసందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కమటం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 1925 డిసెంబర్ 26న ఆవిర్భవించిన భారత కమ్యూనిస్టు పార్టీ, భారత గడ్డపై సిపిఐ 100 ఏళ్ళు పూర్తి చేసుకున్నదని తెలిపారు. భారతదేశానికి సంపూర్ణ స్వతంత్రం కావాలని తొలత గర్జించిన ఏకైక పార్టీ సిపిఐ అని, దేశ వ్యాప్తంగా ఉత్సవాలు ఉత్సాహభరితంగా జరుగుతున్నాయని తెలిపారు. ఆనాటి నుండి నేటి వరకు అనేక ప్రజా ఉద్యమాలు చేసి ప్రజల మన్ననలు పొందిన ఏకైక పార్టీ సిపిఐ అని స్పష్టం చేశారు. అశ్వాపురం మండలంలో ప్రజలంతా ఖమ్మంలో జరిగే బహిరంగ సభలో వేలాదిగా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.సిపిఐ మండల సహాయ కార్యదర్శులు కమటం వీరన్న, దంతాల జగదీష్, కమటం మనోజ్, బుర్రి దేవేందర్, కాశబోయిన నరేష్, పాల్గొన్నారు.

## కారేపల్లిలో పెద్ద ఎత్తున సిసి రోడ్లు



**ప్రజాపక్షం/కారేపల్లి:** కారేపల్లి గ్రామంలో సుమారు 2కోట్లతో సీసీ రోడ్లు వైరా ఎంఎల్ఏ రాందాస్‌నాయక్ మంజూరు చేయించారు. ఈసందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ఇమ్మడి తిరుపతిరావు సిసి రోడ్ల నిర్మాణ కాంట్రాక్టర్స్‌కి నాణ్యమైన రోడ్లు పోయాలని సూచించారు. అక్కడక్కడ వర్షపు నీరు వెళ్ళుటకు సిమెంట్ పైపులు వేయలని, కాంట్రాక్టర్స్‌కి తెలిపారు. రాబోయే కొద్ది రోజులలో మిగిలిన గల్లీలలో కూడా సీసీ రోడ్లు పోయిస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో ఇమ్మడి తిరుపతిరావుతో పాటు కాంగ్రెస్ నాయకులు తోగర శ్రీను పాల్గొన్నారు.

## ప్రభుత్వ వసతి గృహాల్లో మెనూ ప్రకారం భోజనం అందించాలి



**ప్రజాపక్షం/ములకలపల్లి:** ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని ఎస్ఎఫ్ఐ మండల నాయకులు ముదిగొండ ప్రశాంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని ఎస్సీ బాయ్స్ హాస్టళ్లను ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సందర్శించి, విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకొని విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ హాస్టళ్లలో నెలకొన్న విద్యార్థుల సమస్యలు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. హాస్టల్స్ విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టని అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు ఎటువంటి అనారోగ్యం ఇబ్బందులు ఎదురైనప్పుడు వార్డెన్ అందుబాటులో ఉండి విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. హాస్టల్స్‌ను ఎప్పటికప్పుడు జిల్లా స్థాయి అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. నాయకులు సంజయ్, రాము, సాగర్, సాయి, వినిత్, పాల్గొన్నారు.

## విద్యార్థులు సృజనాత్మక శక్తిని మరింత పెంచుకోవాలి



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** విద్యార్థులు వారిలో దాగున్న సృజనాత్మక శక్తిని మరింతగా పెంచుకోవాలని గ్రంధాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబు అన్నారు. గ్రంధాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారమైన మూడో రోజు విద్యార్థినీ విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ముఖ్యాతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ సెల్ ఫోన్లతో బిజీబిజీగా ఉండే ఈ రోజుల్లో పిల్లలు గ్రంధాలయాలపై మక్కువ చూపడం గర్వంగా ఉందన్నారు. నేటి బాల్యం సెల్‌ఫోన్‌కు బానిసై పోతోందని, తద్వారా అనేక సమస్యలు తలెత్తుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 200 మంది విద్యార్థులు చిత్రలేఖనం పోటీల్లో పాల్గొని పలు రకాల చిత్రాలను గీశారు. అనంతరం గ్రంధపాలకురా లు గుమ్మడి మణిమృదుల విద్యార్థుల ఉపాధ్యాయులు అందిస్తున్న ప్రోత్సాహం మరువలేనిదని, గ్రంథాల ద్వారా చక్కటి జ్ఞానాన్ని సంపాదించుకోవచ్చని, అంతా పిల్లలను ప్రో త్సహించాలని కోరారు. గ్రంధపాలకులు మధుబాబు, రుక్మిణితో పాటు ఉ పాధ్యాయులు సబిత, రమాదేవితో విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం



**ప్రజాపక్షం/పాల్వంచ :** ప్రమాదవశాత్తు తీవ్రంగా గాయపడిన కుటుంబానికి వర్తక సంఘం కన్వీనర్ చలవాది ప్రకాష్, మిత్రులు ఆదివారం ఆర్థిక సహాయం అందజేశారు. పాల్వంచ శ్రీనివాస కాలనీ సమీపంలోని బంజారా కాలనీకి చెందిన రఘునందన్ రోజువారీ కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో పనుల నిమిత్తం ఆయన భార్య నాగమణితో కలిసి పనుల కోసం వెళుతున్నారు. అజాగ్రత్త, అతివేగం వస్తున్న ఆటో వారిని బలంగా ఢీ కొట్టింది. దీంతో ఆ దంపతులకు బలమైన గాయాలు అయ్యాయి. భద్రాచలంకు చెందిన జయ ఆస్పత్రిలో వారికి ఉచిత వైద్యం జరుగుతుండగా ఖర్చుల నిమిత్తం రూ.15వేల నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో కొల్లు రాము, దారా నగేష్ పాల్గొన్నారు.

# ఆపదలో ఉన్నవారికి అండగా నిలవాలి

### అన్ని వర్గాలకు తోడుగా ఉండాలి

### వైరాలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**ప్రజాపక్షం/వైరా:** ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో కమ్మ జాతి ఔన్నత్యాన్ని చాటి చెప్పిన ఘనత మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. వైరా మున్సిపాలిటీ పరిధిలోని సోమవరం గ్రామ సమీపంలోని మామిడి తోటలో కమ్మజన సేవా సమితి ఆధ్వర్యంలో వన సమారాధన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ వనసమారాధన కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ కమ్మ కులస్థులు ఐక్యంగా ఉండి సమాజాభివృద్ధికి పాటుపడాలని కోరారు. కమ్మ కులస్థులు ఏ రంగంలో ఉన్న కమ్మ జాతి అభివృద్ధి కోసం పనిచేయాలని కోరారు. కమ్మజాతి ఔన్నత్యాన్ని చాటిచెప్పిన మహానుభావుడు మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు అని అన్నారు. తాతల తండ్రుల నాటి





నుంచి కమ్మ జాతికి గౌరవమైన పేరు ఉంది. గ్రామీణ ప్రాంతాల నుంచి రైతుగా కార్పొరేట్ వ్యవస్థల్లో సీఈవోలుగా పరిశ్రమలు స్థాపించి అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పించిన ఘనత కమ్మ కులస్తులదేనని అన్నారు. కమ్మ కులస్తులు ఇతర కులాల అన్ని వర్గాలను గౌరవించే విధంగా ఉండాలి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో తన హయంలోనే అన్ని రంగాల్లో అభివృద్ధి జరిగిదని అన్నారు. వైరా ప్రాజెక్టులకు సీతారామ ప్రాజెక్ట్ ద్వారా గోదావరి జలాలను అందించానని అన్నారు. జిల్లాలో గ్రీన్‌ఫీల్డ్ హైవే రహదారులు నిర్మించి జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, కట్టా కృష్ణార్జున్‌రావు, అడపా రామకోటయ్య, చింతనిప్పు రాంబాబు, సూర్యదేవర శ్రీధర్, ఏనుగు హనుమంతరావు, చెరుకూరి కిరణ్, కొల్లి రమేష్, పొదిలి హరినాధ్, కర్నాటి హనుమంతరావు, కొమ్మినేని అశోక్, పలువురు కమ్మజన సేవా సమితి సంఘం నాయకులు పాల్గొన్నారు.

## రాజీ మార్గమే రాజమార్గం..

### ప్రత్యేక లోక్‌అదాలత్‌లో 5838 కేసులు పరిష్కారం

**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** రాజీమార్గమే రాజమార్గమని.. లోక్ అదాలత్‌లో ఇరువర్గాలకు న్యాయం జరుగుతుందని పోలీసు కమిషనర్ సునిల్‌దత్ అన్నారు. అందుకు నిదర్శనం గత కొద్దిరోజులుగా జిల్లా న్యాయస్థానంలో నిర్వహించిన ప్రత్యేకలోక్‌అదాలత్ అని చెప్పవచ్చాన్నారు. శనివారం రాత్రి ముగిసిన లోక్‌అదాలత్‌లో జిల్లావ్యాప్తంగా 5838 కేసులు పరిష్కారామం అయ్యాయని ఆదివారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. దీనిపై కక్షిదారులో అవగాహన కల్పించడంతో ఎక్కువ సంఖ్యలో వారు న్యాయస్థానానికి హాజరై కేసులలో రాజీ కుదుర్చుకున్నారని పేర్కొన్నారు. సైబర్‌క్రైం కేసుల్లో 92 లక్షల రూపాయలకు పైగా రిఫండ్ మొత్తాన్ని బాధితులకు అందజేసినట్లు సిపి వివరించారు. పరిష్కారం అయిన వాటిలో ఎఫ్ఐఆర్ కేసులు 605, ఈ పెట్టి కేసులు 2583, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు 2650, సైబర్ కేసులు 195 ఉన్నాయని తెలిపారు. మొత్తం 5838 కేసుల ద్వారా రూ.92,45,636/ బాధితులకు అందజేసినట్లు పేర్కొన్నారు. అవగాహన కల్పించి కేసుల పరిష్కారానికి కృషిచేసిన పోలీసు అధికారులను, సిబ్బందిని పోలీసు కమిషనర్ సునిల్‌దత్ అభినందించారు. అదేవిధంగా లోక్ అదాలత్ సద్వినియోగానికి సహకరించిన న్యాయవాదులు, కక్షిదారులు, న్యాయసేవాధికారులకు ఆయన కృతజ్ఞాతలు తెలిపారు.

## ఇందిరమ్మ రాజ్యం పేదలకు వరం

### పేదల కల నెరవేర్చేది కాంగ్రెస్ ప్రభుత్వం

### రాష్ట్ర గృహ నిర్మాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** పేదల కలైన కూడు, గూడు అందించి పేదలకు వరాలిస్తున్న ఇందిరమ్మ రాజ్యం పేదలకు వరమన్నారు రాష్ట్ర రెవిన్యూ,గృహ నిర్మాణ, సమాచార శాఖామాత్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి. ఆదివారం పట్టణంలోని 11, 22, 23 వ వార్డుల్లో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డా.మట్టా దయానంద్ విజయ్ కుమార్ తో కలిసి మంత్రి పొంగులేటి శ్రీనన్న గృహ ప్రవేశాలు చేశారు. 11వ వార్డ్ వెంగళరావు నగర్ కాలనీలో ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు షేక్ చత్తాభి, 22 వ వార్డ్ నేతాజీ రోడ్ లో పాండే సత్యవతి, ఈశ్వరరావు, 23 వ వార్డ్ శ్రీనివాస్ టాకీస్ రోడ్ లో కొవ్వూరు వెంకటేశ్వరరావు, విజయలక్ష్మి ల ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమం లో పాల్గొన్నారు. అనంతరం మంత్రి పొంగులేటి మాట్లాడుతూ గత ప్రభుత్వం పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పేరుతో దగా చేసిందన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి ఇంటిలో సంతోషాలు వెల్లువిరుస్తున్నాయన్నారు. సత్తుపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్



దోమ ఆనంద్ బాబు, జాతీయ బీసీ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు నారాయణవరపు శ్రీనివాస్, సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాదె చెన్నారావు, సీనియర్ నాయకులు దొడ్డా శ్రీను, కమల్ పాషా, సుబ్బారెడ్డి, మాజీ కౌన్సిలర్స్ దూదిపాళ్ళ రాంబాబు, నాగుల్ మీరా, కంటే నాగలక్ష్మి, మాజీ కౌన్సిలర్స్, మహిళా, యూత్, ఎన్ఎస్ యూఐ నాయకులు పాల్గొన్నారు.

## అనధికార బట్టీల నిర్వహణ.. అటవీ భూమి ఆక్రమణ

### గుట్టలను మాయం చేస్తున్న యజమానులు

### చోద్యం చూస్తున్న అటవీ అధికారులు

**ప్రజాపక్షం/అశ్వాపురం:** అటవీ భూములు ప్రకృతి సంపద. జాతీ ఆస్తి అలాంటి భూమిని ఆక్రమి ంచిన వాళ్లు శిక్షార్హులవుతారని అటవీ అధికారులు అనడమే తప్ప చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. గుట్టలుగా ఉన్న భూమిని మాయం చేస్తున్న అటువైపు తిరిగి చూడని అటవీ యంత్రాంగం. అశ్వాపురం మండలంలో బట్టి యజమానులు అనధికారికంగా బట్టీలు నిర్వహిస్తూ అటవీ భూమిని ఆక్రమిస్తున్న అటవీ శాఖ అధికారులు చోద్యం చేస్తున్నారు. అటవీ భూమిని దోజర్లతో, ప్రోక్లైన్లుతో నెట్టి స్తూ ఆక్రమించుకుంటూ గుట్టలపై వలస ఆదివాసీలకు నివాసాలు ఏర్పాటు చేస్తూ ఇష్టం వచ్చిప రీతిలో దున్నేస్తున్నారు. మండలంలోని మొండికు ంట, గొంది గూడెం గ్రామ పంచాయితీలలో నిర్వహిస్తున్న బట్టీలకు వ్యవసాయ భూమి కాకుండా అటవీ భూమిని ఆక్రమిస్తూ బట్టీలు నిర్వహిస్తున్న కూడా అటవీ అధికారులు ఎందుకు అటువైపు చూడటం లేదో వారి మీద చర్యలు ఎందుకు తీసుకోవడం



లేదో తెలియాల్సి ఉంది. అటవీ భూమిని ఆక్రమించి బట్టీలు పెడుతూ చివరకు అడవిని మాయం చేస్తున్నారు. అటవీ అనుమతులు లేని కర్రను గుట్టలు గుట్టలుగా పేర్చుకుంటున్నారు. బట్టీలు కాల్చుటకు కర్రను సైతం వాడుతున్నారు. కర్ర ను వాడాలి అంటే వేలం పాటలో వచ్చిన అటవీ అనుమతులు కల్గిన కలపపై వాటి యొక్క గుర్తింపు తప్పని సరిగా కానీ ఇష్టారీతిగా కర్రను వాడుతూ వ్యాపారం చేస్తున్నారు. ప్రస్తుతం అటవీ ప్రాం తంలో పెట్టిన బట్టీలు అటవీ భూమి ఆక్రమణంలో ఎంత వరకు పోయిందో అటవీ అధికారులే లెక్క లు వేసుకోవాలి. అదే విధంగా మట్టిని సైతం కు ప్పలు కుప్పలుగా తెస్తూ అటవీ భూములలో ఉం చుతూ ఆ మట్టితో పాటు అటవీ భూమి మట్టిని కూడా తవ్వుతున్నారు. అనుమతులు లేకుండా ట్రాక్టర్లతో కుప్పలుగా పోయించుకుంటున్నారు. పర్యావరణానికి హానికరమైన బట్టీల నిర్వహణ, అదే విధంగా పర్యావరణానికి ఉపయోగపడే అడవిని అటవీ సంపదను కొల్లగొడుతున్నారు. ఇంత జరుగుతున్న అటవీ శాఖ ఇటు కన్నెత్తి చూడటం లేదంటే బట్టి యజమానుల వద్ద మామూలు గట్టిగానే తీసుకుంటున్నారనే ఆరోపణలు షికారులు అవుతున్నాయి. మామూలు అందాయనే ఉద్దేశంతోనే బట్టి యజమానులు అటవీ భూమిని ఇష్టానుసారంగా వాడుతున్నారా అనేది ప్రశ్నార్థకం. అటవీ భూములపై ఇష్టానుసార రీతిలో వ్యవహరిస్తున్న ఇటుక బట్టీల యజమానులపై అటవీ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యం



**ప్రజాపక్షం/ఇల్లందు:** తెలంగాణ రాష్ట్రంలో అబివృద్ధి సంక్షేమం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని తెలంగాణ రాష్ట్ర గృహ నిర్మాణ, రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం ఇల్లందు పట్టణంలో 2, 3, 5, 12, 13 వార్డులలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని శంకుస్థాపనలు చేశారు. ఇందిరమ్మ ప్రభుత్వంలో మొదటి దఫాలో తెలంగాణ రాష్ట్రంలో ఐదు లక్షల ఇండ్లను ప్రతి నియోజకవర్గంలో 3500 ఇండ్లకు శంకుస్థాపనలు జరిగాయని, అతి త్వరలో వాటి ప్రారంభం కూడా జరిగాయని అతి త్వరలో వాటి ప్రారంభం కూడా జరుగుతుందన్నారు.నూతన 100 పడకల వైద్యశాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్యే కోరం కనకయ్య, ఎస్పీ రోహిత్ రాజ్, ఆర్డీవో మధు, డిసిహెచ్ఎస్ రవి బాబు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ బానోత్ రాంబాబు, కాంగ్రెస్ నాయకులు మడుగు సాంబమూర్తి, దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, యదనపల్లి అనసూర్య, బోళ్ల సూర్యం, చిల్ల శ్రీనివాస్, దొడ్డా డానియల్, మండల రాము, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు దగా.. అధికారులు ధగ ధగ

**ప్రజాపక్షం/ఖమ్మం :** ప్రజల అవసరాలను నెరవేర్చే దిశగా ప్రభుత్వ కార్యాలయాలు పని చేయకపోగా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటున్నారు. ఒక్క రోజులో కావాల్సిన పని నెల రోజులు తిరిగినా కావటం లేదన్న ఆవేదన ప్రజల నుండి వ్యక్తమవుతుంది. కొందరు ప్రభుత్వ ఉద్యోగులు ప్రజల అవసరాలకు అనుగుణంగా స్పందిస్తున్నారు. మరి కొంత మంది ఎంతో కొంత ముట్టచెబితే తప్ప పనులు చేయటం లేదు. గ్రామ పంచాయతీలలో అనుమతులు పొందాలంటే గ్రామ పంచాయతీ అధికారులను ప్రసన్నం చేసుకోవాల్సిందే. మండల కేంద్రాలలో భవన నిర్మాణాలు చేపట్టాలంటే నిర్మాణదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. మామూళ్లు ముట్టజెప్పకపోతే నానా కొర్రీలు పెడుతూ ఏ పని ముందుకు సాగనీవ్వడం లేదు. మండల కార్యాలయాల్లో ప్రతి పనికి ఒక రేటు కట్టి వసూళ్లు చేస్తున్నారన్న ఆరోపణలు రోజు రోజుకు పెరుగుతున్నాయి. ముఖ్యంగా భూములకు సంబంధించి సమస్య పరిష్కారానికి పెద్ద మొత్తంలో వసూళ్లు జరుగుతున్నాయి. ఇందుకు సంబంధించి జిరాక్స్ కేంద్రాలు వసూళ్ల అడ్డాలుగా పని చేస్తుండటం గమనార్హం. మండల పరిషత్ కార్యాలయాల్లోనూ పరిస్థితి ఇందుకు భిన్నంగా లేదు. ఇటీవల కాలంలో వసూళ్లు చేస్తున్న శాఖల్లో విద్యుత్ శాఖ కూడా చేరింది. ఇటీవల కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి రోజు ఎక్కడో ఒక చోట అవినీతి నిరోధక శాఖాధికారులకు లంచం తీసుకుంటూ పట్టుబడుతూనే ఉన్నారు. దీనిపైన విమర్శ లేకపోలేదు. చిరుద్యోగులు మాత్రమే రూ.10 వేలు, రూ. 20 వేలు లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖాధికారులకు పట్టుబడుతున్నారని పెద్ద మొత్తంలో పుచ్చుకునే వారు ఇచ్చుకునే పని గుట్టు చప్పుడుకాకుండా జరుగుతుందన్న ఆరోపణలు వినవస్తున్నాయి. ఉన్నత స్థాయిలోనే ఈ మామూళ్ల వ్యవహారం నలుగుతుంది. ఏసిబికి పట్టుబడిన వారి విషయంలోనూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత కఠినంగా వ్యవహరించకపోతే భవిష్యత్తులో లంచగొండుల సంఖ్య మరింతగా పెరిగే అవకాశం ఉంది. పట్టుబడిన వారు కొద్ది రోజులకే తిరిగి ఉద్యోగాల్లో చేరుతుండటం కూడా అవినీతి అధికారులకు కొంత భరోసాగా ఉందన్న భావన ప్రజల్లో వ్యక్తమవుతుంది. ప్రభుత్వం ఏసిబికి పట్టుబడిన వారి పట్ల కఠినంగా వ్యవహరించాలి. అవినీతి అధికారుల విషయలో ఆయా సంఘాల నాయకుల పైరవీలకు పాలకులు తలొగ్గుతున్నారన్న ఆరోపణల నేపథ్యంలో కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఏర్పడింది. అవినీతి విషయంలో ఏ శాఖకు మినహాయింపు లేదని ఏ శాఖలోనైనా వసూళ్లు యథేచ్ఛగా జరుగుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. పోలీస్ స్టేషన్‌లో సెక్షన్ 307 కూడా ఇప్పుడు ఆదాయవనరుగా మారిందన్న ఆరోపణలు వినవస్తున్నాయి. పాలకులు మారినా ప్రజలు ఆశించిన స్థాయిలో ప్రభుత్వ కార్యాలయాల్లో మార్పులు జరగలేదని గతం మాదిరిగానే అధికార యంత్రాంగం వ్యవహరిస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### మారని తీరు, పైసలిస్తేనే కార్యాలయాల్లో పనులు

**ఆ ప్రభుత్వంలో అధికారుల పనితీరు సరిగ్గా లేదు. ప్రభుత్వం మారితే తప్ప అధికారుల్లో మార్పు రాదని ప్రజలు భావించారు. ఆ భావనకు అనుగుణంగానే 2023లో తీర్పు ఇచ్చారు. ప్రభుత్వ నిర్ణయాలు అమలు చేస్తున్న పథకాలు ఎలా ఉన్నా అధికారుల తీరు మాత్రం మారలేదు. కొందరికి మినహాయింపు ఉండి ఉండవచ్చు కానీ చాలా మంది తీరు మాత్రం యథాతథం. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రతి పనికి ఓ రేటు కట్టి వసూళ్లు చేస్తున్నారు. గ్రామ పంచాయతీల్లో అనుమతులు మొదలు అన్నింటికి లంచమే. అది ముట్టచెప్పకపోతే ఎన్ని నెలలు గడిచినా ఆ పని కాదు. పాలకులు మారితే అధికారుల తీరు మారుతుందని ఆశపడ్డ ప్రజలు మళ్లీ దగా పడగా పాలకులు ఎవరైతే ఏం అనుకుంటున్న అధికారలు మాత్రం దగదగలాడిపోతున్నారు. కొసమెరుపు ఏమిటంటే గతంలో లంచం అడగటానికి, తీసుకోవటానికి భయపడే వాళ్లు. ఆన్‌లైన్ పేమెంట్స్ పుణ్యమా అని ఆ భయాన్ని వదిలేశారు.**



# స్థానికం



REGIONAL NEWS

వరంగల్, హన్మకొండ, జనగాం, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మంత్రి సీతక్క, ఎమ్మెల్యే గండ్ర



ప్రజాపక్షం/భూపాలపల్లి : సీనియర్ జర్నలిస్టు కవి రచయిత, దివంగత సీనియర్ జర్నలిస్టు ముక్కెర రాఘవులు గౌడ్ ఏకైక కుమార్తె గౌతమి, వెంకటేశ్ ల వివాహ వేడుక భూపాలపల్లి మండలం మోరంచ పల్లి విజయ బాలాజీ గార్డెన్స్ లో జరుగగా రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. మంత్రితో పాటు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణ రెడ్డి, సిఐ నరేష్ కుమార్ గౌడ్, మధుర కవి, సత్య నారాయణ స్వామి, భాస్కర్, ఎస్ఐఈఏ,అశోక్ లు వివాహానికి హాజరై వధూ వరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.

## కార్తీక మాస మహా రుద్ర యాగం

ఏర్పాట్లను పరిశీలించిన పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి



ప్రజాపక్షం/పరకాల : పరకాల పట్టణ కేంద్రంలోని శ్రీ కుంకుమేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం నవంబర్ 17న తారీకు (సోమ వారం) నాడు నిర్వహించనున్న మహా రుద్ర యాగ ఏర్పాట్లను అధికారులతో కలిసి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...అధికారులు, నిర్వాహకులు, సేవా సంస్థల ప్రతినిధులతో ఏర్పాట్లపై సమీక్షించారు. అనంతరం యాగ శాల, భక్తుల వసతి, పార్కింగ్, తాగునీటి, ఫైర్ సేఫ్టీ,అన్నదానం,వంటి సదుపాయాలను సక్రమంగా ఏర్పాట్లు చేయాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం శ్రీ కుంకుమేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. అంతకుముందు బైక్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు.కావున భక్తులు అధిక సంఖ్యలో ఈ మహారుద్రయాగ మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

## దొడ్డి కొమురయ్య ఆశయ సాధనకు కృషి



ప్రజాపక్షం/బచ్చన్నపేట: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఉందని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సిహెచ్ రాజారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని చిన్న రామంచర్ల గ్రామంలో కురుమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని వారు కురుమ సంఘం జిల్లా రాష్ట్ర, జిల్లా నేతలు ఎగ్గె మల్లేశం, క్యామ మల్లేశం లతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం కేమిడి కనకరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో గుండెను ఎదురుగా పెట్టి పోరాడిన మహాయోధులు దొడ్డి కొమురయ్య అన్నారు. ఆయన ఆశయ సాధనకు అంకితభావంతో ముందుండి పోరాటాలు చేయాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. అనంతరం నేతలను కురుమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సంఘంలో యువజన కాంగ్రెస్ నాయకులు కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి కనకారెడ్డి, జనగామ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్, ఇతర పార్టీల నాయకులు రమణారెడ్డి, సిద్దిలింగం, సంపత్, మల్లా రెడ్డి, జంగిటి విద్యానాథ్, కావ్యశ్రీ రెడ్డి, వెంకటేశ్వర్లు, ఖలీల్ బేగం, బీరప్ప, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నూతన కార్యాలయం ప్రారంభించిన ఎమ్మెల్యే



ప్రజాపక్షం/పాలకుర్తి: మండల కేంద్రంలో నూతన కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సిరెడ్డిలు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాలకుర్తిలో కాంగ్రెస్ కుటుంబానికి కొత్త కార్యాలయం పార్టీ బలాన్ని మరింత పెంచుతుందన్నారు. ప్రతి కార్యకర్త ఈ కార్యాలయాన్ని ప్రజల సమస్యలు పరిష్కరించే కేంద్రంగా ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మార్కెట్ కమిటి చైర్ పర్సన్ మంజుల భాస్కర్, నాయకులు శ్రీనివాస్, మహేందర్ రెడ్డి, నాగయ్య, భార్గవ్, భాస్కర్, కుమార్, యాకయ్య, దేవేందర్, సోమేశ్వర్, అశోక్‌రెడ్డి,రమేష్, చంద్రయ్య, రవి, తదితరులు పాల్గొన్నారు.

**లయన్స్‌క్లబ్ సేవలు అభినందనీయం**

లయన్స్‌క్లబ్ సేవా కార్యక్రమాలు అభినందనీయమని, మరిన్ని సేవా కార్యక్రమాలు చేయలని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో విరాళంగా అందించిన కుర్చీలను ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సిరెడ్డిలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రంలో వైద్యం కోసం వచ్చే ప్రజలు సేద తీరేందుకు లయన్స్‌క్లబ్ కుర్చీలను అందించడం అభినందనీయమన్నారు. లయన్స్‌క్లబ్‌లు ఎల్లప్పుడు ఉదాహరణగా నిలిచే సేవా కార్యక్రమాలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు ప్రసాద్, కార్యదర్శి కృపాకర్, వైద్యాధికారి సిద్దార్థరెడ్డి, లయన్స్ బాధ్యులు రాఘవరావు, వెంకన్న, సంతోష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సత్యనారాయణ, రమేష్, రవీందర్, అబ్బాస్, అలీ, సారంగపాణి, సోమేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యానికి అద్దం మిడియా!

ప్రజాపక్షం/నెక్కొండ: జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా కాంగ్రెస్, బిఆర్ఎస్, సిపిఐ సహా అనేక ప్రజా, కార్మిక, సామాజిక వర్గాల నాయకులు పాత్రికేయులకు తమ శుభాకాంక్షలు తెలిపారు. సత్యాన్ని నిలబెట్టే శక్తి కలాం అంటూ, నిజం పక్షాన నిలిచి ప్రజల సమస్యలను నిర్భయంగాద బయటపెట్టే విలేకరుల ధైర్యమే ప్రజాస్వామ్యానికి మూల స్తంభమని నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆయుధంతో కొడితే గాయం మాత్రమే వస్తుంది. కానీ అక్షరంతో కొడితే చరిత్ర రూపాంతరం చెందుతుంది. మైదానాల్లో కష్టాల్లో, ప్రమాదాల్లో ఋతువులోనైనా ప్రజల కోసం పరుగులు తీసే పాత్రికేయ మిత్రుల సేవ అపూర్వమైందని కొనియాడారు. ప్రజా సమస్యలను రాంత్రిబవళ్లు కవర్ చేస్తూ సంఘటనల మధ్య జరిగే ఒత్తిడి జీతభత్యాల లోపం, స్తోమతల లేమి, కార్పొరేట్ ఒత్తిళ్లు, రాజకీయ ఆంక్షలు వీటన్నింటిని ఎదుర్కొంటూ నిజాన్ని నిలబెట్టడం పాత్రికేయుల మహత్తర సేవ అని పలు వర్గాల నాయకులు అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ నేతలు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, రావుల హరీష్ రెడ్డి, బక్కి అశోక్, పెండ్యాల హరిప్రసాద్, కుసుమ చెన్నకేశవులు అభినందనలు తెలిపారు. జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా విలేకరులను ప్రజల స్వరం సామాన్యుడి అండ అని ఏఐటియూసి జిల్లా అధ్యక్షుడు కందిక చెన్నకేశవులు, బిఆర్ఎస్ నేతలు కొమ్ము రమేష్ యాదవ్, మరాం రాము, బిజెపి అశోక్, అంబల రాంగోపాల్‌లు పేర్కొన్నారు. ప్రభుత్వ లోపాలను చూపించడంలో మీడియా కీలకపాత్ర పోషిస్తుందని అభినందించారు.

# మత్స్యకారుల సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

ధర్మసాగర్ రిజర్వాయర్‌లో ఉచిత చేప పిల్లలను వదిలిన మంత్రి వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే కడియం కలెక్టర్ స్నేహ శబరిష్





ప్రజాపక్షం/ధర్మసాగర్ : మత్స్యకారుల సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్య,డైరీ అభివృద్ధి, క్రీడలు, యువజన శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు.మత్స్యకారులకు 100 శాతం రాయితీతో చేపలు పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం హన్మకొండ జిల్లా ధర్మసాగర్ మండల కేంద్రంలోని ధర్మసాగర్ రిజర్వాయర్ లో శాసన సభ్యులు కడియం శ్రీహరి,రాష్ట్ర మత్స్య శాఖ చైర్మన్ సాయికుమార్, రాష్ట్ర తెలంగాణ ముదిరాజ్ కోఆపరేటివ్ సొసైటీ కార్పొరేషన్ చైర్మన్ బొర్రాజ్ఞానేశ్వర్,తెలంగాణ రాష్ట్ర క్రీడల ప్రాధికారిక సంస్థ చైర్మన్ శివసేనారెడ్డి, రాష్ట్ర మత్స శాఖ సంచాలకులు నిఖిల, జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్, లతో కలసి మంత్రి వాకిటి శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరై 12 లక్షల చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధి, ఉపాధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని తెలిపారు.మత్స్య కారుల సంక్షేమమే ధ్యేయంగా ఈ సంవత్సరం రాష్ట్ర వ్యాప్తంగా 26 వేల చెరువుల్లో 84 కోట్ల చేప పిల్లులు, 10 కోట్ల రొయ్య పిల్లలు వదలేందుకు ప్రణాళికలు సిద్దం చేసినట్లు పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. చేప పిల్లల పంపినీ పారదర్శకంగా ఉండేలా చెరువుల వద్ద సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మత్స్య సంపద మరింత అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మత్స్య శాఖకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ.123 కోట్లు కేటాయించారని తెలిపారు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో చేప పిల్లల, రొయ్యల ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు చేస్తామని చేస్తానని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. తెలంగాణ బ్రాండ్ ఇమేజ్ పెరిగేలా చర్యలు తీసుకొంటున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో మత్స్య పరిశ్రమపై ఆధారపడ్డ మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధి, ఉపాధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని తెలిపారు. ధర్మసాగర్ చెరువు రిజర్వాయర్ లా కాకుండా పర్యాటక కేంద్రంగా చేపల రకాలను బట్టి ఏ చేపలను ఏ నిష్పత్తిలో విడుదల చేయాలో అదే విధంగా రాష్ట్ర వ్యాప్తంగా విడుదల చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా రొయ్య పిల్లల పెంపకానికి కృషి చేస్తామని, మత్స్యకారులు జీవితాలు బాగుపడేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.మత్స్యకారులు తమ పిల్లలకు మెరుగైన విద్యను అందించాలని, పిల్లలలకు మంచి విద్యాబుద్ధులు చెప్పించాలని సూచించారు. విద్యతోనే మంచి స్థాయికి చేరుకుంటామని అన్నారు.చేప పిల్లల పంపిణీ పారదర్శకంగా జరిగేలా ఏ చేప దాని సైజ్ అవి ఎన్ని చేప పిల్లలు అని తెలిపేలా చెరువుల వద్ద సైన్ బోర్డులు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. మత్స్య సంపదపై రాష్ట్రంలో 5 లక్షల మంది మత్స్య కారుల కుటుంబాలు ఆధారపడి ఉన్నాయని వారి అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. మత్స్య కారులకు కోటి 40లక్షలతో బీమా ప్రభుత్వం చెల్లించినట్లు తెలిపారు. మత్స్య సహకార సంఘంలో 560 మంది వరకు సభ్యులు ఉన్నారని, ఇంకా 160 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. చేపల ఉత్పత్తి లో దేవాదుల ఎత్తిపోతల పథకం కింద 7 రిజర్వాయర్లు ఉన్నాయని, దాదాపు 7 రిజర్వాయర్ లో కూడా 365 రోజులు నీళ్లుంటాయి.. చేపల పెంపకానికి ఇవన్నీ చాలా అనువైన రిజర్వాయర్లు అని, ఒక్కొక్క రిజర్వాయర్లో 12 లక్షలు, పెంచే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యశాఖ సంచాలకులు నిఖిల, హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, శ్రీనివాస్, డీడి హనుమంతరావు, శ్రీపతి, మల్లేశం, సోమయ్య, సదానందం, అనిల్ కుమార్ మత్స్య సహకార సంఘాల సభ్యులు, పాల్గొన్నారు.

## హాస్టల్‌లో కనీస సౌకర్యాల లేమిపై విద్యార్థినుల ఆందోళన



ప్రజాపక్షం/వెంకటాపూర్ : మండలంలోని జవహర్ నగర్ మోడల్ స్కూల్ హాస్టల్లో నెలకొన్న అనేక సమస్యలపై విద్యార్థినులు శనివారం ఆందోళనకు దిగారు. మొత్తం 73 మంది విద్యార్థినులకు కేవలం మూడు బాత్రూంలు మాత్రమే అందుబాటులో ఉండడం, మిగతా బాత్రూంలు డోర్లు లేక రిపేరింగ్ పేరుతో నెలల తరబడి వాడుకలో లేకపోవడం తీవ్ర అసౌకర్యాలకు దారి తీస్తోందని వారు తెలిపారు. హాస్టల్‌కి సెక్యూరిటీ లేకపోవడం, గత నాలుగు నెలలుగా ఏఎన్ఎం అందుబాటులో లేకపోవడం తమ భద్రత, ఆరోగ్యంపై ప్రభావం చూపుతోందని విద్యార్థినులు వాపోయారు. హాస్టల్ పరిసరాల్లో లైట్లు లేక రాత్రివేళల్లో భయంతో గడపాల్సి వస్తోందని తెలిపారు. తాగునీటి సమస్య కూడా తీవ్రమైందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. హాస్టల్లో మెనూ ప్రకారం ఆహారం అందించడం లేదని, నాణ్యత తగ్గిపోయిందని విద్యార్థినులు ఆరోపించారు. ముఖ్యంగా నా న్ వెజ్ రోజున 73 మందికి రెండున్నర కిలోల మాంసం మాత్రమే తీసుకొచ్చిన సంఘటన తమకు తీవ్ర నిరాశ కలిగించిందని పేర్కొన్నారు. "ఈరోజు తెచ్చింది మీకే కనిపిస్తోందిని, రోజూ ఇదే పరిస్థితి ఉంటుంది" అంటూ వారు అసంతృప్తి వ్యక్తం చేశారు. తక్షణమే అన్ని సమస్యలను పరిష్కరించి హాస్టల్‌ను సక్రమంగా నిర్వహిం చాలని విద్యార్థినులు అధికారులను కోరుతున్నామన్నారు. విషయం తెలుసుకున్న డీఈవో హాస్టల్‌కు చేరుకొని విద్యార్థులు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పరిస్థితులను పరిశీలించి తక్షణమే చర్యలు తీసుకుంటామని విద్యార్థులకు హామీ ఇచ్చారు.

## మంత్రిని కలిసిన ఇవి శ్రీనివాసరావు



ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ : రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్య,డైరీ అభివృద్ధి, క్రీడలు, యువజన శాఖ మంత్రి వాకిటి శ్రీహరి హనుమకొండకు వచ్చిన సందర్భంగా రోడ్లు, భవనాల గెస్ట్ హౌస్‌లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఇ.వి. శ్రీనివాస్ రావు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు.ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఈవి. శ్రీనివాస్ రావు ను శాలువాతో సత్కరించారు.

## అమాత్యుల సహకారంతో జిల్లా అభివృద్ధి పుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం

మంత్రి సీతక్క



ప్రజాపక్షం/ములుగు:జిల్లా సమీపంలోని గట్టమ్మ గుట్ట వద్ద నిర్మించనున్న పుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణంతో భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేద తీరే అవకాశం ఉందని, తల్లికి తలవంచందే భక్తులు ముందు కదగలరని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని గట్టమ్మ తల్లి దేవాలయం వద్ద రూ.45లక్షలతో నిర్మించ తలపెట్టిన బ్రిడ్జి నిర్మాణ పనులను కలెక్టర్ దివాకర్ టిఎస్ గ్రంథాలయ చైర్మన్ బానోత్ రవిచందర్‌లతో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాటాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు బట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సహకారంతో జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నానని, దీనిలో భాగంగా అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని వివరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతలకు వెళ్లే భక్తులు, పర్యాటకులు ముందుగా గట్టమ్మ తల్లిని దర్శించుకున్న అనంతరమే ముందుకు సాగుతారని, జాతీయ రహదారి ఆనుకొని ఉన్న గట్టమ్మతల్లి ఆలయం వద్ద అన్ని సౌకర్యాలు కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. గట్టమ్మ తల్లిని దర్శించుకున్న అనంతరం భక్తులు సేద తీర్చడానికే అనేక స్థలాలు ఉన్నాయని, నూతనంగా నిర్మిస్తున్న బ్రిడ్జికి నిధులు సరిపోను పక్షంలో అదనపు నిధులు కేటాయించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్అండ్‌బి శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యతతో రోడ్ల విస్తరణ పనులు పూర్తి

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



ప్రజాపక్షం/భూపాలపల్లి : మేడారం మహా జాతరకు వచ్చే భక్తుల కోసం సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించిందని, డిసెంబర్ 31 వరకు రోడ్ల పునరుద్ధరణ విస్తరణ పనులు నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆదివారం భూపాలపల్లి నియోజకవర్గం భూపాలపల్లి మండలం కమలాపూర్ క్రాస్ రోడ్డు వద్ద రోడ్ల విస్తరణ, పునరుద్ధరణ పనులకు రూ.25 కోట్లతో కమలాపూర్ నుండి ములుగు జిల్లా తాడ్వాయి నార్లపురం వరకు రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రపంచ ప్రసిద్ధ గిరిజన మేడారం సమ్మక్క సారక్క జాతర సమీపిస్తున్న నేపథ్యంలో, జాతరకు వెళ్లే మార్గాలలో ఎక్కడా రోడ్ల కారణంగా ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా చూడటమే సీఎం ప్రజా ప్రభుత్వ లక్ష్యమన్నారు. అందుకనుగుణంగా ఈ మార్గాలల్లో బీటీ రోడ్ల విస్తరణ, పునరుద్ధరణ, మరమ్మత్తులు పనులను వేగంగా పూర్తి చేసి, మేడారం జాతర ప్రారంభం నాటికి అన్ని రహదారులను పూర్తిస్థాయిలో సిద్ధం చేస్తామన్నారు. సదరు కాంట్రాక్టర్లు పనులు ఆలస్యం చేయకుండా, నాణ్యత విషయంలో రాజీపడకుండా, నిర్దిష్ట గడువులోపు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్టిఏ మెంబర్ సుంకరి రామచంద్రయ్య, రోడ్లు, భవనాల శాఖ ఈఈ రమేష్, ఎంపీడీవో తరుణ్ ప్రసాద్, కాంగ్రెస్ నాయకులు పిప్పాల రాజేందర్,అంబాల శ్రీనివాస్, దాట్ల శ్రీనివాస్, సంతోష్ అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అంచలంచలుగా మానుకోట అభివృద్ధి



ఎమ్మెల్యే డా.భూక్యా మురళీ నాయక్

ప్రజాపక్షం/మహబూబాబాద్: అంచలంచలుగా మానుకోటను అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే డా.భూక్యా మురళీ నాయక్ అన్నారు. మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలో ఆర్టీసీ కాలనీలో ఎస్‌డిఎఫ్ నిధులతో మంజూరైన రూ. 5లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్లనిర్మాణ పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పార్టీలకు అతీతంగా అభివృద్దే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ అభివృద్ధి పనుల్లో భాగస్వాములు కావాలని కోరారు. ప్రజా ప్రభుత్వంలో ప్రజల నిర్ణయాలకే అధిక ప్రాధాన్యతని, అన్ని రకాలుగా అభివృద్ధి చేయడమే తమలక్షమని ఎమ్మెల్యే డా.మురళీ నాయక్ గారు అన్నారు. నిర్ణీత కాలంలో నిర్మాణ పనులను పూర్తి చేయాలని, నిర్మాణంలో కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. వార్డుల సమస్యలు తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని అందుకు ప్రజలు సహకరించాలని తెలిపారు.

## 5లక్షల మందితో భారీ బహిరంగ సభ



ప్రజాపక్షం/జఫర్‌గడ్: సీపీఐ 100 సంవత్సరాల ముగింపు బహిరంగ సభను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, మండల కార్యదర్శి జువారి రమేష్ అన్నారు. ఆదివారం వారు మాట్లాడుతూ సీపీఐ పార్టీ వంద సంవత్సరాల ఉత్సవాలను డిసెంబర్ 26వ తేదీన ఖమ్మం పట్టణంలో 5లక్షల మందిచే భారీ బహిరంగ సభను ఏర్పాటుచేయడం సభకు వేలాదిగా తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి సమ్మయ్య, రైతు సంఘం మండల అధ్యక్షుడు యాకూబ్ పాషా, నాయకులు బుచ్చయ్య, రమేష్, సాయిలు, సమ్మయ్య, ప్రభాకర్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

# పద్మశాలి కార్తీక మాస వన భోజన మహోత్సవం

పాల్గొన్న మంత్రి కొండా సురేఖ



ప్రజాపక్షం/ఖిలావరంగల్: ఖిలా వరంగల్‌లోని చింతల్ గ్రౌండ్‌లో పద్మశాలి కార్తీక వన భోజన మహోత్సవానికి అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మేయర్ గుండు సుధారాణి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రికి వేదపండితులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమ నిర్వాహకులు, ప్రజలు మంత్రిని సాదరంగా ఆహ్వానించారు. ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం మంతిర కొండా సురేఖను నిర్వాహకులు శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందించారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. పూర్వీకులు మన ప్రయోజనాలను కోరి అనేక ఆచారాలను, సాంప్రదాయాలను ఏర్పర్చారని, సామూహిక జీవన విధానాన్ని అలవాటు చేసే వన భోజన కార్యక్రమం అలాంటిదన్నారు. వన భోజనాలకు వచ్చిన వారికి పేరు పేరున మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. సత్సంబంధాలు పెరిగి ఉన్నతంగా ఎదగడానికి తోడ్పడతుందని మంత్రి తెలిపారు. తనను ఈ కార్యక్రమానికి ఆహ్వానించిన నిర్వాహకులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణి ప్రభాకర్, మల్లేశం, సమ్మయ్య,రవీందర్, రవీందర్,సతీష్ బాబు, డీఎస్ మూర్తి, రాజు, అశోక్‌బాబు, బైరి శ్యాంసుందర్, బొమ్మ శ్రీనివాస్, మార్కండేయ పురోహితులు పాల్గొన్నారు.

### లోక కల్యాణం కోసమే గాయత్రి మహా యజ్ఞ హోమాలు: మంత్రి కొండా సురేఖ

అఖిల విశ్వ గాయత్రి పరివార్, గాయత్రీ తీర్థ్ శాంతి కుంజ్ హరిద్వార్ ఆధ్వర్యంలో ఈనెల 15, 16న 108 కుండముల గాయత్రి మహా యజ్ఞం ఘనంగా నిర్వహించినట్లు గాయత్రి పరివార్ వరంగల్ నిర్వాహకులు వనమా సురేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శనివారం పోతన విజ్ఞాన పీఠం నుంచి హంటర్ రోడ్డులోని యజ్ఞశాల వరకు కలశ యాత్ర, 16న 108 కుండములతో గాయత్రి మహా యజ్ఞం హంటర్ రోడ్డులోని గ్రీన్ వుడ్ స్కూల్ వెనుక బీఎస్కే గ్రౌండ్‌లో నిర్వహించినట్లు తెలిపారు. ఈ వేడుకకు హరిద్వార్ నుంచి 12 మంది పండితులు హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై ఈ మహా యజ్ఞం విజయవంతం చేసినట్లు తెలిపారు. అనంతరం రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ హాజరై మాట్లాడారు. రాత్రి 7 గంటలకు ఆకుతోట బాలకొమురెల్లి, మాటేటి సత్యనారాయణ, బత్తుల రాజేందర్ 47వ వారం శ్రీరామ దూత హనుమాన్ చాలీసా 11 సార్లు పారాయణం చేశారు. ఈ కార్యక్రమంలో జెన్ శర్మ, మార్గం సదానందం, ఎర్రం మనోహర్, పరిపూర్ణాచారి, డాక్టర్ జతాధర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక లోక్ అదాలత్ ద్వారా 5025 కేసులు పరిష్కారం: సిపి

ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్: వరంగల్ పోలీస్ కమిషనరేట్ వ్యాప్తంగా ప్రత్యేక లోక్ అదాలత్ కు విశేష స్పందన లభించిందని, వీటి ద్వారా 5025 కేసులు పరిష్కారమయ్యాయని, సైబర్ క్రైమ్ కేసుల్లో 89 లక్షలకు పైగా రిఫండ్ మొత్తాన్ని బాధితులకు అందజేయాల్సిందిగా కోర్టు ఉత్తర్వులు జారీ వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు.ఈ ప్రత్యేక లోక్ అదాలత్ ద్వారా రాజీకి అవకాశం ఉండి పరిష్కరించిన మొత్తం కేసుల్లో కేసుల్లో ఎ ఫ్ఐఆర్ కేసులు 1011, ఈ పెట్టి కేసులు 1281, డ్రంకెన్ అండ్ డ్రైవ్, మో టార్ వెహికల్ చట్టం కేసులు2533, సైబర్ కేసులు 200 పరిష్కరించడం ద్వారా బాధితులకు సంబంధించి వివిధ బ్యాంక్ ఖాతాల్లో నిలుపుదల చేసిన 89,43,506 రూపాయలు బాధితులకు అందజేశాల్సిందిగా కోర్టు ఉత్తర్వులు వెలుబడించిందని తెలిపారు.రాజీ మార్గం రాజ మార్గమని, లోక్ అదాలత్ ద్వారా ఇరు వర్గాలకు న్యాయం జరుగుతుందని అవగాహన కల్పించి కేసుల పరిష్కారానికి కృషి చేసిన పోలీస్ అధికారులను, సిబ్బంది పోలీస్ కమిషనర్ అభినందించారు. అదేవిధంగా లోక్ అదాలత్ సద్వినియోగం సహకరించిన న్యాయవాదులు, కక్షిదారులు, న్యాయసేవాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.






ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో నిర్మిస్తున్న రాజా సాబ్ సినిమా విడుదలకు ముస్తాబవుతోంది. ఈ సినిమాకు తమన్ సంగీతం అందిస్తున్నారు. తమన్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని రాజా సాబ్ సినిమా టీమ్ తమన్ పోస్టర్‌ను విడుదల చేసింది. ప్రస్తుతం రాజా సాబ్ సినిమాకు సంబంధించి తమన్ రీ రికార్డింగ్ పనుల్లో బిజిగా

## రాజాసాబ్ నుంచి తమన్ పోస్టర్ విడుదల

ఉన్నారు. ఇందులో ప్రభాస్ సరసన నిధి అగర్వాల్‌తో పాటు మాళవిక మోహన్ హీరోయిన్ గా నటిస్తోంది. క్రైం హారర్ సస్పెన్స్ ఎంటర్ టైన్మెంట్ ప్రధానంగా దర్శకుడు మారుతి ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. రీరికార్డింగ్‌కు బాగా స్కోప్ ఉన్న ఈ సినిమాను సంక్రాంతి పండుగ సందర్భంగా జనవరి 9న విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నామని నిర్మాత, పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ అధినేత టీజీ విశ్వ ప్రసాద్ తెలిపారు. బాలీవుడ్ నటుడు బొమ్మన్ ఇరాని ఓ కీలక పాత్రలో కనిపిస్తారు. సంజయ్ దత్ విలన్‌గా నటించారు. రిధి కుమార్ మరో కీలకమైన పాత్రను పోషిస్తున్నారు. ఈ చిత్రానికి నిర్మాతలు క్రితి ప్రసాద్, టీజి విశ్వ ప్రసాద్.

## 'ఏమైపోతుందో' పాట ఆవిష్కరణ



బేబీ చైత్ర శ్రీ బాదర్ల, మాస్టర్ యువ్వాంశ్ కృష్ణ బాదర్ల సమర్పణలో ధనలక్ష్మి బాదర్ల నిర్మాతగా మాస్టర్ మహేంద్రన్ హీరోగా వైకుంఠ్ బోను తెరకెక్కించిన చిత్రం 'వసుదేవసుతం'. రెయిన్బో సినిమాస్ బ్యాన్న ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి రిలీజ్ చేసిన పోస్టర్లు, మోషన్ పోస్టర్, గ్లింప్స్, టీజర్ అందరినీ ఆకట్టుకున్న సంగతి తెలిసిందే. ఇక రీసెంట్‌గా ఈ చిత్రం నుంచి హీరో ఆకాష్ జగన్నాథ్ రిలీజ్ చేసిన టైటిల్ సాంగ్ అందరినీ ఆకట్టుకుంది. ఇక ఇప్పుడు మరో మెలోడీ గీతాన్ని ఆస్కార్ అవార్డు గ్రహీత చంద్రబోస్ రిలీజ్ చేశారు. ఏమైపోతుందో' అంటూ సాగే ఈ పాటకు మంచి మెలోడీ ట్యూన్ను అందించారు మెలోడీ బ్రహ్మ మణిశర్మ. శ్రీ హర్ష ఈమని అందించిన సాహిత్యం, పవన్‌శృతిక సముద్రాల గాత్రం అందరినీ కట్టి పడేసేలా ఉంది. ఈ లిరికల్ వీడియోలో హీరో హీరోయిన్ మధ్య కెమిస్ట్రీ, వారి లవ్ ట్రాక్ను అందంగా చూపించారు. ఇక లొకేషన్స్ కూడా ఎంతో సహజంగా కనిపిస్తున్నాయి. గాల్లో తేలిపోతోన్న ప్రేమికులు పాడుకునే పాటలా ఈ మెలోడీని తీర్చి దిద్దారు.పాటను రిలీజ్ చేసిన అనంతరం చంద్రబోస్ మాట్లాడుతూ..వసుదేవసుతం'లోని 'ఏమైపోతుందో' అనే ఈ పాట చాలా బాగుంది. మెలోడీ బ్రహ్మ మణిశర్మ మంచి ట్యూన్ను ఇచ్చారు. సాహిత్యం కూడా చాలా బాగుంది. చిత్రయూనిట్‌కు ఆల్ ది బెస్ట్. సినిమా పెద్ద సక్సెస్ అవ్వాలని కోరుకుంటున్నాను' అని అన్నారు. రిలీజ్ డేట్‌కు సంబంధించిన వివరాల్ని త్వరలోనే చిత్రయూనిట్ ప్రకటించనుంది.



## 'వారణాసి' నా డ్రీమ్

### మహేష్ బాబు

### గూజ్ బంప్స్ వచ్చాయి : రాజమౌళి

సూపర్‌స్టార్ మహేష్ హీరోగా దర్శకధీరుడు రాజమౌళి దర్శకత్వంలో రూపొందుతోన్న భారీ చిత్రం 'వారణాసి'. శ్రీ దుర్గా ఆర్ట్స్, షోయింగ్ బిజినెస్ బ్యానర్లపై కేఎల్ నారాయణ, ఎస్ఎస్ కార్తికేయ నిర్మిస్తోన్న చిత్రానికి 'వారణాసి' అనే టైటిల్‌ను ఫిక్స్ చేశారు. ఈ చిత్రంలో పృథ్వీరాజ్ సుకుమారన్, ప్రియాంక చోప్రా కీలక పాత్రల్ని పోషిస్తున్నారు. ఈ మేరకు గ్లోబ్ ట్రాటర్ అంటూ గ్రాండ్ ఈవెంట్ నిర్వహించిన చిత్రయూనిట్ ఈ కార్యక్రమంలోనే టైటిల్‌ను, హీరో ఫస్ట్ లుక్ పోస్టర్‌ను, సినిమా స్థాయిని చాటేలా ఓ టీజర్ (వారణాసి టు ద వరల్డ్)ను కూడా రిలీజ్ చేశారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో బజ్ క్రియేట్ చేసిన ఈ కార్యక్రమంలో ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేష్ బాబు మాట్లాడుతూ.. 'వారణాసి' నా డ్రీమ్ ప్రాజెక్ట్. ఇలాంటి అవకాశం జీవితంలో ఒకసారి మాత్రమే వస్తుంది. అందరినీ గర్వపడేలా చేస్తాను. ముఖ్యంగా నా దర్శకుడ్ని గర్వపడేలా చేస్తాను. ఈ చిత్రం రిలీజ్ అయినప్పుడు మన భారతీయులందరూ గర్వపడతారు. ఇది కేవలం టైటిల్ అనౌన్స్‌మెంట్ మాత్రమే. ముందు ముందు ఎలా ఉండబోతోందో మీ ఊహకే వదిలేస్తున్నాను. అభిమానుల ప్రేమ, సపోర్ట్ ఎప్పుడూ ఇలానే ఉండాలని కోరుకుంటున్నాను. మీ ప్రేమకు నేను ఏమిచ్చినా రుణం తీర్చుకోలేను. మీ అందరికీ నేను చేతులెత్తి దండం పెడతాను, నాకు అది మాత్రమే తెలుసు. ఈ ఈవెంట్‌ను మేమెంతో కష్టపడి మీ కోసం ఏర్పాటు చేశాం అని అన్నారు. దర్శకధీరుడు ఎస్.ఎస్.రాజమౌళి మాట్లాడుతూ నాకు రామాయణం, మహాభారతం అన్నా చాలా ఇష్టం. మహాభారతం తీయాలనేది నా డ్రీమ్ అని చాలా సార్లు చెప్పాను. ఈ మూవీని మొదలు పెట్టినప్పుడు రామాయణంలోని ఓ ముఖ్యమైన ఘట్టాన్ని తీస్తానని నేను అనుకోలేదు. కానీ ఒక్కో సీన్ రాస్తుంటే.. ఒక్కో డైలాగ్ వస్తుంటే.. పాటిని ఊహించుకుంటూ ఉంటే.. నేల మీద కాకుండా గాల్లో విహరిస్తున్నట్టుగా అనిపించింది. మహేష్ బాబుని రాముడి గెటప్‌లో ఫోటో షూట్ చేస్తుంటే రోమాలు నిక్కబొడుచుకున్నాయి. ఈ మూవీని త్వరలోనే ఆడియెన్స్ ముందుకు తీసుకు వచ్చే ప్రయత్నం చేస్తామని అన్నారు.

ప్రియాంక చోప్రా మాట్లాడుతూ 'వారణాసి' చిత్రంలో నాకు అవకాశం ఇచ్చిన రాజమౌళికి, నన్ను నమ్మిన నా నిర్మాత కేఎల్ నారాయణకి థాంక్స్. మహేష్ బాబు చాలా మంచి వ్యక్తి. ఆయన అద్భుతమైన నటుడు. నమ్రత, సితార వల్ల హైదరాబాద్ నాకు సొంత ఇంటిలా మారిపోయింది. వారంతా నన్ను ఎంతో బాగా చూసుకుంటున్నారు. పృథ్వీరాజ్ ఇందులోని పాత్రతో అందరినీ చాలా భయపెడతారు. కానీ బయట మాత్రం పృథ్వీరాజ్ చాలా మంచి వ్యక్తి. ఈ చిత్రం పూర్తయ్యేలోపు నేను పూర్తిగా తెలుగు నేర్చుకుని, తెలుగులోనే స్పీచ్ ఇస్తాను అని అన్నారు. ఆస్కార్ విన్నింగ్ మ్యూజిక్ డైరెక్టర్ ఎం.ఎం కీరవాణి మాట్లాడుతూ మహేష్ బాబు, మణి శర్మ కాంబోలో వచ్చిన 'పోకిరి' అంటే నాకు చాలా ఇష్టం. నేను క్లాస్ ట్యూన్స్ మాత్రమే ఇస్తానని, మాస్ బీట్స్ ఇవ్వలేని వాడ్ని అని కొంత మంది అంటుంటారు. కానీ ఈ సారి 'వారణాసి'లో బీట్స్ చూస్తారు. క్లాస్ నాదే.. బీట్స్ నాదే.. ఆ బీట్స్‌తో మహేష్ బాబు అభిమానుల గుండెల్లో చిరస్థానం దక్కుతుంది అని అన్నారు. నిర్మాత కేఎల్ నారాయణ మాట్లాడుతూ 'పదిహేనేళ్ల క్రితం నేను మహేష్ బాబు వద్దకు వెళ్లి రాజమౌళితో సినిమా చేద్దామా? అని అడిగాను. ఆయన వెంటనే ఓకే అన్నారు.




## 18న కర్నూలులో ఆంధ్రాకింగ్ తాలూకా ఈవెంట్

రామ్ పోతినేని హీరోగా, భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా మహేష్ దర్శకత్వంలో నిర్మిస్తున్న సినిమా ఆంధ్రా కింగ్ తాలుకా. ఈ సినిమా ట్రైలర్ ను ఈనెల 18వ తేదిన కర్నూలులో విడుదల చేయనున్నారు. ట్రైలర్ ఆవిష్కరణ కోసం కర్నూలులోని స్టేడియంలో సాయంత్రం అయిదు గంటలకు జరుగుతుంది. ఈ సినిమాలో నటించిన నటీనటులు, సాంకేతిక నిపుణులు ఈ ఈవెంట్‌లో పాల్గొంటారు. ఈ సినిమా ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. అన్ని పనులు పూర్తి చేసుకుని నవంబర్ 27న విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. కన్నడ సూపర్ స్టార్ ఉపేంద్ర ఇందులో సూపర్ స్టార్ హీరోగా నటిస్తున్నారు. రామ్ పోతినేని సూపర్ స్టార్‌కు ఫ్యాన్‌గా నటించారు. మైత్రి మూవీస్ బ్యానర్ పై ఈ సినిమాను నిర్మించారు.

## తిరువీర్ హీరోగా కొత్త సినిమా షూటింగ్ ప్రారంభం



మసుధ సినిమాతో సక్సెస్ ఫుల్ హీరోగా పేరు తెచ్చుకున్న తిరువీర్ వరుసగా సినిమాలు చేస్తూ దూసుకుపోతున్నారు. ఈ నేపథ్యంలో మరో కొత్త సినిమా షూటింగ్ ప్రారంభించారు. ఆద్యా మూవీస్ బ్యానర్ పై నిర్మిస్తున్న కొత్త సినిమా షూటింగ్ ప్రారంభోత్సవంలో ప్రముఖ దర్శకుడు, నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ, తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యదర్శి దామోదర్ ప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పూజా కార్యక్రమాలతో షూటింగ్ ప్రారంభించుకున్న ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ కూడా త్వరలోనే జరుగుతుందని హీరో తిరువీర్ చెప్పారు. ఇది గ్రామీణ నేపథ్యంలో సాగే ప్రేమకథా చిత్రమని ఆయన తెలిపారు. కామెడి ప్రధానంగా సాగే చిత్రమని అన్నారు. ఈ చిత్రానికి నిర్మాత మహేంద్ర, దర్శకుడు వెంకట్, డిఓపి జగదీష్ పని చేస్తున్నారు.

## ప్రతీ పాత్ర కొత్త ప్రయాణమే..

### కామాక్షి భాస్కర్ల



హీరో అల్లరి నరేష్ అప్ కమింగ్ థ్రిల్లర్ '12ఏ రైల్వే కాలనీ'. నూతన దర్శకుడు నాని కాసరగడ్డ దర్శకత్వంలో, శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ బ్యాన్ప శ్రీనివాసా చిట్టూరి నిర్మించారు. కామాక్షి భాస్కర్ల హీరోయిన్‌గా నటిస్తున్నారు. నవంబర్ 21న ఈ సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా వ కామాక్షి భాస్కర్ల మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు.

**✻ ఈ కథ అనిల్ రాశారు కదా మరి ఎందుకు ఆయన డైరెక్షన్ చేయలేదు?**

పొలిమేర తర్వాత ఆయన కొన్ని ప్రాజెక్ట్స్ కమిట్మెంట్ అయ్యారు. డైరెక్టర్ నానితో పొలిమేర నుంచే మంచి జర్నీ వుంది. అనిల్ సూపర్విజన్‌లో నాని డైరెక్ట్ చేయడం జరిగింది.

**✻ ఈ సినిమాలో మీ క్యారెక్టర్ ఎలా ఉండబోతుంది?**

ఇందులో నరేష్‌కి జోడిగా కనిపిస్తాను. నా క్యారెక్టర్ పేరు ఆరాధన. నా క్యారెక్టర్ ఎక్కడ నుంచి వచ్చింది ఏం చేస్తుందనేది చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉంటుంది. తన పని మీదే శ్రద్ధ పెట్టే క్యారెక్టర్. అలాంటి లైఫ్‌లో వచ్చిన ప్రేమ స్టోరీ ఎలా ముందుకెళ్ళింది అనేది చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉంటుంది. ఆరాధన క్యారెక్టర్ ఈ సినిమాకి చాలా ఇంపార్టెంట్. తన క్యారెక్టర్ లేకపోతే ఈ కథ లేదు. సినిమా చూసిన తర్వాత నా క్యారెక్టర్ గుర్తుండిపోతుంది. అల్లరి నరేష్‌తో నటించడం అనేది నా కెరియర్‌కి చాలా మైలేజ్ ఇస్తుంది.

**✻ నరేష్‌తో వర్క్ చేయడం ఎలా అనిపించింది?**

నరేష్‌తో ఇంతకుముందు ఇట్లు మారేడుమిల్లి సినిమా చేశాను. నాకు చిన్నప్పటినుంచి నరేష్ పర్సనల్‌గా తెలుసు. నరేష్ చాలా సైలెంట్ పర్సన్. మేము ఎప్పుడు కూడా సినిమాలు గురించి మాట్లాడుతుంటాము. ఆయన అద్భుతమైన నటుడు. ఆయన నుంచి చాలా విషయాలు నేర్చుకున్నాను.

**✻ మీరు హీరోయిన్‌తో పాటు అన్ని రకాల పాత్రలు చేస్తున్నారు కదా?**

లైలా, డెకాయిట్ ఈ సినిమా సైన్ చేయడానికి ముందు చేసినవే. నవీన్ చంద్ర గారితో చేసిన షో టైం అనేది తర్వాత చేశాను. అయితే ముందు షో టైం రిలీజ్ అయింది. నిజానికి బయట నుంచి చూసేవాళ్ళకి ఒక సినిమాలో హీరోయిన్‌గా చేస్తుంది మరోసినిమాలో ఇంపార్టెంట్ క్యారెక్టర్ చేస్తుందనే అనే ఫీలింగ్ ఉండొచ్చు. కథలో కీలకమైన పాత్రలు చేయాలనే భావిస్తున్నాను. డెకాయిట్‌లోనా క్యారెక్టర్ చాలా ఇంపార్టెంట్. ఆ క్యారెక్టర్ లేకపోతే ఆ కథ ముందుకు వెళ్ళదు.

**✻ మీరు డాక్టర్ కదా.. ఇప్పటికీ ప్రాక్టీస్ చేస్తున్నారా?**

నేను జనరల్ ఫిజిషియన్‌ని. అపోలో ప్రాక్టీస్ చేశాను. అయితే కోవిడ్‌కి ముందు ఆపేశాను. ఇప్పుడు పూర్తిగా నటనతోనే బిజీగా ఉన్నాను. అయితే నేను పనిచేస్తున్న సినిమా సెట్‌లో నన్ను డాక్టర్‌గా యూజ్ చేస్తుంటారు. ఇండియన్ సినిమాలో పారామెడికల్ కల్చర్ తక్కువ. అలాంటి పారామెడికల్ కల్చర్‌ని తెలుగు సినిమాలో తీసుకు రావాలనే ఆలోచన ఉంది.

**✻ కొత్తగా చేస్తున్న సినిమాలు ఏంటి ?**

ప్రస్తుతం డెకాయిట్ షూటింగ్ జరుగుతోంది. ఇంకొక పెద్ద సినిమా ఉంది. అది మేకర్స్ అనౌన్స్ చేస్తారు. అలాగే పొలిమేర 3 కూడా మొదలు పెట్టాలి.

---



# మతోన్మాదులకు అడ్డుకట్ట



(మొదటి పేజీ తరువాయి)

మారుపాక అనిల్, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మణికంఠ రెడ్డి, రాష్ట్ర నాయకులు రెహమాన్, లక్ష్మీనారాయణ, జిల్లా సిపిఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**కమ్యూనిస్టుల ప్రాణ త్యాగం వల్లే రైతులకు భూములు : పశ్య పద్మ**

సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ పట్టణంలోని రాజీవ చౌరస్తా వద్ద నిర్వహించిన ప్రచార జాతాలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్య పద్మ మాట్లాడుతూ దేశంలో పదుల సంఖ్యలో రాజకీయ పార్టీలు పుట్టి మాయమైనప్పటికీ సిపిఐ మాత్రం తన సిద్ధాంతాలు, ప్రజల పట్ల నిబద్ధత, పోరాట స్ఫూర్తి వల్ల శతాబ్ద కాలంగా ప్రజల మధ్య మరింత బలంగా నిలుస్తోందని పేర్కొన్నారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తిరగబడి ప్రజలకు న్యాయం చేసిన మొదటి శక్తి సిపిఐ అని, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో వేలాది మంది కమ్యూనిస్టులు ప్రాణాలు అర్పించిన త్యాగం వల్లే పది లక్షల మంది రైతులకు భూములు అందాయన్నారు. సిపిఐ ప్రజల సమస్యలపై గళమెత్తే పార్టీగా, సామాజిక న్యాయనికి పోరాడే శక్తిగా నిలుస్తుందన్నారు. మంజీరా పరీవాహక ప్రాంతమైన నారాయణఖేడ్ నియోజకవర్గంలో రైతులు సాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాయిపల్లి ప్రాంతంలో నూతన ప్రాజెక్ట్ నిర్మించడం అత్యవసరం కావడంతో అధికారులు ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాంతంలో యువత నిరుద్యోగ సమస్య పెరుగుతోందని పశ్య పద్మ ఆందోళన వ్యక్తం చేశారు. స్థానికంగా పరిశ్రమలను ఏర్పాటు చేయడం ద్వారా వేలాది మంది యువతకు ఉద్యోగాలు కల్పించవచ్చని, ఇందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ జాతీయ అధ్యక్షుడు వలీ ఉల్లా ఖాద్రి, రైతు సమితి రాష్ట్ర అధ్యక్షుడు నరేంద్ర ప్రసాద్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎంబడి దత్తు రెడ్డి, పిహెచ్ అశోక్, కౌన్సిల్ సభ్యులు చిరంజీవి, ఇసాక్, సతీష్, స్థానిక నాయకులు పుష్పాల అశోక్, ప్రభాకర్, ప్రజా నాట్యమండలి సభ్యులు పాల్గొన్నారు. అంతకు ముందు రాజీవ్ చౌరస్తా వద్ద డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నేతలు ప్రణామాలు అర్పించారు. ఆ తరువాత ప్రచార జాతా మెదక్‌కు చేరుకుంది. సిపిఐ మెదక్ జిల్లా కార్యదర్శి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు టిఎం ఖాలేఖ్ ఆధ్వర్యంలో మెదక్ పట్టణంలో స్వాగత బోర్డు నుండి రామదాస్ చౌరస్తా వరకు ప్రచార జాతా నిర్వహించారు. అనంతరం బహిరంగ సభ నిర్వహించారు.

**కాలం చెరపలేనిది కమ్యూనిస్టు చరిత్ర : ఎమ్మెల్సీ సత్యం**

నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలో జరిగిన ప్రచార జాతాలో సిపిఐ ఎమ్మెల్యే నెల్లికంటి సత్యం, సిపిఐ రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యుడు బాలనర్సింహ్మా మాట్లాడుతూ... దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని పిలుపునిచ్చిన ఏకైక రాజకీయ పార్టీ సిపిఐ అని, అంతరాలు లేని సమాజం కోసం పోరాడుతూనే ఉందన్నారు. సిపిఐ నారాయణపేట జిల్లా సమితి ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌కు పూలమాలలు వేసి, బస్టాండ్ సమీపంలో కళా ప్రదర్శన నిర్వహించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి టి.నర్సింహులు అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ బిజెపి దేశ సంపదను అదానీ, అంబానీలకు కట్టబెడుతూ సమాజంలో ఆర్థిక అసమానతలను మరింత పెంచుతుందన్నారు. మత విద్వేషాలను రెచ్చగొట్టి ప్రజా సమస్యల నుంచి ప్రజల దృష్టి మళ్లిస్తుందన్నారు. మతపరమైన చీలిక తెచ్చి రాజకీయ లబ్ధి పొందుతుందని దీనికి వ్యతిరేకంగా పోరాడుతామన్నారు. సమాజంలో అంతరాలు ఉన్నంతవరకు ఎర్రజెండా పోరాడుతూనే ఉంటుందన్నారు. బాలనర్సింహ్మా మాట్లాడుతూ నారాయణపేట జిల్లా వలస కరువుకాటలతో అల్లాడుతున్నదని, జిల్లాపై పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని, ప్రజలు ఇకనైనా మేలుకొని ఈ ప్రాంతం అభివృద్ధి కోసం కమ్యూనిస్టు పార్టీ చేస్తున్న పోరాటాలతో కలిసి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి టి. నరసింహులు, నారాయణపేట జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. సంతోష్, వనపర్తి జిల్లా కార్యదర్శి విజయరాములు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటేష్, వెంకటయ్య, అబ్రహం, భరత్, నరసింహ శెట్టి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు డి.చెన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

కాగా, జాతా సాయంత్రం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి చేరుకుంది. చేరుకుంది. ప్రచార జాతాకు సిపిఐ శ్రేణులు ప్రజాసంఘాల నాయకులు మహిళలు హారతులిచ్చి బతుకమ్మలతో 100 అరుణ పతాకాలను ఆవిష్కరిస్తూ భారీ ఊరేగింపు చేపట్టారు. అనంతరం క్లాక్ టవర్ చౌరస్తాలో సభ నిర్వహించారు. ప్రచార జాతలో ప్రజానాట్యమండలి రాష్ట్ర కళాకారులు ముత్యాలు విప్లవ చైతన్య గీతాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బి.బాలకిషన్, ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షులు కురిమిద్ద శ్రీనివాస్, సిపిఐ మాజీ జిల్లా కార్యదర్శి బి.పరమేశ్వర్ గౌడ్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి.సురేష్, డి.రాము, అల్వాల్ రెడ్డి, కొండికంటి పద్మావతి, జిల్లా సమితి సభ్యుల కోటకదిర నరసింహ, భాష, గంటల శ్రీను, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రాజు, అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మణ్ రాజశేఖర్, ఎఐవైఎఫ్ జిల్లా కో కన్వీనర్ మహేష్, ప్రజానాట్యమండలి కళాకారులు, తదితరులు పాల్గొన్నారు.

---

## లారీని ఢీకొన్న ఆర్‌టిసి బస్సు

(మొదటి పేజీ తరువాయి)

ఇసుక లారీని గమనించక వేగంగా వెళ్లి లారీని వెనుకనుండి ఢీకొట్టింది. దీంతో బస్సులో ఎడమభాగం ముందు సీట్లో కూర్చున్న ఇద్దరు ప్రయాణికులు మృతిచెందగా, మరో ఆరుగురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. గాయలైన వారిలో స్వరాజ్య లక్ష్మి, గుర్రజు రవి కిరణ్, నంద కిషోర్, మురళీకృష్ణ, జి ప్రవీణ్, హర్షవర్ధన్ ఉన్నారు.సంఘటన సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి హుటాహుటిన చేరుకుని గాయపడిన వారిని 108 అంబులెన్స్‌లో జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదంలో బస్సులో హైదరాబాద్ దోమల్‌గూడకు చెందిన పులుంపారి ఓం ప్రకాశ్ (75) అక్కడికక్కడే మృతిచెందగా, మరొకరు హన్మకొండ బాలసముద్రానికి చెందిన నవ్‌జిత్ సింగ్ (52) తీవ్ర గాయాలతో కొట్టుమిట్టాడుతుండగా పోలీసులు అంబులెన్స్ వాహనంలో జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించగా తెల్లవారు జామున అతను చికిత్స పొందుతూ మృతిచెందాడు. బస్సులో మొత్తం 16 మంది ప్రయాణిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. బస్సు డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ సంఘటనపై మృతుడు నవ్‌జిత్ సింగ్ భార్య దల్బీర్ కౌర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని ధర్యాత చేస్తున్నట్లు ఎస్ఐ దూదిమెట్ల నరేష్ యాదవ్ తెలిపారు. ఇదిలా ఉంటే హన్మకొండ హైదరాబాద్ 163 జాతీయ రహదారిపై గోవర్ధనగిరి దర్గా దగ్గర, వెంకటాయపాలెం టోల్‌గేట్ దగ్గర నుండి నిడిగొండ వరకు ఎక్కడబడితే అక్కడ ఇష్టారాజ్యంగా ఇసుక లారీలు పార్కింగ్ చేయడం వల్లనే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని మండల ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా ఇలాంటి ప్రమాదాలు జరగకుండా సంబంధిత పోలీస్ శాఖ అధికారులు దృష్టి సారించి రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## సంస్కరణలు అవసరం

(మొదటి పేజీ తరువాయి)

సంఖ్యాకులు ఓటర్లుగా నమోదు చేసుకోలేకపోయారని ఆయన పేర్కొన్నారు. బీహార్ ఎన్నికల ఫలితాలు ఇండియా కూటమి పార్టీలను నిరాశ పరిచాయన్నారు. దీనిపై వారు నిశితంగా ఆత్మ పరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎపియుడబ్ల్యుజె ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడ ప్రెస్ క్లబ్ నిర్వహించిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో డి.రాజా మాట్లాడారు. దేశం నేడు సంక్లిష్ట పరిస్థితుల్లో ముందుకు సాగుతున్నదని, భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడ్డాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ఎన్నడూ పాల్గొనని ఆర్‌ఎస్ఎస్ తపాలా బిళ్ళను, ఆ సంస్థ శత వార్షికోత్సవం సందర్భంగా, కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం విడుదల చేయడం విడ్డూరంగా ఉందని ఆయన విమర్శించారు. వాస్తవానికి ఆర్‌ఎస్ఎస్ కు అసలు రిజిస్ట్రేషన్ కూడా లేదన్నారు. దానివల్ల దేశంలోని చట్టాలకు అది సమాధానం చెప్పాల్సిన బాధ్యత, అవసరం ఆ సంస్థకు లేదన్నారు. అటువంటి సంస్థ ఈనాడు స్వాతంత్ర ఉద్యమం, దేశభక్తి గురించి గొప్పలు చెప్పుకోవడాన్ని ఆయన ఎద్దేవా చేశారు. ఆర్‌ఎస్ఎస్ దేశ రాజ్యాంగాన్ని కానీ, జాతీయ పతాకాన్ని కానీ ఏనాడుడూ గౌరవించిన దాఖలాలు లేవన్నారు. ఆర్‌ఎస్ఎస్, బిజెపి కూటమి ఎన్నికల్లో అత్యధిక మెజారిటీ సాధించడం ద్వారా హిందూ రాజ్యాన్ని స్థాపించడానికి ప్రయత్నిస్తున్నాయని రాజా మండిపడ్డారు. దేశ అత్యున్నత చట్టసభైన పార్లమెంటు సక్రమంగా పనిచేయకపోతే ప్రజాస్వామ్యం మనుగడ సాధించలేదని రాజ్యాంగంలో స్పష్టంగా పేర్కొనబడిందన్నారు.

దేశంలో మతోన్మాద పార్టీలు, కార్పొరేట్ శక్తుల మధ్య సంబంధాలు బలంగా ఏర్పడ్డాయని, విశాఖ ఉక్కు కర్మాగారం తో సహా ప్రభుత్వ రంగ సంస్థలన్నీ కార్పొరేట్లకు అప్పచెప్పడమే ఇందుకు నిదర్శనమన్నారు. బీహార్ ఎన్నికల ఫలితాలు అనంతరం, ఇక పశ్చిమ బెంగాల్ వంతు అంటూ ప్రధాని మోదీ ప్రకటించడాన్ని ఆయన తప్పుపట్టారు. బెంగాల్ ఒక సునిసితమైన రాష్ట్రం అన్నారు. 2026లో తమిళనాడు, కేరళ, పశ్చిమబెంగాల్లో ఎన్నికలు జరగనుండగా, ఆ రాష్ట్రాల్లో కూడా పాగా వేసేందుకు ఇప్పటినుండే కుటిల ప్రయత్నాలు ప్రారంభమయ్యాయన్నారు. ఈ నేపథ్యంలో భారత రాజ్యాంగ, ప్రజాస్వామ్య రక్షణకు లౌకిక, వామపక్ష, ప్రజాస్వామ్య శక్తులన్నీ ఐక్యం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన పిలుపునిచ్చారు.

## జనరేషన్ జెడ్ దాడి

(మొదటి పేజీ తరువాయి)

అరెస్టు చేయగా, మరో 20 మందిపైన పాలనావ్యవస్థపై దాడులకు పాల్పడ్డారనే అభియోగాలు మోపారు. ఇంతేకాకుండా మెక్సికో దేశ వ్యాప్తంగా 50 నగరాలలో నిరసన ప్రదర్శనలు జరిగాయి. వీటిల్లో చాలా వరకూ శాంతియుతంగా జరిగాయి. పశ్చిమ రాష్ట్రం మిచికోన్ సహా మెక్సికో అంతటా ఈ ప్రదర్శనలు జరిగాయి. ప్రదర్శకులు తమను తాము 'జనరేషన్–జెడ్ గ్రూప్ ఆఫ్ మెక్సికో''గా ప్రకటించుకున్నారు. ఐతే దేశంలోని ప్రతిపక్షాలు ఈ యువకులకు పూర్తి మద్దతు తెలియజేశాయి. ప్రదర్శకులు రాళ్ళతో పోలీసులపై దాడి చేశారు. బాణసంచా పేల్చారు. చైన్లతో దాడి చేశారు. పోలీసులు ఆత్మరక్షణకు అడ్డుగా పెట్టుకున్న కవచాలను యువకుతు లాక్కున్నారు. ప్రదర్శకులు ప్రధానంగా సోషల్ మీడియాలో భారీ ప్రచారం చేస్తున్నారు. సోషల్ మీడియాలో వారు ఒక ప్రజా ప్రణాళికను పోస్టు చేశారు. ఈ ప్రణాళిక ప్రకారం దేశాధ్యక్షురాలిని పదవి నుండి తొలగించాలి. రిఫరెండం నిర్వహించాలి. న్యాయ వ్యవస్థలో సంస్కరణలు చేపట్టాలి. ప్రభుత్వ విధానాలలో ఎలాంటి దాపరికం లేకుండా బాహాటత్వ విధానం పాటించాలి. ప్రజలు హై సెక్యూరిటీ ఇవ్వాలనేవి ప్రధానాంశాలుగా ఉన్నాయి. ఉరుపాన్ మేయర్ కార్లోస్ మాంజోను 'డెడ్ ఆఫ్ ద పబ్లిక్ డే' అనేక కార్యక్రమంలో కొందరు నేరస్థులు కాల్చి చంపడంతో నిరసనలు పెల్లుబికాయి. దేశాధ్యక్షురాలు షీన్‌బామ్ పదవికి రాజీనామా చేయాలని ప్రదర్శకులు నినాదాలు చేశారు. కార్లోస్ మరణించలేదు, ప్రభుత్వమే అతడిని చంపిందని మరికొందరు ప్రదర్శకులు నినాదాలు చేశారు. నేరాలు,ఘోరాలు అదుపు చేయడానికి ప్రభుత్వం బలమైన చర్యలు తీసుకోవాలని మరికొందరు ప్రదర్శకులు నినాదాలు చేశారు. దేశంలో నేరాల సంఖ్య విపరీతంగా పెరిగిపోయిందని, అవినీతి పెరిగిందని, నేరాలకు అదుపూ అడ్డూ లేకుండా పోయిందని తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ మెక్సికోలోని 50 నగరాలలో వేలాదిమంది నిరసన ప్రదర్శనల్లో పాల్గొన్నారు. జెన్–జెడ్ బ్యానర్‌లను ప్రదర్శకులు ప్రదర్శించారు. యాంటీ–క్రైమ్ మేయర్ ఈ నెలారంభంలో హత్యకు గురికావడమే విద్యార్థులు, యువకుల ఆగ్రహానికి, నిరసనలకు ప్రధాన కారణం. దేశాధ్యక్షురాలు క్లాడియా షీన్‌బామ్ నివసించే నేషనల్ ప్యాలస్ చుట్టూ నిర్మించిన కంచెలను మెక్సికోలో ముసుగులు ధరించిన ప్రదర్శకులు కూల్చివేసి లోనికి ప్రవేశించేందుకు ప్రయత్నం చేశారు.

**ఈ ఏడాది అనేక దేశాల్లో జనరేషన్–జెడ్ నిరసనలు**

ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలలో పాలకుల విధానాలను, అవినీతి, నేరాలను ప్రతిఘటిస్తూ ఈ ఏడాది జనరేషన్–జెడ్ నిరసన ప్రదర్శనలు జరిగాయి. ముఖ్యంగా నేపాల్‌లో సెప్టెంబరులో జరిగిన జనరేషన్–జెడ్ నిరసన ప్రదర్శన ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. మూడురోజులు జరిగిన ఈ నిరసన ప్రదర్శనల కారణంగా నేపాల్ ప్రభుత్వం కుప్పకూలింది. ప్రధానమంత్రి పదవికి రాజీనామా చేశారు. జనరేషన్–జెడ్ మద్దతుతో కొత్త ప్రభుత్వం ఏర్పడింది. 1990 నుండి 2010 వరకూ ప్రపంచంలో అనేక దేశాలలో అసమానతలు, అవినీతి, ప్రజాస్వామ్యంకోసం ఉద్యమాలు జరిగాయి. సోషల్ మీడియా ద్వారా అన్ని దేశాలలోనూ జనరేషన్–జెడ్ ఉద్యమాలు రూపుదిద్దుకుంటున్నాయి. ఇప్పుడు అదే తరహాలో మెక్సికోలో కూడా యువకులు దేశాధ్యక్షురాలి ఇంటిని చుట్టుముట్టేందుకు ప్రయత్నం చేశారు. మెక్సికో అధ్యక్షురాలి రాజీనామాకు డిమాండ్ చేశారు. ''మాకు మరింత భద్రత కావాలి'' అని మెక్సికో ప్రదర్శనలో పాల్గొన్న 29 ఊళకళ బిజినెస్ కన్సల్టెంట్ ఆడ్రెస్ మస్సా చెప్పారు. ప్రభుత్వ వైద్య వ్యవస్థ నిర్వీర్యమైందని, ఈ వ్యవస్థను పునరుద్ధరించాలని ఈ ప్రదర్శనలో పాల్గొన్న 43 ఏళ్ళ వయసుగల ఫిజిషియన్ అరిజ్‌బెత్ గార్సియా డిమాండ్ చేశారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com